ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 17.11.2025 | సంపుటి :12 సంచిక : 117 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# నేడు కేబినెట్ భేటీ

## స్థానిక సంస్థల నిర్వహణ తేదీ, బీసీ రిజర్వేషన్ల అమలుపై కీలకనిర్ణయం వెలువడే అవకాశం

## గిగ్‌వర్కర్ల విధానంపైనా సమావేశంలో నిర్ణయం



**హైదరాబాద్(జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తేదీలపై, బీసీ రిజర్వేషన్ల అమలే ఎజెండాగా నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. వీటిపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించినందున ఇదే ఉత్సాహంతో 'స్థానిక' ఎన్నికలకు సైతం వెళ్లాలని కొందరు మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు సమాచారం. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని గతంలో ఆ పార్టీ చెప్పింది. కానీ, ఇదే అంశంపై హైకోర్టులో కేసు విచారణ పెండింగులో ఉన్నందున ఎలా ముందుకెళ్లాలనే అంశంపై మంత్రివర్గం చర్చించనున్నట్లు తెలుస్తోంది. కేసు విచారణలో ఉన్నందున... చట్ట ప్రకారం అధికారికంగా అమలు వెంటనే వీలుకాకపోతే

మిగతా 2లో..

## రాజస్థాన్ ప్రభుత్వ కార్యదర్శిగా

# తెలంగాణ బిడ్డ

- సీఎస్‌గా ఐఏఎస్ అధికారి ఓరుగంటి శ్రీనివాస్
- స్వగ్రామం భద్రాద్రికొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం
- రాజస్థాన్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఢిల్లీనుంచి బదిలీ
- మరుసటి రోజే సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



**న్యూఢిల్లీ (జనంసాక్షి):** రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1989 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఓరుగంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదులు, పింఛన్లు, పింఛనుదారుల సంక్షేమం విభాగం కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు దిల్లీ నుంచి స్వరాష్ట్ర క్యాడర్‌కు తిప్పి పంపిన మరుసటి రోజే సీఎస్‌గా నియమిస్తూ రాజస్థాన్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ఈ నెల 17న బాధ్యతలు స్వీకరించనున్నారు. తండ్రి జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమంలో చీఫ్ ఎంటమాలజిస్ట్‌గా అరకు లోయలో పనిచేస్తున్నప్పుడు ఈయన అక్కడే 1966 సెప్టెంబరు 1న జన్మించారు.

మిగతా 2లో..

## బీహార్ సీఎంగా

# మళ్లీ నితీష్..

## నవంబర్ 19 లేదా 20 తేదీలలో కొత్త ప్రభుత్వం

## మంత్రివర్గంలో సింహభాగం భాజపాకు..



**పాట్నా(జనంసాక్షి):** ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే విజయం సాధించడంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి నేతలు చర్యలు చేపట్టారు. మరోసారి బిహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని కూటమి వర్గాలు పేర్కొన్నాయి. నవంబర్ 19 లేదా 20 తేదీలలో కొత్త ప్రభుత్వం కొలువు తీరే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఇందుకు పట్నాలోని గాంధీ మైదానం వేదిక కానున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం గాంధీ మైదానంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ఆదివారం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు సమర్పించనుందని.. ఆ తర్వాత కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రమాణస్వీకారానికి 19 లేదా 20లలో ఏ తేదీని నిర్ణయిస్తారనే విషయం ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపాయి. సోమవారం

మిగతా 2లో..

# రామోజీ ఆలోచనలు ఆదర్శం

- ఆలోచనలను సంస్థలుగా తీర్చిదిద్దిన వ్యక్తి..
- రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- ఇది నాకు దక్కిన గౌరవం: జిష్ణుదేవ్ వర్మ
- ప్రజల పక్షాన పోరాడిన యోధుడు రామోజీ : ఏపీ సీఎం చంద్రబాబు
- పాత్రికేయ రాజర్షి : వెంకయ్యనాయుడు
- రామోజీ పత్రికా రంగంలో దీపస్తంభంగా నిలిచారు: జస్టిస్ ఎన్.వి.రమణ

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆలోచనలను సంస్థలుగా తీర్చిదిద్దిన వ్యక్తి.. రామోజీరావు అని ఉపరాష్ట్రపతి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ"రామోజీ ఓ కుగ్రామం నుంచి వచ్చి ఎంతో గొప్పస్థాయికి చేరారు. ఆలోచనలను సంస్థలుగా తీర్చిదిద్దిన వ్యక్తి.. రామోజీరావు. దేశంలో ఎక్కడ విపత్తు వచ్చినా రామోజీరావు స్పందించేవారు. రామోజీరావు దానం చేస్తూ ప్రజలనూ భాగస్వాములను చేసేవారు. సమాజానికి స్ఫూర్తిగా నిలవడమే ఓ గొప్ప విజయం. స్రిప్టుతో వస్తే ఫస్ట్ ప్రింట్‌తో వెళ్లేలా ఆర్ఎఫ్‌సీని రామోజీ తీర్చిదిద్దారు. మీడియా సంస్థలు

మిగతా 2లో..



## రామోజీ ఫిలింసిటీ

# మహాద్భుతం

### ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రానికి ఫోర్త్ వండర్‌గా రామోజీఫిల్మ్‌సిటీ నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణంగా నిలిచాయని పేర్కొన్నారు. ఆదివారం రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "రామోజీ అవార్డుల ఆలోచన చేసిన ఆయన కుటుంబ సభ్యులను

మిగతా 2లో..

# పుట్ట మధుకు సీబీఐ నోటీసులు

### అడ్వకేట్స్ నాగమణి, వామన్ రావు దంపతుల జంట హత్య కేసులో మరో కీలక పరిణామం



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో హైకోర్ట్ అడ్వకేట్స్ నాగమణి, వామన్ రావు దంపతుల జంట హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు సీబీఐ నోటీసులు జారీ చేసింది. దీంతో, ఆయన విచారణకు హాజరు కానున్నారు. వివరాల ప్రకారం.. హైకోర్ట్ అడ్వకేట్స్ నాగమణి, వామన్ రావు దంపతుల జంట హత్య కేసు విచారణలో సీబీఐ స్పీడ్ పెంచింది.

# వరుసపెట్టి ప్రయోగాలు

## ఈ ఏడాది 7 ప్రాజెక్టులతో బిజీబిజీగా ఇస్రో..

- చంద్రయాన్, గగన్‌యాన్‌లపై కీలక అప్‌డేట్
- 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రం: ఛైర్మన్ వి.నారాయణన్






**బెంగళూరు(జనంసాక్షి):** రాబోయే కొన్ని రోజుల్లో ఇస్రోకు భారీ ప్రణాళికలు ఉన్నట్లు ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఈ సంవత్సరం సహా రాబోయే కొన్నేళ్లలో సంస్థ ముందున్న లక్ష్యాలను ఆయన పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఈ సందర్భంగా గగన్‌యాన్, చంద్రయాన్ మిషన్‌లతో పాటు ఇతర ఉపగ్రహాల ప్రయోగాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇస్రో ప్రస్తుతం అత్యంత బిజీగా మారిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు మరో ఏడు ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు నారాయణన్ తెలిపారు. వీటిలో ఒక వాణిజ్య కమ్యూనికేషన్ ఉపగ్రహ ప్రయోగం ఉన్నట్లు వెల్లడించారు. వీటిలోనే పీఎస్ఎల్‌వీ, గగన్‌యాన్ మిషన్లు కూడా ఉన్నాయి. పూర్తిగా దేశీయంగా తయారు చేసిన పీఎస్ఎల్‌వీ ప్రయోగం కూడా ఇందులోనే ఉండడం విశేషం.

**చంద్రుడి మట్టి నమూనాలు:** చంద్రయాన్-4 మిషన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఇస్రో చీఫ్ వెల్ల డించారు. చంద్రుడి నుంచి మట్టి నమూనాలను భూమికి తీసుకురావడమే దీని లక్ష్యమన్నారు. 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

మిగతా 2లో..

## రాజ్యాంగం కల్పించిన హక్కులపై

# అవగాహన ఉండాలి

- వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించింది
- రాజ్యాంగాన్ని అంబేడ్కర్ ఓ స్థిర పత్రంగా భావించలేదు : సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్



**అమరావతి(జనంసాక్షి):** ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో మంగళగిరిలో కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "సాంఘిక ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు

మిగతా 2లో..

# కదులుతున్న డొంక

- ఎర్రకోట పేలుళ్ల కేసులో కొనసాగుతున్న అరెస్టుల పర్వం
- తాజాగా ఇద్దరు వైద్యులు ప్రియాంకశర్మ, అమిర్ రషీద్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఇటీవల అరెస్టు చేసిన అదీల్ అహ్మద్‌తో వైద్యురాలికి పరిచయం ఉన్నట్లు గుర్తింపు
- ఆత్మాహుతి బాంబర్ కోసం ఏడాదిగా అన్వేషణ..
- ఉగ్రనెట్‌వర్క్ కేసులో కొత్త కోణం వెలుగులోకి..
- పేలుడుకు పది రోజుల ముందు నూహ్‌లోనే ఉమర్..!



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దిల్లీ పేలుడు ఘటనతో అప్రమత్తమైన భారత బలగాలు దేశవ్యతిరేక శక్తుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. వైట్ కాలర్ టెర్రరిజంపైనా దృష్టి సారించాయి. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న హరియాణాకు చెందిన వైద్యురాలు ప్రియాంక శర్మను అదుపులోకి తీసుకున్నట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధమున్న అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ అనే ముగ్గురు వైద్యులను ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిలో ఒకరైన అదీల్ అహ్మద్‌తో ఆమెకు పరిచయం ఉన్నట్లు పేర్కొన్నారు.

మిగతా 2లో..

# లైటింగ్ పెంచడంవల్ల ఏర్పడిన వేడితోనే..

- పోలీస్ స్టేషన్‌లో భారీ విస్ఫోటం!
- ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిన అధికారులు

2లో..

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతి

**చర్ల(జనంసాక్షి):** ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా జిల్లాలోని

మిగతా 9లో..





## దక్షిణచైనా సముద్రంలో

# మళ్లీ ఉద్రిక్తతలు

### ఉమ్మడి గస్తీకి ప్రతిస్పందనగా 'బాంబర్ పెట్రోలింగ్' నిర్వహించిన చైనా

**బీజింగ్(జనంసాక్షి):** దక్షిణ చైనా సముద్రంలో అమెరికా, జపాన్‌లతో కలిసి ఫిలిప్పీన్స్ ఇటీవల రెండు రోజుల పాటు నౌకాదళ విన్యాసాలు చేపట్టిన సంగతి తెలిసిందే. దీనికి చైనా ప్రతిస్పందన చర్యలు చేపట్టింది. రెచ్చగొట్టే, ఉద్రిక్తతలు పెంచే చర్యలు మానుకోవాలని ఫిలిప్పీన్స్‌కు చైనా హితవు పలికింది. ఇదే సమయంలో ఫిలిప్పీన్స్‌కు హెచ్చరికలు చేస్తూ వివాదాస్పద ప్రాంతంలో తొలిసారిగా యుద్ధ విమానాలతో 'బాంబర్ ఫార్మేషన్ పెట్రోలింగ్' నిర్వహించింది. దక్షిణ చైనా సముద్రం అంతా తమదేనని వాదిస్తున్న చైనాకు

మిగతా 2లో..

## జనగామ జిల్లాలో

# ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఇద్దరి మృతి..మరో ఆరుగురికి గాయాలు

**రఘునాథపల్లి(జనంసాక్షి):** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలో రోడ్డు ప్రమాదం జరిగింది. నిడిగొండ వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. ముందు వెళ్తున్న లారీని వరంగల్-1 డిపోనకు చెందిన ఆర్టీసీ రాజధాని బస్సు ఢీకొంది. ప్రమాద తీవ్రతకు బస్సు నుజ్జునుజ్జయింది. ఈ బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. మృతులను హనుమకొండలోని బాలసముద్రానికి చెందిన నవజీత్ సింగ్, హైదరాబాద్ దోమలగూడకు చెందిన ఓం ప్రకాశ్‌గా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.




## బీహార్ ఎన్నికల కోసం ప్రపంచ బ్యాంకు నిధులు

# దారిమళ్లించారు

### ఎన్డీయే ప్రభుత్వం రూ.14 వేల కోట్లు దుర్వినియోగం చేసింది

### ప్రశాంత్ కిశోర్ తీవ్ర ఆరోపణలు

**పాట్నా(జనంసాక్షి):** ఎన్నికల వ్యూహకర్తగా దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సొంత రాష్ట్రమైన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాలపై ఆదివారం మీడియాతో మాట్లాడిన ప్రశాంత్ కిశోర్ ఎన్డీయే కూటమిపై తీవ్ర ఆరోపణలు చేశారు. దేశంలో పలు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేటాయించిన రూ.14 వేల కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను బిహార్ ఎన్నికల సమయంలో ఎన్డీయే ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు బిహార్‌లోని మహిళల ఖాతాల్లో వేసిన రూ.10 వేలు ఈ నిధుల నుంచి మళ్లించినవేనన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి ఎన్నికల

మిగతా 2లో..


## జెన్-జెడ్ తిరుగుబాటుతో

# అట్టుడికిన మెక్సికో

### మెక్సికో నేషనల్ ప్యాలెస్ వద్ద టెన్షన్

**మెక్సికో(జనంసాక్షి):** మెక్సికో వీధుల్లో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జెన్-జెడ్('జెనరేషన్-జీ') నిరసనలు ఉద్రిక్తతలకు దారి తీశాయి. మెక్సికోలో మేయర్ దారుణ హత్య.. పెరిగిపోతున్న హింసపై యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలు.. ఏకంగా అధ్యక్ష భవనం ముట్టడి వరకు వెళ్లాయి. దీంతో, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జెన్-జెడ్, పోలీసులు మధ్య ఘర్షణల కారణంగా దాదాపు వంద మందికి పైగా పోలీసులు గాయపడ్డినట్టు సమాచారం. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మెక్సికో సిటీలో శనివారం జెన్-జెడ్ నిరసనలు హింసాత్మకంగా మారాయి. అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్

మిగతా 2లో..



## ఇమ్మడి రవితోనే ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లు క్లోజ్

### మూసివేయించిన అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):** పైరసీ సినిమాలకు వేదికగా మారిన ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లను సైబర్ క్రైమ్ పోలీసులు మూసివేయించారు. శనివారం అరెస్టయిన ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవితోనే వాటిని క్లోజ్ చేయించారు. వెబ్ లాగిన్స్, సర్వర్ వివరాలతో మూసివేశారు. 'నా వద్ద కోట్ల మంది డేటా ఉంది. ఈ వెబ్‌సైట్ మీద ఫోకస్

మిగతా 2లో..



జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 17.11.2025

# రాజస్థాన్ ప్రభుత్వ కార్యదర్శిగా తెలంగాణబిడ్డ

పుష్కరకాలంపాటు అరకులోయ, తెలంగాణలోని దుమ్ముగూడెంలో పెరిగారు. భద్రాచలం పంచాయతీస్కూల్‌లో చదివారు. ఓయూలో 1987లో కెమికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, 1989లో ఎంటెక్ పూర్తిచేశారు. తర్వాత ఐఏఎస్‌కి ఎంపికయ్యారు. ఆయన 2026 సెప్టెంబరు వరకు రాజస్థాన్ సీఎస్‌గా కొనసాగుతారు. తనకు అరకులోయలోని గిరిజనులతో మరువలేని జ్ఞాపకాలున్నట్లు ఇటీవల ఆయన రాసిన 'టువర్డ్స్ ఏ న్యూ ఇండియా' పుస్తకంలో పేర్కొన్నారు. ఈయన జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కూడా. మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు మనుమరాలిని శ్రీనివాస్ వివాహం చేసుకున్నారు. విశాఖపట్నంలో సెప్టెంబరు 22-23 తేదీల్లో జరిగిన 28వ నేషనల్ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌లో ఓరుగంటి శ్రీనివాస్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. "90వ దశకం నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కి మీరు ఇచ్చిన ప్రాధాన్యం ప్రభుత్వ, సంస్థల పనితీరును మార్చి కోట్లమందికి ప్రయోజనం చేకూరింది. నేను అండర్ సెక్రటరీగా చేరినప్పుడు మీరు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు నేను 37 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకోబోతున్న తరుణంలోనూ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. మీరు దేశానికి చేసిన సేవలకు మేం చేస్తున్న సెల్యూట్‌ను స్వీకరించండి" అని చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల అవగాహన ఉండాలి'

అప్పగిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన ప్రసంగం.. ప్రతి న్యాయవాదికి కంఠోపాఠం కావాలి. రాజ్యాంగాన్ని అంబేద్కర్ ఓ స్థిర పత్రంగా చూడలేదు. కాలానుగుణంగా మార్పులు అవసరమనే భావించారు. అంశం ప్రాధాన్యతను బట్టి సవరణ విధానాలను పొందుపరిచారు. కొన్ని అంశాల్లో సవరణ సులభం.. కొన్ని అంశాల్లో చాలా కఠినం. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన మరుసటి ఏడాదే రిజర్వేషన్ల అంశంపై మొదటి సవరణ చేసుకున్నాం. రాజ్యాంగ సవరణ అంశంపై కేంద్రానికి, సుప్రీంకోర్టుకు మొదట్లో కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కేశవానంద భారతి కేసులో రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని సవరించరాదని సుప్రీంకోర్టు చెప్పింది. 1975 వరకు ఆదేశిక సూత్రాల కంటే ప్రాథమిక హక్కులకే ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. కేశవానంద భారతి కేసు తర్వాత ప్రాథమిక హక్కులతో పాటు ఆదేశిక సూత్రాలకూ సమ ప్రాధాన్యం దక్కింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా గతేడాది ఏడుగురు జడ్జిల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రిమీలేయర్ విధానం ఉండాలన్నది నా అభిప్రాయం. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష ఉండరాదని విశాఖ కేసు తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. కొన్నేళ్లుగా మహిళలు న్యాయ విద్యలో బాగా రాణిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రజలకు అవగాహన ఉండాలి" అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు.

# జెన్-జెడ్ తిరుగుబాటు..

నివసించే నేషనల్ ప్యాలెస్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలను ముసుగులు ధరించిన కొందరు నిరసనకారులు కూల్చివేశారు. నిరసనకారులు ప్రస్తుత అధ్యక్షురాలి పార్టీకి వ్యతిరేకంగా "మోరెనా గద్దె దిగు" అంటూ నినాదాలు చేశారు. "కార్లోస్ చావలేదు, ప్రభుత్వమే చంపింది" అంటూ నేరాలను, హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్యక్ష భవనంలోకి దూసుకెళ్తే ప్రయత్నం చేశారు. దీంతో అల్లర్లను అదుపుచేసే పోలీసులకు, ప్రదర్శనకారులకు మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. అనంతరం, పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా మెక్సికో సిటీ ప్రజా భద్రతా కార్యదర్శి పాబ్లో వాజ్‌క్వెజ్ మాట్లాడుతూ ఈ ఘర్షణల్లో 100 మంది పోలీసులకు గాయాలయ్యాయి. వారిలో 40 మంది ఆసుపత్రిలో చేరారు. మరో 20 మంది పౌరులు కూడా గాయపడ్డారు. ఘర్షణల్లో భాగంగా మరో 20 మందిని అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల ఒకటో తేదీన, పశ్చిమ రాష్ట్రమైన మికోకాన్‌లోని ఉరుపాన్ నగర మేయర్, కార్లోస్ మంజో, నేర వ్యతిరేక విధానాలకు పేరుగాంచిన వ్యక్తి. ఆయనను 'డే ఆఫ్ ది డెడ్' బహిరంగ కార్యక్రమంలో దుండగులు కాల్చి చంపారు. ఈ దారుణ హత్య దేశవ్యాప్తంగా యువతలో తీవ్ర ఆగ్రహాన్ని రేపింది. ప్రభుత్వాలు హింసను అరికట్టడంలో విఫలమయ్యాయంటూ నిరసనలకు పిలుపునిచ్చింది. దీంతో మెక్సికో సిటీతో పాటు పలు నగరాల్లో వేలాది మంది యువత ప్రదర్శనలు చేపట్టారు.

# బీహార్ ఎన్నికల కోసం ప్రపంచ బ్యాంకు నిధులు దారిమళ్లించారు

షెడ్యూల్ ప్రకటించే వరకు నీతీశ్ ప్రభుత్వం ఓట్లను కొనుగోలు చేయడానికి దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసిందని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ఈ చర్యల ద్వారా ఎన్డీయే నేతలు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసినట్లు స్పష్టంగా తెలుస్తోందని.. ఈ విషయంపై ఎన్నికల కమిషన్ సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. బిహార్ ఎన్నికలకు ముందు 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' పేరుతో ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. మహిళా సాధికారత, స్వయం ఉపాధి కల్పించడం కోసం ఈ నగదు అందించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తర్వాత వివిధ దశల్లో ఆ సహాయం రూ.2 లక్షల వరకు ఉండనుందని.. స్వయం ఉపాధి కోసం పశుపోషణ, వ్యవసాయం, టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చని బిహార్ ప్రభుత్వం వెల్లడించింది.

### ఇమ్మడి రవితోనే ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లు క్లోజ్!

చేయటం ఆపండి' అంటూ గతంలో అతడు పోలీసులకు సవాల్ విసిరినట్లు సామాజిక మాధ్యమాల్లో ఓ లేఖ చక్కర్లు కొట్టింది. ఈ నేపథ్యంలో ఆ సవాల్‌ను స్వీకరించి ఇమ్మడి రవితోనే పోలీసులు ఆయా వెబ్‌సైట్లను క్లోజ్ చేయించడం గమనార్హం. ఇమ్మడి రవి వద్ద స్వాధీనం చేసుకున్న వందల హార్డ్ డిస్క్‌లను పోలీసులు విశ్లేషిస్తున్నారు. నిందితుడి బ్యాంక్ ఖాతాల వివరాలను పరిశీలిస్తున్నారు. ఇమ్మడి రవిని కస్టడీకి తీసుకుని మరిన్ని వివరాలు సేకరించాలని భావిస్తున్నారు. సోమవారం నాంపల్లి కోర్టులో కస్టడీ పిటిషన్‌ను పోలీసులు దాఖలు చేయనున్నారు.

# నేడు కేబినెట్ భేటి

పార్టీపరంగా 42% రిజర్వేషన్ల అమలు ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కొందరు పార్టీ నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు సమాచారం. ఈ అంశంపై మంత్రివర్గంలో కూలంకషంగా చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. 17న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ ఎన్నికలపై చర్చిస్తామని ఇటీవల సీఎం కూడా తెలిపారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న గిగ్ వర్కర్ల నూతన విధానంపైనా చర్చించి ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో పెండింగులో ఉన్న పలు అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు రావాల్సి ఉంది. వాటి వివరాలపైనా మంత్రివర్గంలో చర్చించి, నివేదిక రూపొందించి రాష్ట్ర ఎంపీలకు పంపాలని ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చే నెల నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఎంపీలకు ప్రభుత్వం సూచించనున్నట్లు తెలుస్తోంది.



# రామోజీ ఆలోచనలు ఆదర్శం

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలను నిర్మించాలి. ఏఐ యుగంలో ఫేక్ న్యూస్‌ను కనిపెట్టడం సవాలుగా మారింది. రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డు విజేతలకు నా అభినందనలు. రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులు చరిత్ర సృష్టించబోతున్నాయి. తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి సహకరిస్తాం. సమస్యల పరిష్కారం కోసం సీఎంలు ముందుకు వస్తే సహకరిస్తాం. తెలుగు రాష్ట్రాల సమస్యలు కుటుంబంలోని సమస్యల్లాంటివే. కలసి కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయి" అని అన్నారు.

**ఇది నాకు దక్కిన గౌరవం: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

రామోజీరావు పేరిట ఏడు అవార్డులు ఇవ్వడం ప్రశంసనీయమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజాసేవ కోసం రామోజీరావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఏడు రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు దక్కడం ఆయా రంగాల్లో వారి కృషికి గుర్తింపు అని అన్నారు. అవార్డు గ్రహీతలంతా దీనిని ఓ బాధ్యతగా గుర్తించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. రామోజీరావు 89వ జయంతిని పురస్కరించుకొని రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీం కోర్టు పూర్వ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొన్నారు.

**ప్రజల పక్షాన పోరాడిన యోధుడు: చంద్రబాబు**

నమ్మిన సిద్ధాంతాల కోసం రామోజీరావు దేనినైనా వదులుకునేవారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ఆలోచన ఎంతో ప్రశంసనీయమని, ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థలు చిరస్థాయిగా ఉంటాయని చెప్పారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళ-సంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ విభాగాల్లో అవార్డులు ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రజల పక్షాన బలంగా పోరాడిన యోధుడు రామోజీరావు అని కొనియాడారు. ప్రతిపక్షం బలహీనంగా ఉంటే రామోజీయే ఆ పాత్ర పోషించారని చెప్పారు. "అక్షర యోధుడు రామోజీరావుకు నివాళులు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరిశ్వాస వరకూ ఆయన పోరాడారు. ఆయన సేవలను ఎప్పటికీ మర్చిపోలేం. ఉన్నత విలువలతో నడుస్తున్న సంస్థ ఈనాడు. ఈ పత్రిక ద్వారా రామోజీరావు.. ప్రజలను సమాజసేవలో భాగస్వాములను చేశారు. ఎలాంటి విపత్తు వచ్చినా సొంత డబ్బుతో సేవలు అందించారు. ఆయన ఒక్క పిలుపు ఇస్తే ప్రజలు బాగా స్పందించేవారు. ఒక సీఎంగా తెలుగు భాషను కాపాడేందుకు ఏమైనా చేస్తా. రామోజీ స్ఫూర్తిగా తెలుగు భాషకోసం సంరక్షణ కోసం ప్రయత్నిస్తా" అని చంద్రబాబు అన్నారు.

**పాత్రికేయ రాజర్షి :వెంకయ్యనాయుడు**

మహోన్నత వ్యక్తి, బహుముఖ ప్రజ్ఞాశాలి.. అక్షర శక్తికి సరికొత్త నిర్వచనమిచ్చిన పాత్రికేయ రాజర్షి రామోజీరావు అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. స్వయం కృషి, క్రమశిక్షణ, పట్టుదల, చిత్తశుద్ధి, కార్యదీక్షలే ఆయుధాలుగా అనేక రంగాల్లో విజయాలు సాధించి భవిష్యత్ తరాలకు మార్గదర్శనం చేశారని కొనియాడారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడారు. "రామోజీరావు లేని ఆయన సంస్థలను ఊహించుకోలేకపోతున్నా. ఆయన ఒక వ్యక్తి కాదు శక్తిమంతమైన వ్యవస్థ. జనహితమే జర్నలిజం అని నమ్మి ఆచరించిన మహా మనిషి. సాధారణ రైతు బిడ్డ స్థాయి నుంచి.. ప్రపంచమంతా తెలుగువారి వైపు చూసేలా ఎదిగిన ఆయన జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం. వారి సంస్థల ద్వారా ఎంతోమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం పొందారు.

# పుట్ట మధుకు సీబీఐ నోటీసులు

ఈ క్రమంలో పుట్ట మధుకు సీబీఐ నోటీసులు జారీ చేసింది. రేపు రామగుండంలో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఇక, ఇప్పటికే మృతుడు వామన్ రావు తండ్రి కిషన్ రావుతో పాటు, వారి కుటుంబీకులు, బంధువులు, పలువురిని సీబీఐ విచారించింది. కాగా, రామగుండం కమిషనరేట్ కేంద్రంగా గత నెల రోజుల నుంచీ ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరుగుతోంది. అయితే, పుట్ట మధు సీబీఐ విచారణతో ఈకేసుకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

# బీహార్ సీఎంగా మళ్లీ నితీష్

జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు ఆమోదం తెలిపే అవకాశమున్నట్లు తెలస్తోంది. ఈ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత నీతీశ్ తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. తద్వారా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమవుతాయి. కొత్త ప్రభుత్వంలో మంత్రివర్గ కూర్పు కోసం కేంద్రమంత్రి అమిత్‌షాతో కూటమి నేతలు శనివారం సమావేశమైనట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో భాజపాకు సింహభాగం వాటా దక్కే అవకాశం ఉన్నట్లు కూటమి వర్గాలు పేర్కొన్నాయి. తర్వాతి స్థానంలో జేడీయూ ఇతర పార్టీలు ఉన్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్)కి మూడు మంత్రి పదవులు ఇవ్వనున్నట్లు సమాచారం.

## రామోజీ ఫిలింసిటీ
# మహాద్భుతం

అభినందిస్తున్నా. రామోజీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని వారు భావించడం ప్రశంసనీయం. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరమంటే నాలుగు అద్భుతాలు గుర్తొస్తాయి. అందులో మొదటిది ఛార్మినార్, రెండోది గోల్కొండ, మూడోది హైటెక్ సిటీ, నాలుగు.. రామోజీ ఫిల్మ్‌సిటీ. తెలుగు సినీ పరిశ్రమ నంది అవార్డులతో మొదలై.. ఆస్కార్ అవార్డుల వరకు ఎదిగిందంటే ఈ ప్రాంతంలో కట్టిన స్టూడియోలతో పాటు రామోజీ ఫిల్మ్ సిటీ కూడా ఎంతో తోడ్పాటునందించింది. "ఈనాడు దిన పత్రిక 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఉదయం లేవగానే ఈనాడు పేపర్ చదవడం.. రాత్రి ఈటీవీ న్యూస్ చూసి నిద్రపోవడం రామోజీరావు తెలుగు ప్రజలకు అలవాటుగా మార్చారు. రాజకీయ నాయకులకు ఈ అలవాటు వ్యసనంగా మారింది. ఉదయం నాకు ఎన్ని పత్రికలు వచ్చినా ఈనాడు పేపర్ కచ్చితంగా చదువుతా. నిఖార్సైన నిజం ఏంటో తెలుసుకోవాలంటే ఈనాడు చదవాల్సిందే. ఇంటి వద్ద ఉన్నా.. ఎక్కడికి వెళ్లినా.. రాత్రి 9గంటలకు ఈటీవీ న్యూస్ తప్పనిసరిగా చూస్తా. వాళ్ల ఆలోచనలను కాకుండా.. జరిగిన వాస్తవాలను ప్రజలకు అందించాలన్న స్ఫూర్తి .. ఈనాడు, ఈటీవీలో కనిపిస్తుంది. పొంతన లేని వివిధ రంగాల్లో ఒకే వ్యక్తి రాణించడం చాలా కష్టం. రోజుకు 18 గంటలకు శ్రమించిన రామోజీరావు.. ఏ రంగంలో అడుగు పెట్టినా నంబర్ వన్‌గా నిలిచారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

### దక్షిణచైనా సముద్రంలో మళ్లీ ఉద్రిక్తతలు

చెక్ పెట్టేందుకు.. అమెరికా, జపాన్‌లతో కలిసి ఫిలిప్పీన్స్ సంయుక్తంగా నౌకాదళ విన్యాసాలు నిర్వహించింది. దీంతో ప్రతి చర్యలకు దిగిన చైనా.. అదే ప్రాంతంలో బాంబర్ ఫార్మేషన్ పెట్రోలింగ్ చేపట్టింది. ఈ విషయాన్ని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ దక్షిణ విభాగ కమాండ్ ధ్రువీకరించింది. బయటి శక్తులతో కుమ్మక్కై ఫిలిప్పీన్స్ ఉమ్మడి గస్తీ నిర్వహిస్తోందని, ఇది ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీస్తుందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే రెచ్చగొట్టే, ఉద్రిక్తతలను ఆపాలని హెచ్చరిస్తున్నట్లు పేర్కొంది.

# లైటింగ్ పెంచడంవల్ల ఏర్పడిన వేడితోనే..

శ్రీనగర్(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు ఘటనలో 9 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల నుంచి నమూనాలు తీస్తుండగా ఈ విస్ఫోటం జరిగినట్లు అధికారులు ఇప్పటికే తెలిపారు. ఆ సమయంలో ఫోరెన్సిక్ బృందం అధిక లైటింగ్‌ను ఉపయోగించడం వల్లే పేలుడు సంభవించి ఉండొచ్చని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబరేటరీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ) నిపుణులు నౌగామ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఘటనాస్థలంలో నమూనాలు సేకరించారు. ఫరీదాబాద్ నుంచి తీసుకొచ్చిన పేలుడు పదార్థాల పెట్టెల్లో ద్రవరూప రసాయనాలు ఉన్నాయని, వాటిని నిశితంగా పరిశీలించేందుకు లైటింగ్‌ను పెంచారని, దీంతో భారీ పేలుడు సంభవించినట్లు అధికారులు భావిస్తున్నారు. లైటింగ్‌ను పెంచడం ద్వారా వెలువడిన వేడి, లేదా సల్ఫ్యూరిక్ యాసిడ్ నుంచి వచ్చిన పొగలు ఆ రసాయన మిశ్రమంతో కలిసి విస్ఫోటానికి దారితీసి ఉండొచ్చని అంచనా వేశారు. ఇది ఉగ్రకుట్ర కాదు.. ప్రమాదమేనని జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్, కశ్మీర్ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే ఇప్పటికే స్పష్టం చేశారు.

# కదులుతున్న డొంక



అనంత్‌నాగ్‌లో ప్రియాంక ఉంటున్న వసతి గృహంపై దాడి చేసి, ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ఆమె మొబైల్ ఫోన్, సిమ్ కార్డును ఫోరెన్సిక్ బృందాలు పరీక్షిస్తున్నాయన్నారు. దాదాపు 200మంది కశ్మీర్ వైద్యులపైన, దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువున్న కశ్మీర్ విద్యార్థులపైనా నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎర్రకోటకు అతి సమీపంలో కారులో సంభవించిన భారీ పేలుడుతో దేశ రాజధాని నగరం ఢిల్లీ ఉలిక్కిపడింది ఈ పేలుడుకు కారణమైన ఐ20 కారు నడిపిన వ్యక్తిని డాక్టర్ ఉమర్ నబీ అని పోలీసులు గుర్తించారు. అనంతరం అతడితో సంబంధమున్న ఐదుగురు వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. వారందరికీ ఉగ్రసంస్థలతో సంబంధాలు ఉన్నట్లు తేలడంతో వారితో కలిసి చదువుకున్న, పని చేస్తున్న ఇతర డాక్టర్లపైనా నిఘా పెట్టారు. ఉగ్ర కుట్రలో ఫరీదాబాద్‌లోని అల్-ఫలా యూనివర్సిటీ సిబ్బంది పాత్ర ఉండడం, నిందితులకు సంబంధించిన మరో కారు కూడా అక్కడే లభ్యం కావడంతో క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం చేయడంతోపాటు ముమ్మర తనిఖీలు చేపట్టారు. అదే కళాశాలలో చదివిన మరో ఇద్దరిని శనివారం ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

ఆత్మాహుతి బాంబర్ కోసం ఏడాదిగా అన్వేషణ..

ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో మరో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఈ టెర్రర్ మాడ్యూల్ గత ఏడాది నుంచి ఓ సూసైడ్ బాంబర్ కోసం అన్వేషిస్తోందట. ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడు, ఆ సమయంలో కారు నడిపిన డా.ఉమర్ నబీ దీని కోసం ముమ్మర ప్రయత్నాలు చేసినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఈ కేసులో అరెస్టయిన నిందితుల విచారణలో.. ఉమర్ ఓ కరడుగట్టిన ఉగ్రవాది అని, తమ కార్యకలాపాల కోసం ఓ ఆత్మాహుతి బాంబర్ అవసరమని అతడు పట్టుబట్టినట్లు తెలిసింది. ఉగ్ర నెట్‌వర్క్ కేసులో డా.ఆదిల్, డా.ముజమ్మిల్ గనాయి తదితర నిందితులు ఇప్పటికే అరెస్టయ్యారు. వీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా శ్రీనగర్ పోలీసులు.. దక్షిణ కశ్మీర్‌లోని ఖాజీగుండ్‌లో పొలిటికల్ సైన్స్ చదివిన జాసిర్ ఎలియాస్ 'డానిష్'ను అదుపులోకి తీసుకున్నారు. తాను గత ఏడాది అక్టోబర్‌లో కుల్గాంలో ఉగ్ర నెట్‌వర్క్ సభ్యులను కలిశానని, అక్కడి నుంచి తనను అల్ ఫలా విశ్వవిద్యాలయంలోని అద్దె వసతి గృహానికి తీసుకెళ్లారని జాసిర్ తెలిపినట్లు అధికారులు వెల్లడించారు

**పేలుడుకు పది రోజుల ముందు నూహ్‌లోనే బాంబర్ ఉమర్..!**

ఢిల్లీలో ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన బాంబర్ డాక్టర్ ఉమర్.. హరియాణా లోని నూహ్‌లో కొన్ని రోజులు ఉన్నట్లు గుర్తించారు. పేలుడుకు 10 రోజుల ముందే అక్కడి హిదాయత్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొన్నాడు. ఈ ఘటనకు ముందు వరకు ఆ ఇంట్లోనే ఉన్నాడు. నవంబర్ 10వ తేదీన అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అతడు తన ఐ-20 కారులో పేలుడు పదార్థాలను తీసుకొని బయల్దేరాడు. వాస్తవానికి అతడు ఫిరోజ్‌పుర్‌లోని ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేయడానికి యత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో.. చివరికి నూహ్‌కు వచ్చి ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఉన్నట్లు దర్యాప్తు బృందాలు చెబుతున్నాయి. ఆ ఇంట్లో అతడు ఉంటున్నట్లు చుట్టుపక్కలవారికి కూడా తెలియదు. ఆ జిల్లాలో ఇంటెలిజెన్స్ వర్గాలకు ఎటువంటి అనుమానం రాలేదు. స్థానికంగా ఉన్న ఓ అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్‌కు అమర్చిన సీసీ కెమెరాల్లో ఉమర్ కారు ఆ కాలనీలోకి ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. పేలుడుకు ముందు ఉమర్ వివిధ అక్రమ మార్గాల్లో రూ.20 లక్షల వరకు సేకరించాడు. ఈ డబ్బుతోనే హరియాణాలోని నూహ్ మార్కెట్లో నగదు చెల్లించి భారీగా ఎరువులను కొనుగోలు చేశాడు. వీటితోనే బాంబులను సిద్ధం చేశాడు.

**అమిర్ రషీద్ అరెస్ట్**

ఢిల్లీ నగరంలోని ఎర్రకోటకు సమీపంలో ఇటీవల జరిగిన బాంబు పేలుళ్ల కేసులో మరొక వ్యక్తిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. ఈరోజు(ఆదివారం) అమిర్ రషీద్ అలీ అనే వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాన సూత్రధారిగా ఉన్న ఉమర్ నబీకి సహచరుడిగా ఉన్న అమిర్ రషీద్‌ను అరెస్ట్ చేశారు. ప్రధానంగా ఉమర్ నబీ కారు కొనడంలో అమిర్ రషీద్ సహకారం అందించాడు. రషీద్ అలీ పేరుపైనే దాడిలో ఉపయోగించిన కారు రిజిస్ట్రేషన్ అయ్యింది. ఆ రోజు కారు నడిపింది ఉమర్ నబీ అనే విషయం ఫోరెన్సిక్ రిపోర్ట్‌ల ఆధారంగా బయటపడింది. కారు కొనడానికి అమిర్ కశ్మీర్ నుంచి ఢిల్లీకి వచ్చాడని, ఈ దాడిలో అమిర్ పాత్ర కూడా ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు నిర్ధారణకు వచ్చారు. అమిర్ రషీద్ అరెస్ట్‌తో మరిన్ని విషయాలు తమ దర్యాప్తు ద్వారా రాబట్టవచ్చిన అధికారులు భావిస్తున్నారు. కాగా, నవంబర్ పదో తేదీ మధ్యాహ్నం నుంచి సాయంత్రందాకా మూడు గంటలపాటు కారులో నబీ ఏంచేశాడు? అతని వెంట ఇంకా ఎంత మంది ఉన్నారు? ఉంటే వాళ్లు ఆ తర్వాత ఏమయ్యారు? అనే ప్రశ్నలకు సమాధానాలకు వెతికేపనిలో అధికారులు తలమునకలయ్యారు .పేలుడు పదార్థాలతో ఐఈడీ తయారుచేయడంలో డాక్టర్ ఉమర్ నైపుణ్యం సాధించాడని దర్యాప్తు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. విదేశీ హ్యాండ్లర్ నుంచి అందుకున్న బాంబుతయారీ విధాన పీడీఎఫ్ ఫైళ్లు, ఓపెన్ ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న అక్రమ సమాచారంతో బాంబుల తయారీలో ఉమర్ నిపుణుడిగా మారాడని తెలుస్తోంది. అమ్మోనియం నైట్రేట్, పెట్రోలియం, డిటోనేట్ ఉపకరణాలతో వీటిని తయారుచేసి ఉండొచ్చని చెబుతున్నారు. వీటి సాయంతో ఐఈడీని కేవలం 5-10 నిమిషాల్లో తయారుచేయొచ్చు. ఎర్రకోట పార్కింగ్ స్థలంలోనే ముడిపదార్థాలతో అప్పటికప్పుడు బాంబు తయారుచేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రతను బట్టి ఆరోజు రెండు కేజీల అమ్మోనియం నైట్రేట్, పెట్రోలియం ఉపయోగించి ఉంటారని ఫోరెన్సిక్ నిపుణులు అంచనావేస్తున్నారు. ఆదివారం తోటి డాక్టర్లు అరెస్ట్ కావడంతో హడావిడిగా ముందస్తు ప్లాన్‌లేకుండా ఉమర్ సోమవారం ఎర్రకోటకు వచ్చి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సాధారణంగా ఎర్రకోట సందర్శనలకు సోమవారం సెలవు. ఆరోజు పర్యాటకులు రద్దీ ఉండదు. రద్దీ లేనప్పుడు బాంబు పేల్చినా తీవ్రత పెద్దగా ఉండదని ఉమర్ భావించి ఉండొచ్చు. సాయంత్రం వేళ అయినా కనీసం ఛాందినిచౌక్ ప్రాంత కొనుగోలుదారులు, స్థానికులతో ఆ ప్రాంతం కిటకిటలాడితే అప్పుడు బాంబు పేలుద్దామనే ఆ 3 గంటలు ఉమర్ పార్కింగ్ ఏరియాలోనే వేచిచూశాడని పోలీసులు ఓ అంచనాకొచ్చారు.

**పేలుడు ఘటనాస్థలిలో.. సైనికులు వాడే బుల్లెట్లు లభ్యం**

ఎర్రకోట వద్ద కారు పేలుడు ఘటనపై విచారణను దర్యాప్తు బృందాలు ముమ్మరం చేశాయి. ఘటనా స్థలంలో మూడు బుల్లెట్లను ఫోరెన్సిక్ బృందాలు స్వాధీనం చేసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. సైనికులు ఉపయోగించే 9 ఎంఎం కార్ట్రిడ్జ్‌ల (9%ఎఎ ఝతీతీఱఅఎస్త్రవం%)ను ఎర్రకోటకు సమీపంలో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అయితే ఆ ప్రదేశంలో ఎటువంటి పిస్టళ్లు లభ్యం కాలేదన్నారు. ఘటన జరిగినప్పటి నుంచి ఆ ప్రదేశంలో దర్యాప్తు చేస్తున్న పోలీసు, భద్రతా సిబ్బందికి జారీ చేసిన బుల్లెట్లను కూడా తనిఖీ చేశామని.. అవి వారికి సంబంధించినవి కావని ధ్రువీకరించుకున్నట్లు వివరించారు. ఆ ప్రదేశానికి భద్రతా బలగాలు వాడే బుల్లెట్లు ఎలా వచ్చాయనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సోమవారం ఎర్రకోట మెట్రోస్టేషన్‌కు చేరువగా ఉన్న సిగ్నల్‌వద్ద కారు పేలినప్పుడు అందులో వాడిన అమ్మోనియం నైట్రేట్ దాదాపు రెండు కిలోలు ఉంటుందని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అధికారులు తేల్చారు. ఘటనాస్థలం నుంచి ఇప్పటి వరకు దాదాపు 40 నమూనాలను సేకరించారు. వీటిల్లో బుల్లెట్లు, రెండు వేర్వేరు రకాల పేలుడు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. నిందితుడితో సంబంధమున్న మరికొందరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఉమర్ నబీ వాడిన కారులో ఇంకెవరైనా ఉన్నారా, మధ్యలో ఎవరైనా వెళ్లారా అని ఆరా తీస్తున్నారు. పేలుడు పదార్థాలను ఎక్కడ కారులోకి తరలించారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

# వరుసపెట్టి ప్రయోగాలు

జాబిల్లి నుంచి నమూనాలను తీసుకొచ్చే సామర్థ్యం ప్రస్తుతం అమెరికా, రష్యా, చైనాకే ఉంది. ఇది చాలా క్లిష్టమైన టెక్నాలజీ. ఇస్రో కూడా త్వరలో దాన్ని సొంతం చేసుకోనుంది.

**2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రం**

జపాన్ అంతరిక్ష సంస్థతో కలిసి చేపట్టిన లూపెక్స్ మిషన్ కూడా తమ ప్రణాళికల్లో ఉన్నట్లు నారాయణన్ తెలిపారు. చంద్రుడి దక్షిణ ధ్రువం దగ్గరి మంచును అధ్యయనం చేయడం ఈ ప్రయోగ ఉద్దేశం. భారత అంతరిక్ష కేంద్ర నిర్మాణ పనులు మొదలయ్యాయని వెల్లడించారు. దీన్ని 2035 నాటికి పూర్తి చేయనున్నట్లు చెప్పారు. 2028 నాటికి ఐదు మాడ్యూల్స్‌ను కక్ష్యలో ఉంచుతామన్నారు. దీంతో అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసిన మూడో దేశంగా భారత్ నిలవనుంది. మిషన్ల డిమాండ్‌కు అనుగుణంగా.. వచ్చే మూడేళ్లలో వ్యోమనౌకల వార్షిక ఉత్పత్తిని మూడు రెట్లు పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు.

**గగన్‌యాన్ టైమ్‌లైన్**

గగన్‌యాన్ విషయంలో నెలకొన్న సందేహాలపై ఈ సందర్భంగా ఇస్రో చీఫ్ స్పష్టతనిచ్చారు. మానవరహిత ప్రయోగ మిషన్ల గడువు మాత్రమే కాస్త మారిందని తెలిపారు. మనుషులతో కూడిన ప్రయోగం ఎప్పటిలాగే 2027 నాటికి చేపట్టే ప్రణాళికలో మార్పు లేదన్నారు. భారత వ్యోమగాములతో కూడిన తొలి యాత్రకు ముందు మూడు మానవరహిత టెస్టింగ్ మిషన్లు జరుగుతాయి. భారత వ్యోమగాములను చంద్రుడిపైకి పంపి సురక్షితంగా తీసుకొచ్చే కలను 2040 నాటికి సాకారం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించినట్లు నారాయణన్ వెల్లడించారు.

**భారత స్పేస్ ఎకానమీకి ఊపు**

ప్రపంచ స్పేస్ ఎకానమీలో భారతదేశ వాటా సుమారు రెండు శాతంగా ఉంది. దీనిని 2030 నాటికి ఎనిమిది శాతానికి పెంచడానికి ఇస్రో కృషి చేస్తోంది. ఇండియన్ స్పేస్ ఎకానమీ విలువ ప్రస్తుతం 8.2 బిలియన్ డాలర్లు. ఇది 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో 630 బిలియన్ డాలర్లుగా ఉన్న ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 2035 నాటికి 1.8 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని నారాయణన్ అంచనా వేశారు. 2020లో వచ్చిన అంతరిక్ష రంగ సంస్కరణల వల్ల ప్రైవేట్ భాగస్వామ్యం బాగా పెరిగింది. కొన్నేళ్ల క్రితం కేవలం మూడు స్టార్టప్‌లు ఉండగా.. ఇప్పుడు 450 కంపెనీలు, 330 స్టార్టప్‌లు భారత అంతరిక్ష రంగంలో చురుగ్గా పనిచేస్తున్నాయని తెలిపారు.

# అమెరికాలో కొత్త వైరస్ కలకలం

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో కొత్త రకం వైరస్ కలకలం రేపుతోంది. వాషింగ్టన్‌కు చెందిన ఓవ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకడంతో ఆసుపత్రిలో చేరారు. దీంతో ఆ వ్యక్తికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతనికి "హెచ్5 ఎన్5 ఏవియన్ ఇన్‌ఫ్లూయింజా" అనే కొత్తరకం వైరస్ సోకినట్లు గుర్తించారు. ఇటువంటి వైరస్ మానవులలో సోకడం ఇది మ్మెదటిసారని డాక్టర్లు తెలిపారు. వాషింగ్టన్ లోని ఓ వ్యక్తికి "ఎచ్5ఎన్5 ఏవియన్ ఇన్‌ఫ్లూయింజా" వైరస్ సోకడం ప్రస్తుతం అమెరికాలో కలకలం రేపుతోంది. సాధారణంగా ఈ వైరస్ మనుషులకు అంటుకోదని కానీ ఈ వ్యక్తికి ఎలా సోకిందనే విషయాలను అధ్యయనం చేస్తున్నామని డాక్టర్లు తెలిపారు. బాధితుడు బహుశా కోళ్ల ద్వారనే వైరస్ వ్యాపించి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ వైరస్ సోకిన వ్యక్తి వృద్ధుడని అతనికి ఇతర ఆరోగ్యసమస్యలున్నాయని డాక్టర్లు తెలిపారు.

# అమాత్యుల సహకారంతో జిల్లా అభివృద్ధి

- ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో సేద తీరనున్న భక్తులు
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, నవంబర్ 16(జనంసాక్షి) :** జిల్లా సమీపంలోని గట్టమ్మ గుట్ట వద్ద నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేదతీరే అవకాశం ఉందని, తల్లికి తలవంచందే భక్తులు ముందు కదలరని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని ఘట్టమ్మ తల్లి దేవాలయం వద్ద 45 లక్షల రూపాయలతో నిర్మించి తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను కలెక్టర్ దివాకర్ టిఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచంద్రర్ లతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే భక్తులు, పర్యాటకులు ముందుగా గట్టమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరమే ముందు సాగుతారని, జాతీయ రహదారి ఆనుకొని ఉన్న గట్టమ్మ తల్లి ఆలయం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గట్టమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం భక్తులు సేద తీర్చడానికి అనేక స్థలాలు ఉన్నాయని, నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జికి నిధులు సరిపోను పక్షంలో అదనపు నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వనభోజనాలు సమైక్యతకు సూచిక

- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఉత్సాహంగా పద్మశాలీల ఆర్థిక వనభోజనాలు



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 16 (జనం సాక్షి) :** సామూహిక వనభోజనాలు సమైక్యతకు సూచిక అని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి హొండా సురేఖ అన్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని పద్మశాలీలు అంతా కలిసి కార్తిక వనభోజనాలను కిలా వరంగల్ కోటలో నిర్వహించారు. జిల్లా పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 7 వ సారి పద్మశాలి వనభోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కొండ సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ ప్రకృతిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆహ్లాదకరంగా ఆనందంగా ఉంటుందన్నారు. ప్రతీయేత ఈ విధంగా నిర్వహించడం ఎంతో మంచి సంప్రదాయమని కొనియాడారు. అంతకుముందు మార్కండేయ శివ పూజలు, అభిషేకములు, సాంస్కృతిక కార్యక్రమంలో డాన్సులు జానపద ఆర్కెస్ట్రా ఆటపాట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగినది వరంగల్ జిల్లాలోని పద్మశాలి కుల బంధువులు చేనేత ప్రతినిధులు సొసైటీ బాధ్యులు చేనేత కార్మికులు పరపతి సంఘల సభ్యులు కుటుంబ సమేతంగా సుమారు 10 వేల మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దేవాదాయ మరియు అటవీ శాఖ పర్యవేక్షణ శాఖ మాత్యులు కొండ సురేఖ, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి ప్రభాకర్, రాష్ట్ర నాయకులు ఈగ మల్లేశం, సాంబారి సమ్మయ్య, జిల్లా అధ్యక్షులు లయన్ ఆడెపు రవీందర్, జిల్లా కోఆర్డినేటర్ వద్నాల రవీందర్ జిల్లా గౌరవాధ్యక్షులు కుసుమ సతీష్ బాబు పట్టణ అధ్యక్షులు డిఎస్ మూర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు యువజన అధ్యక్షులు బేతి అశోక్ బాబు పద్మశాలి సంఘం నాయకులు బైరి శ్యాంసుందర్, చిప్ప వెంకటేశ్వర్లు, ఆడెపు వెంకటేష్,బైరి మురళి కృష్ణ, తుమ్మ రమేష్,కుమారస్వామి, చిలువేరు రాజేందర్, కుచన క్రాంతికుమార్, తాళ్ల సమ్మయ్య, సామల నిరంజన్, మాచర్ల దీన్ దయాల్,కొంతం సంగీత్, అశోక్, కుసుమ చరణ్, వెంకటేశ్వర్లు, మార్గం ఎల్లయ్య, గోరంటాల మనోహర్, వెంకటేశ్వర్లు, మొంద్రాది వెంకటేశ్వర్లు, బొమ్మ శ్రీనివాస్, మార్కండేయ పురహితులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కృషి

- చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి



**హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 16 (జనంసాక్షి) :** రాష్ట్రం లో మత్స్య పరిశ్రమ పై ఆధారపడ్డ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ఉపాధి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తు కుల వృత్తులకు జీవం పోస్తున్నదని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మత్స్యకారులకు 100 శాతం రాయితీతో చేపలు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ధర్మసాగర్ రిజర్వాయర్ లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి,రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ సాయికుమార్, రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బొర్రాజ్ఞానేశ్వర్,తెలంగాణ రాష్ట్ర క్రీడల ప్రాధికారిక సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర మత్స శాఖ సంచాలకులు నిఖిల, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, లతో కలసి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై 12 లక్షల చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# వాట్సాప్ సైబర్ ట్రేడింగ్‌లో మహిళకు రూ.76.50 లక్షల కుచ్చుటోపి

- కేసు చేదించిన పోలీసులు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో నంబర్ 16 (జనం సాక్షి) :** వాట్సాప్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసాలకు ప్రజలు గురవుతూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే కొమరం భీమ్ ఆసిఫా బాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణానికి చెందిన మహిళ సైబర్ నేరగాళ్ల వలకు గురై రు.76.50 లక్షలు పోగొట్టుకుంది . వాట్సప్ ట్రేడింగ్ పేరిట సదరు మహిళలకు ఆన్లైన్లో ట్రేడింగ్లో పెట్టుబడును పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయి అని ఆశ చూపడంతో సదర్ మహిళ పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టినట్లు కాగజ్ నగర్ సబ్ డివిజన్ పోలీస్ అధికారి వహీదుద్దీన్, సీఐ ప్రేమ్ కుమార్ ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాధిత మహిళా ఈ సంవత్సరం మే 22 నుంచి జూన్ నెల 17 వరకు ఆన్లైన్ ట్రేడింగ్ జరిపింది. యాక్సిస్ బ్యాంక్, బంధన్ బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి సదరు మోసగాళ్లు సొమ్ము మొత్తాన్ని తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. అనంతరం కొన్ని రోజుల తర్వాత వాట్సాప్ లింకులు క్లోజ్ కావడంతో సంబంధిత మహిళ మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మహారాష్ట్ర పూణే కు చెందిన సంతోష్ కుశాల్ చందు తవ్వర్, గుజరాత్ కు చెందిన పటేల్ ధావన్ కుమార్ లను అదుపులో తీసుకొని విచారించారు. ఈ మేరకు వారిని కాగజ్ నగర్ పోలీస్ అధికారులు మీడియా ముందు ప్రవేశపెట్టి , అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కేసును చేదించడంలో కృషిచేసిన కాగజ్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్లు సుధాకర్, యాదగిరి, ప్రశాంత్, పోలీసులు సంపత్, రవిచంద్ర, పటాన్, నౌషాద్ లను పోలీసు అధికారులు ఈ సందర్భంగా అభినందించారు.

# మహిళల హక్కుల సాధనకై ప్రతి ఒక్కరు పోరాటం చేయాలి

- 25 నుండి హైదరాబాదులో ఐద్వా మహాసభలు
- జాతీయ కార్యదర్శి పాతాషి ప్రజారాజ్

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 16 (జనం సాక్షి) :** మహిళల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జాతీయ కార్యదర్శి పాతాషి ప్రజారాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని ఈస్ గాం లో నిర్వహించిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. 2026 సంవత్సరం జనవరి 25వ తేదీ నుంచి 28 వ వరకు హైదరాబాదులో అఖిలభారత ప్రజాతంత్ర 14 వ మహిళా సభలు నిర్వహించబడతాయని అన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కావాలని డిమాండ్ చేశారు. విద్యా ,ఉద్యోగ, రాజకీయ , సామాజిక రంగంలో రాణిస్తున్న నేటి తరుణంలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశలత, జిల్లా కార్యదర్శి దుర్గామాత, ఉపాధ్యక్షురాలు మమత రానా తదితరులు పాల్గొన్నారు.



# కెజిబివి విద్యార్థులతో ఒక్కరోజు గడిపిన పోలీస్ అక్క టీమ్‌లు

- పిల్లల భద్రత-ఆత్మవిశ్వాసం మా ప్రధాన లక్ష్యం: ఎస్పీ డా. జానకి షర్మిల

**నిర్మల్ బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి) :** జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల తీసుకున్న వినూత్న చర్యల్లో భాగంగా, శనివారం మహిళా 'పోలీస్ అక్క' టీమ్‌లు తమ పరిధిలోని కెజిబివి పాఠశాలల్లో ఒక్కరోజు విద్యార్థులతో కలిసి గడిపాయి. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు విద్యార్థులతో పాటు భోజనం చేసి, రాత్రి పాఠశాలల్లోనే బస చేశారు. మహిళల భద్రత, చట్టాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సమస్యలు, భవిష్యత్తు లక్ష్యాలు తెలుసుకుని, వారికి మోటివేషన్ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. జానకి షర్మిల మాట్లాడుతూ విద్యార్థుల హృదయాల్లో భద్రతా భావనను బలపరచడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం వారికి అవసరమైన సమయంలో పోలీస్ వ్యవస్థ అక్కలా అండగా ఉంటుందని అర్థమయ్యేలా చేయడమే 'పోలీస్ అక్క' కార్యక్రమం లక్ష్యం. పిల్లలతో 24 గంటలు గడపడం ద్వారా వారు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరుండి తెలుసుకునే అవకాశం లభిస్తోందని ఇది విద్యార్థుల్లోని భయాలు తొలగించడంతో పాటు, భవిష్యత్తుపై సానుకూల దృక్పథాన్ని పెంచుతోందని అన్నారు.

# అమెరికాలోని అట్లాంటాలో 'తెలంగాణ కనెక్ట్స్ 2025'

- డిసెంబర్ 6న ఈ ప్రతిష్ఠాత్మక సమ్మిట్
- గౌరవ అతిథిగా డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్



హైదరాబాద్, నవంబర్ 2025: తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఈసీసీఐ) ఆధ్వర్యంలో అమెరికాలోని జార్జియా రాష్ట్రం అట్లాంటాలో డిసెంబర్ 6వ తేదీన ప్రతిష్ఠాత్మక 'తెలంగాణ కనెక్ట్స్ 2025 %-% యూఎస్ఏ, అట్లాంటా బిజినెస్ సమ్మిట్' జరగనుంది. ఈ సమ్మిట్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ను గౌరవ అతిథిగా ఆహ్వానించారు. తెలంగాణ ఎన్ఆర్ఐలు, ఇతర భారతీయ మూలాలు ఉన్న పెట్టుబడిదారులు, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఒకేచోటకు తేవడమే ఈ సమ్మిట్ ఉద్దేశం. ఈ కార్యక్రమానికి భారత కాన్సుల్ జనరల్ (జార్జియా) రమేశ్ బాబు లక్ష్మణన్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. తెలంగాణ కనెక్ట్స్ 2025 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో జరగనుంది. ఇది తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కథను ప్రపంచ పెట్టుబడిదారులతో, ఎన్ఆర్ఐలతో అనుసంధానించే వ్యూహాత్మక వేదికగా నిలుస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులతో పాటు పరిశ్రమ, ఆవిష్కరణ, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ రంగాలలో తెలంగాణను ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్య గమ్యస్థానంగా నిలబెట్టడమే లక్ష్యం. డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ ఎన్ఆర్ఐ సమాజంలోని ప్రముఖులు, గ్లోబల్ పెట్టుబడిదారులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న పెట్టుబడిదారుల అనుకూల విధానాలు, మౌలిక వసతులు, కీలక రంగాల్లో ఉన్న విశాలమైన భాగస్వామ్య అవకాశాలను ప్రత్యేకంగా వివరించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ ఈరోజు ఆధునిక మౌలిక వసతులు, స్నేహపూర్వక విధానాలతో దూరదృష్టి గల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రపంచ స్థాయి పెట్టుబడి గమ్యస్థానంగా అవతరించిందన్నారు. 'తెలంగాణ కనెక్ట్స్ 2025 యూఎస్ఏ' ప్రపంచ పెట్టుబడిదారులతో తెలంగాణను కలుపుతూనే, రాష్ట్రంలోని విస్తారమైన అవకాశాలను ప్రదర్శించే వ్యూహాత్మక వేదికగా నిలుస్తోందని తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులను మరింత అనుకూలంగా మలిచేందుకు ఈ కార్యక్రమం ఉత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఈసీసీఐ) అధ్యక్షుడు కార్తిక్ మహేశ్వరం మాట్లాడుతూ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్‌ను ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. అట్లాంటా సమ్మిట్‌లో మీ హాజరు ముఖ్యంగా తయారీ, మౌలిక వసతులు, పరిశ్రమ రంగాల్లో అవకాశాలను పరిశీలిస్తున్న తెలంగాణ ఎన్ఆర్ఐ పెట్టుబడిదారులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. తెలంగాణాలో విస్తరిస్తున్న ఉత్పాదక పర్యావరణ వ్యవస్థలోకి పెట్టుబడులను ఆకర్షించడానికి, ఆర్థిక వృద్ధిలో అర్థవంతమైన పాత్ర పోషించడానికి స్ఫూర్తిని అందిస్తుందని విశ్వసిస్తున్నామన్నారు.

# మయోపియాపై అప్రమత్తంగా ఉండాలి

- ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో పిల్లల కళ్ల సంరక్షణ లక్ష్యంగా అవగాహన వాక్
- ఈ వాక్ కు ఆరు వందల మంది హాజరు




**హైదరాబాద్, నవంబర్ 16 (జనంసాక్షి) :** పిల్లల కళ్ల సంరక్షణే లక్ష్యంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో హైదరాబాద్లో అవగాహన వాక్ నిర్వహించారు. ఈ వాక్ కల్లం అంజి రెడ్డి క్యాంపస్ నుంచి కేబీఆర్ పార్క్ వరకు తిరిగి క్యాంపస్కు ఈ వాక్ సాగింది. ఈ వాక్ లో ఆరు వందల మంది పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మయోపియా అవగాహన కోసం రూపొందించిన ప్లకార్డులు పట్టుకొని నడిచారు. పిల్లలు బయట ఆడుకోవాలని, సూర్య కాంతి తగలాలని ఈ ప్లకార్డులలో రాశారు. ఈ విధంగా చేయడం ద్వారా మయోపియా వృద్ధిని నెమ్మదించవచ్చన్న సందేశాన్ని ఇచ్చారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల పిల్లల్లో కనిపించే కంటి సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ వాక్ నిర్వహించింది. ఈ సంవత్సరం నవంబర్ 10 నుంచి 16వ తేదీ మధ్య మయోపియా అవగాహన థీమ్తో దీనిని నిర్వహించారు. వారం రోజులు సాగిన ఈ వేడుకలు నవంబర్ 16వ తేదీన నిర్వహించిన అవగాహన వాక్ తో ముగిశాయి. హైదరాబాద్లోని కల్లం అంజి రెడ్డి క్యాంపస్లో రోగులు, పాఠశాల విద్యార్థులు, ఉద్యోగుల పిల్లల కోసం డ్రాయింగ్ పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. బంజారా హిల్స్లోని హిల్టెన్, రిచ్మండ్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. నవంబర్ 13వ తేదీన చిల్డ్రన్స్ డే జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల మయోపియా పరిశోధకులు డాక్టర్ పవన్ వెర్కిచర్ల మాట్లాడుతూ పిల్లలకు బ్లాక్బోర్డ్ లేదా దూరంలోని వస్తువులు స్పష్టంగా కనిపించకపోతే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటువంటి లక్షణాలు గమనిస్తే వెంటనే వైద్య సలహా తీసుకోవాలని కోరారు. మొబైల్, టీవీ స్క్రీన్లను వీలైనంత వరకు తక్కువగా ఉపయోగించాలన్నారు. సూర్యకాంతిలో ఆడుకోవడం, సరైన వెలుతురులో, సరైన కోణంలో పుస్తకాలు పట్టుకొని చదవడం ద్వారా మయోపియా రావడాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. మయోపియా దీర్ఘకాలంలో అనేక కంటి సమస్యలకు దారి తీసే అవకాశం ఉందన్నారు. నివారణే ఉత్తమమైన మార్గమని చెప్పారు. పిల్లలకు సరైన మార్గదర్శకత, చికిత్స అందించే ప్రత్యేక మయోపియా క్లినిక్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో ఉందని తెలిపారు. మొబైల్ ఫోన్లో వీడియోలు చూడటం కంటే టీవీకి కనెక్ట్ చేసి పెద్ద స్క్రీన్లో చూడటం ఉత్తమమన్నారు. చిన్న స్క్రీన్ లేదా దగ్గర స్క్రీన్ కళ్లపై ఒత్తిడి పెంచుతుందన్నారు. ఆన్లైన్ క్లాసుల సమయంలో పెద్ద స్క్రీన్ ఉపయోగించాలన్నారు. తద్వారా పిల్లలు కొంచెం దూరంగా కూర్చోవడం ద్వారా కళ్లపై ఒత్తిడి, అలసటను తగ్గించుకోవచ్చున్నారు.

ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల చైల్డ్ సైట్ ఇన్స్టిట్యూట్ హెడ్ డాక్టర్ రమేష్ కేకున్నయ మాట్లాడుతూ మయోపియాను త్వరగా గుర్తిస్తే సమర్థవంతంగా నియంత్రించవచ్చున్నారు. చికిత్స ఫలితాలు అనేవి అది ఏ దశలో గుర్తించబడిందో అన్న దానిపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. ప్రతి పిల్ల వాడు ఆరోగ్యకరమైన భవిష్యత్తు పొందేలా చూడటం మా లక్ష్యమన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా 'చిల్డ్రన్ ఐ కేర్ అవేర్నెస్ వీక్, వాక్' నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది మా దృష్టి మయోపియా (షార్ట్సైటెడ్నెస్) అనే సమస్యపై ఉందని తెలిపారు. మయోపియా ప్రస్తుతం పిల్లల్లో వేగంగా పెరుగుతున్న కంటి సమస్యలలో ఒకటన్నారు. ఆందోళనకర విషయం ఏమిటంటే, దాని ప్రబలత త్వరితగతిన పెరుగుతోందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో సుమారు ఏడు నుంచి ఇరవై శాతం వరకు పిల్లలు మయోపియాతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. రాబోయే దశాబ్దంలో ఇది యభై శాతం వరకు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఇది కేవలం ఒక వైద్య సమస్యగానే కాకుండా, ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా మారిందని స్పష్టం చేశారు. కేవలం అద్దాలు ఇవ్వడం సరిపోదని, సమగ్ర దృష్టికోణం అవసరమని తెలిపారు. పిల్లల్లో మయోపియా పెరుగడానికి ప్రధాన కారణాల్లో ఒకటి అధిక స్క్రీన్ టైమ్ అన్నారు. అందుకే మూడు ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. త్వరిత నిర్ధారణ, ఆరోగ్యకరమైన చూపు అలవాట్లు, సమయానుకూల జోక్యం తప్పనిసరి అన్నారు. కళ్లు అసౌకర్యంగా అనిపిస్తే తక్షణమే స్క్రీనింగ్ ద్వారా గుర్తించడం అత్యంత అవసరమని చెప్పారు. పాఠశాల విద్యార్థులు ఆరోగ్యకరమైన చూపు అలవాట్లను అభ్యాసం చేయాలన్నారు.



**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**


ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయడమేమనగా నా క్లైంట్ ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లో లోన్ కొరకు అప్లికేషన్ చేయడం జరిగింది, వెంకట్రాములు తండ్రి ఉప్పు వెంకటయ్య గారికి సంబంధించిన బిజ్వార్ గ్రామం మరియు ఊట్కూర్ మండలానికి సంబంధించిన నా సొంత ఇల్లు ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 6776/2025 తేదీ. 13-10-2025 నాడు నా పని నిమిత్తం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ నుండి కొత్త బస్టాండ్ కు వెళ్తున్న మార్గమధ్యలో నా సొంత ఇల్లు ఒరిజినల్ డాక్యుమెంటు పడిపోయినావి కావున సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో తెచ్చి ఇవ్వగలరని మనవి.ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏడు రోజులలోతెలపగలరు.13-11-2025 నాడు పోలీస్ కంప్లైంట్ ఇవ్వడం జరిగింది.

G.M. RAVI PRAKASH
ADVOCATE
HNO. 1-4-33/L2
Radhakrishna Colony
2nd Railway Gate
GADWAL-509125
Jogulamba Gadwal District
gmraviprakash2@gmail.com
Cell. 9966182979

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
17 నవంబర్ 2025

# నూటికో కోటికో
## ఒక్కడే ఒక్కడు
# అందెశ్రీ





**అతను నూటిలో..**
**కోటిలో ఒక్కడు..**
**పాటలల్లడంలో..**
**పాడటంలో అందె వేసిన చెయ్యి..**
**తెలంగాణ బతుకు గాధను**
**తలకెత్తుకున్న వాడు..**
**తెలంగాణ ప్రజలో లీనమయ్యాడు..**
**అతడు.. మాయమై పోలేదు**
**తెలంగాణ బతుకు పొద్దుపై**
**పొద్దు పొడుపుపై**
**పునర్జీవం పోసుకున్నాడు**
**అతడే.. "తెలంగాణ అందెశ్రీ"**

తెలంగాణ మట్టి పరిమళం, తెలంగాణ సమాజ అస్తిత్వానికి ప్రతీక. లోకం మెచ్చిన లోక కవి అందె ఎల్లన్న అలియాస్ అందెశ్రీ గా సుపరిచితుడు. చారిత్రక నేపథ్యమున్న జనగాంకు 30 కిలో మీటర్ల దూరంలోని మద్దూరు మండలం రెబర్తి ముద్దు బిడ్డ. దళిత నేపథ్య కుటుంబం నుంచి వచ్చాడు. అందెశ్రీ పుట్టిన ఈ గడ్డకు ప్రత్యేక చరిత్ర ఉంది. అనేక విప్లవాలకి, సాహిత్య, సాంస్కృతిక, సామాజికోద్యమాలకు పురుడుబోసింది. ధిక్కారస్వరాల కోట అది. సాహిత్యంలో విప్లవాలకి జీవం పోసిన తొలి తెలుగు విప్లవ కవి పాల్కురికి సోమనాథుడు, రాజులకు తన కావ్యాన్ని అంకితం ఇవ్వని దిక్కారకవి, పాండిత్య సంపన్నుడు బమ్మెర పోతనఈ నేల పరిమళాలు.

తొలి బహుజన సామ్రాజ్యాన్ని తెలంగాణ గడ్డపై నిర్మించిన వీర యోధుడు సర్వాయి పాపన్న నడియాడిన నేల. ఒగ్గు కథ సామ్రాట్ సుక్క సత్తయ్య, జానపద బ్రహ్మ మామిండ్ల సాయిలు లాంటి అనేకమంది ఆశు కవులకు, కళాకారులకు, గాయకులకు ఊపిరి పోసిన ప్రాంతంగా ఖ్యాతి గాంచింది. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిన ధీర చరిత, బైరాన్ పల్లి వీరత్వం, దొడ్డి కొమురయ్య, కమ్యూనిస్టు ఐలమ్మ, షేక్ బందగి, నల్ల నర్సింహులు, గబ్బెట తిరుమల్ రెడ్డి లాంటి మహోన్నతుల మాయిముంతా ఆ నేల. ప్రపంచం గర్వించదగ్గ చరిత్రయిది, దాని కొనసాగింపే అందెశ్రీ అసామాన్య ప్రస్థానం.

64 ఏండ్ల క్రితం రేబర్తి ఊరిలో పుట్టిన అందె ఎల్లన్న గొర్ల కాపరిగా జీవితాన్ని ప్రారంభించాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించడంతో అనాథగా పెరిగాడు. బలపం పట్టాల్సిన చేతులు చెమటలు చిందించాయి. దినసరి కూలీగా, తాపీ మేస్త్రిగా అనేక రకాల పనులు చేస్తూ ఎదిగారు. పూట పూటకు దిన దిన కష్టాలు అనుభవించాడు. పుట్టుక ఇచ్చిన కులం వెక్కిరిస్తుంటే.. అవమానాలు బాధలతో బయలుదేరిన ఎల్లన్న సమాజ పరిణామ క్రమాన్ని తనదైన శైలిలో అర్థం చేసుకున్నాడు. ప్రకృతిని ప్రేమించాడు, ఆరాధించాడు. ప్రకృతితో మమేకమై జీవించాడు. సాటి మనిషిని గౌరవించాడు. విలువలతో బతికి ఆదర్శంగా నిలిచాడు. అక్షరాలు దిద్దకున్నా, బడి చదువు ఎట్లుంటదో.. తెలియకున్నప్పటికీ సమాజం అనే బడిని అవపోసాన పట్టాడు. అల్లికలతో కవిత్వాన్ని అలవోకగా అల్లాడు. పాటలల్లాడు. తన సాహిత్యంతో గాయపడిన హృదయానికి చల్లని వెన్నెలద్దాడు.

తాను ఏది రాసినా, ఏది పాడినా సామాన్య జనానికి చేరువయ్యాయి. జనం నాలుకపై నాట్యమాడాయి. మూడు దశాబ్దాల క్రితమే 'పాటల పూదోట' పుస్తకాన్ని తీసుకువచ్చాడు. ఆ తర్వాత 'అందేల సవ్వడి' ప్రజల్లో సవ్వడి చేసింది. ఆయన సాహిత్యం 'నిప్పుల వాగై' ప్రవహిస్తోంది. కవిత్వం, జానపద గేయాలు, అభ్యుదయ పాటలన్నీ ప్రజల్లో చైతన్యాన్ని నిప్పుల కొలిమిలా రగిలించాయి. తన రచనల్లో శ్రమజీవన సౌందర్యాన్ని ఎత్తిపట్టాడు. ప్రజా జీవితాన్ని వస్తువుగా తీసుకున్నాడు. అది తెలంగాణ బతుకు పాటైంది. సమాజ పోకడలను, రాజ్య స్వభావాన్ని ప్రశ్నించాడు. అందె ఎల్లన్న అందెశ్రీగా రూపాంతరం చెందడం అపురూపం. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన పాటలతో జవసత్వాల్ని అందించాడు.

"జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం" పాట తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసింది. వాడవాడనా ప్రతి గొంతులో తెలంగాణ రణ నినాదమై ఎగిసింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి పల్లవయ్యింది. తెలంగాణ రాష్ట్ర గీతమై తెలంగాణకు ముఖ చిత్రమైంది. " జై బోలో తెలంగాణ.. జన గర్జనలా జడివాన" తెలంగాణ ఉద్యమంలో వానై కురిసింది. "జన జాతరలో జనగీతం".. అంటూ తెలంగాణ కేతనమై ఉద్యమంలో అలుగై దున్కింది. ఆ ఉద్యమంలో అందెశ్రీ పాత్ర ప్రముఖమైనది. "మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు ".. అనే పాట అద్భుతమైన పాట. మానవ సంబంధాలు, విలువలు వల్లకాడైన నేపథ్యంలో విలువల ప్రాధాన్యతను ఎత్తి చూపిన పాట. మానవత్వాన్ని కదిలించిన పాట. దీన్ని తెలుగు విశ్వవిద్యాలయం సిలబస్ లో చేర్చింది. "కొమ్మ చెక్కితే బొమ్మరా.. కొలిచి మొక్కితే అమ్మ రా.." అంటూ పకృతిని ఆరాధిస్తూ, రాతి హృదయాలను కదిలించిన పాట ఇది. "చూడ చక్కని తల్లి".. అంటూ ప్రారంభించిన పాట అమ్మతనాన్ని గుర్తు చేసేది. ప్రకృతి అనుబంధంతో సాగిన పాట. ఇలాంటి పాటలెన్నో లెక్కకు లేనన్ని రాశాడు. అవన్నీ జనాదరణ పొందాయి. ప్రముఖ సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి తీసిన సినిమాల్లో అందెశ్రీ నోటి నుండి జాలువారిన పాటలు జన ప్రాచుర్యం పొందాయి.

అక్షర జ్ఞానం కలిగిన పండితులను సైతం ఆశ్చర్యపరుస్తూ డాక్టరేట్లు అందుకున్నాడు అందెశ్రీ. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందాడు. తన జీవితమే ఒక పరిశోధన గ్రంథం అయింది. లోక కవి బిరుదు, ప్రముఖుల పేరున సాహిత్య పురస్కారాలు, సన్మానాలు, నంది అవార్డు అందెశ్రీని వరించాయి. తన సాహిత్యం ప్రజలకే అంకితమని, తానెప్పుడు బానిస కాదని స్వయంగా ప్రకటించుకున్నాడు. ఆయనొక పాల్కురికి సోమనలా స్వతంత్ర కవి. బమ్మెర పోతనలా దిక్కార కవి. భవిష్యత్ తరాలకు దారిదీపమై నిలిచిన అందెశ్రీ నవంబర్ 10న తుది శ్వాస విడిచాడు. నూటికో కోటికో ఒక్కడే ఒక్కడుగా నిలిచిన ప్రజాకవి, 'అందెశ్రీ'కి అరుణాంజలి.



**- మామిండ్ల రమేష్ రాజా**
సెల్ : 78932 30218

## ప్రజాకవి అందెశ్రీకి అంకిత

**ఆధిపత్యం పై ధిక్కార స్వరం అందెశ్రీ**
**జన జీవన జావళి పాట అందెశ్రీ**
**ఉద్యమ గీతాల ఉవ్వెత్తు కెరటం అందెశ్రీ**
**మట్టి ఇటుకల మందహాసం అందెశ్రీ.**
**గొంతు నరాలు ఉబ్బిన పాట**
**భూమి నుండి ఉబికిన ఊట**
**రణగర్జనల జడివానగా**
**జై బోలో అంటూ**
**ఉద్యమానికి ఊపందించిన పాట**
**పోరు పాదాలకు పరుగు నేర్పిన పాట**
**ఎన్ని అవార్డులు వచ్చినా**
**ఆర్భాటాలు లేని ఆడంబరత**



**ఆత్మ గౌరవం కోసం**
**పొందాల్సిన గుర్తింపు కోసం**
**రాజీ పడనీ**
**ఎవరినీ లెక్కచేయని ధైర్యం.**
**మాయమై పోతున్న మనిషి కోసం**
**మరుగున పడుతున్న విలువల కోసం**
**ఆ గొంతు ఆర్తిగా వెదికింది**
**హెూరెత్తిన ఆ గొంతు ఆగిపోదు**
**అది గుండెలనిండా పాడుకునే**
**రాష్ట్ర గీతమై నిత్యం**
**తెలంగాణా తల్లి పాదాలకు**
**పదపదాన ప్రణమిల్లే**
**పిల్లల నాల్కలపై నదిలా**
**ప్రవహిస్తూనే ఉంటుంది.**
**జోహార్ అందెశ్రీ.**
**జోహార్ డాక్టర్**
**అందెశ్రీ.**
**అమరుడైన**
**అందెశ్రీ కి**
**వినమ్రంగా**
**నివాళి**
**అర్పిస్తూ....**



## ఎందుకో

**లేకలేక మళ్లీ**
**అక్షరాలు**
**యాదికొచ్చినై**
**అందమైన కవితని**
**అల్లిపూల దండలెక్క**
**ఒక్కొక్క పువ్వేసి**
**అల్లీ,**
**నా మల్లి జేడనిండ**
**నిండుగా**
**నింపుమన్నయి**
**నీలి నెలవంక కింద**
**జొన్న సేండ్ల నడుమ**
**వాగు వంకల్ల**
**అడుగుల అడుగు**
**మాటకు మాట**
**కలిపి**
**మురిసిన రోజులు**
**మళ్ళీ యాదికొస్తునై**
**ఎర్రటి ఎండల**
**సల్లటి చింత నీడల**
**కుసున్న**
**రోజులింకా**
**కండ్లల్ల**
**మెదులుతునై**
**ఎదను**
**మెదుపుతునై**
**కానీ**
**బతుకుబారం**
**మోసుకుంట**
**అక్షరాల తోటకు**
**తొవ్వ మరిసిన**
**జారిపోయినజి**
**మల్లి చేతికి**
**మళ్ళీ**
**దండెట్ల**
**జెర్సాలే**
**జెడకొప్పుల**
**జూసీ**
**మల్లెట్ల ముర్వాలే...**

**- మచ్చూరి వెంకట్**

## విజ్ఞాన శాస్త్రాలలో భారతదేశం
# నోబెల్ బహుమతి ఎందుకు దూరమవుతోంది?



భారతదేశానికి విజ్ఞాన శాస్త్రాలలో నోబెల్ బహుమతి రాకపోవడంపై చర్చించడం అనేది మన దేశ విద్యా, పరిశోధనా వ్యవస్థల లోతైన విశ్లేషణను కోరుతుంది. ఒకప్పుడు సివి రామన్ వంటి మేధావులు తమ పరిశోధనల ద్వారా ప్రపంచ వేదికపై దేశానికి అద్భుతమైన గౌరవాన్ని తెచ్చిపెట్టారు. అయితే సుమారు తొంభై సంవత్సరాలుగా భారతదేశంలో పనిచేస్తూ, పూర్తిగా స్వదేశీ పరిశోధనల ద్వారా భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, లేదా వైద్య శాస్త్రాలలో నోబెల్ బహుమతి సాధించిన శాస్త్రవేత్తలు లేకపోవడం ఆలోచించదగిన విషయం. ఇది మన దేశ మేధో సామర్థ్యంపై కాకుండా మన పరిశోధనా వ్యవస్థ నిర్మాణం, పెట్టుబడి, సంస్కృతిపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది.

**నిధుల కొరత-మూల కారణం:**
నోబెల్ బహుమతి గెలుచుకునే పరిశోధనలు కేవలం అద్భుతమైన మేధస్సుతో మాత్రమే సాధ్యం కావు. వాటికి దీర్ఘకాలికంగా భారీగా నిధులు అవసరం. భారతదేశంలో మొత్తం స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) పరిశోధన,అభివృద్ధి (ఆర్ అండ్ డి) కోసం కేటాయించే శాతం చాలా తక్కువగా ఉంది. ఇది సుమారు 0.6% కంటే తక్కువగా ఉంది. ఇది అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే గణనీయంగా తక్కువ. విజ్ఞాన శాస్త్రాలలో గొప్ప ఆవిష్కరణలు చేయాలంటే, అత్యాధునిక ప్రయోగశాలలు, ఖరీదైన పరికరాలు, దశాబ్దాల పాటు నిరంతరంగా కొనసాగే ప్రాజెక్టులకు నిధులు అవసరం. ప్రభుత్వాలు ఇచ్చే నిధులు తక్కువగా ఉండటం వలన, మన స్వదేశీ పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే పరికరాలను కొనలేకపోతున్నాయి. ప్రైవేటు రంగం నుండి కూడా పరిశోధనలకు పెద్దగా మద్దతు లభించకపోవడం మరొక పెద్ద లోపం. నిధుల కొరత వలన శాస్త్రవేత్తలు ప్రాథమిక పరిశోధన కంటే, త్వరితగతిన ఫలితాలు ఇచ్చే లేదా తక్కువ ఖర్చుతో కూడిన పరిశోధనలపై దృష్టి పెట్టవలసి వస్తుంది, ఇది గొప్ప ఆవిష్కరణలకు ఆటంకం కలిగిస్తుంది.

**పరిశోధనా వాతావరణం, మౌలిక సదుపాయాలు:**
గొప్ప ఆవిష్కరణలకు కేవలం శాస్త్రవేత్తలు మాత్రమే కాకుండా, వారికి అనువైన వాతావరణం కూడా అవసరం. పాశ్చాత్య దేశాలలో, శాస్త్రవేత్తలు తమ పరిశోధనలపై దృష్టి పెట్టడానికి వీలైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. కానీ భారతదేశంలో, చాలా మంది శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్ లు పరిశోధనల కంటే, బోధన, పరిపాలనా పనులు, అనేక అనవసరమైన నియమ నిబంధనలకు సంబంధించిన దస్త్రాల తయారీతో ఎక్కువ సమయం గడపవలసి వస్తుంది. విశ్వవిద్యాలయాలు, జాతీయ ప్రయోగశాలల మధ్య సహకారం లోపించడం, వివిధ విజ్ఞాన శాస్త్రాల మధ్య అంతర్ విభాగీయ పరిశోధనలు తక్కువగా ఉండటం మరొక లోపం. నోబెల్ బహుమతికి అర్హత సాధించే ఆవిష్కరణలు తరచుగా రెండు లేదా అంతకంటే ఎక్కువ విజ్ఞాన శాస్త్రాల సమన్వయం ద్వారా జరుగుతాయి. మన వ్యవస్థలో విభాగాలు విడివిడిగా పనిచేయడం వలన ఈ విధమైన సహకారం కొరవడుతోంది.

**దీర్ఘకాలిక పరిశోధనా దృష్టి లేకపోవడం:**
నోబెల్ బహుమతి తెచ్చిపెట్టే పరిశోధనలు సాధారణంగా దీర్ఘకాలికమైనవి. ఫలితాలు ఇవ్వడానికి దశాబ్దాలు పడుతుంది. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం లేదా క్వాంటమ్ మెకానిక్స్ ఆవిర్భావం వంటివి తక్షణ ఫలితాలు ఇవ్వలేదు. కానీ మన దేశంలో పరిశోధనా ప్రాజెక్టులకు కాలపరిమితి ఉంటుంది. ఫలితాలను త్వరగా చూపించాలనే ఒత్తిడి వలన శాస్త్రవేత్తలు సాహసం చేసి విజయం సాధిస్తారో లేదో తెలియని క్లిష్టమైన ప్రాథమిక పరిశోధనలను చేపట్టడానికి భయపడతారు.
అంతేకాక మన విద్యా వ్యవస్థలో ప్రశ్నించే సంస్కృతి కొరవడింది. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులను కేవలం పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంపై దృష్టి పెట్టేలా ప్రోత్సహిస్తారు తప్ప, కొత్త విషయాలను ప్రశ్నించడం, వినూత్నంగా ఆలోచించడం లేదా తార్కికంగా ఆలోచించడం వంటివి ప్రోత్సహించరు. ఈ విధానం వలన చిన్ననాటి నుండి విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనా తృష్ణ తగ్గిపోతాయి.

**నోబెల్ బహుమతి ప్రమాణాలు:**
నోబెల్ బహుమతికి ఎంపికయ్యే పరిశోధనలు కేవలం ఆ దేశానికి మాత్రమే కాకుండా మొత్తం మానవాళికి ప్రయోజనం కలిగించే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. అవి ఆయా విజ్ఞాన శాస్త్రాల పరిమితులను విస్తరించేవిగా ఉండాలి. భారతదేశంలో పరిశోధనలు ఎక్కువగా అనువర్తన పరిశోధన వైపు మొగ్గు చూపుతున్నాయి. అంటే తక్షణ అవసరాలను తీర్చేవిగా ఉన్నాయి. ప్రాథమిక శాస్త్రాలలో లోతైన, ప్రామాణికమైన ఆవిష్కరణలు తక్కువగా జరుగుతున్నాయి. ప్రపంచంలో ఉన్న అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా మన పరిశోధనా నాణ్యతను పెంచడం అనేది అతిపెద్ద సవాలు.

**మార్పుకు తక్షణావసరం:**
విజ్ఞాన శాస్త్రాలలో భారతదేశానికి నోబెల్ బహుమతి రావాలంటే, తక్షణమే కొన్ని తీవ్రమైన మార్పులు అవసరం. పరిశోధన అభివృద్ధి పై ప్రభుత్వ నిధులను గణనీయంగా పెంచాలి. విద్యా వ్యవస్థలో ప్రశ్నించే, సృజనాత్మక ఆలోచనను పెంచే సంస్కరణలు తీసుకురావాలి. పరిశోధనలకు అనుకూలమైన వాతావరణాన్ని, అనవసరమైన పరిపాలనా భారాలు లేకుండా చేయాలి.
నోబెల్ బహుమతి అనేది కేవలం ఒక పురస్కారం మాత్రమే కాదు. ఇది ఒక దేశ మేధో సంస్కృతి, శాస్త్రీయ దృక్పథ ప్రతిబింబం. భారతదేశం వంటి అత్యధిక యువ జనాభా ఉన్న దేశం, సరైన పెట్టుబడి,మద్దతుతో, రాబోయే దశాబ్దాలలో తప్పకుండా అంతర్జాతీయంగా అద్భుతమైన శాస్త్రీయ విజయాలను సాధించగల సామర్థ్యం ఉంది. ఈ దిశగా ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, పరిశోధకులు కలిసి పనిచేయాలి.



**జనక మోహన రావు దుంగ**
ఫోన్: 8247045230

# అమెరికా-భారత్ వ్యవసాయ ఒప్పందం
### రైతు జీవనం ముప్పున.. అవకాశాల ఆశలు!

అమెరికాతో భారత్ చేసుకుంటున్న వ్యవసాయ వాణిజ్య ఒప్పందం దేశ వ్యవసాయ రంగ భవిష్యత్తును నిర్ణయించనుంది. దేశ జనాభాలో 60 శాతం మందికి జీవనోపాధి కల్పించే ఈ రంగంపై గంభీర ప్రభావం చూపే అవకాశం ఉంది. డోనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం విధించిన టారిఫ్‌ల భయం ఈ ఒప్పందాన్ని త్వరితగతిన ముందుకు తీసుకురావడానికి దారితీసింది. కానీ, ఇది రైతులకు ఆర్థిక ఒత్తిడి తెచ్చే ముప్పుగా మారకూడదు. స్వదేశీ వ్యవసాయాన్ని బలోపేతం చేస్తూ, ఆహార సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి. ఒప్పందం రైతుల ఆదాయాన్ని పెంచే అవకాశాలను సృష్టించాలి, విదేశీ ఆధారాన్ని పెంచే ముప్పును తగ్గించాలి. టారిఫ్‌ల ఒత్తిడిలో రాజీలు చేయకుండా, రైతు హక్కులను ప్రాధాన్యతగా పెట్టాలి.

**ప్రస్తుత వాణిజ్య సమతుల్యం**
భారత్-అమెరికా మధ్య వ్యవసాయ వాణిజ్యం ఇప్పటికే గణనీయ స్థాయిలో ఉంది. భారత్ అమెరికా నుంచి బాదం, సోయా బీన్ నూనె, పత్తి, హార్టికల్చర్ ఉత్పత్తులు, సాంకేతికత దిగుమతి చేసుకుంటోంది. అమెరికా భారత్ నుంచి మసాలా దినుసులు, బియ్యం, పత్తి నూలు, సముద్ర ఉత్పత్తులు తీసుకుంటోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో అమెరికా వాటా సుమారు 10 శాతం, దిగుమతుల్లో 13 శాతం. ఈ సున్నిత సమతుల్యతను కాపాడుకోవాలి. కొత్త ఒప్పందం దీన్ని దెబ్బతీస్తే, రైతులు నష్టపోతారు. టారిఫ్‌ల భయంతో రాజీలు చేయకూడదు. ఇప్పటికే ఉన్న వాణిజ్యం సమతుల్యంగా ఉండాలి, ఒకవైపు మాత్రమే లాభం జరగకూడదు.

**సవాళ్లు: రైతులపై ఆర్థిక ఒత్తిడి**
అమెరికా నుంచి చౌకగా దిగుమతి అయ్యే ఉత్పత్తులు (హైబ్రిడ్ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు) స్థానిక మార్కెట్లో ధరలను తగ్గిస్తాయి. ఉదాహరణకు, అమెరికన్ సోయా బీన్ నూనె ధర భారత సాగు ఖర్చు కంటే తక్కువైతే, సోయా రైతులు పోటీ పడలేరు. చిన్న, సీమాంత రైతుల ఆదాయం ప్రతికూలంగా ప్రభావితమవుతుంది. హైబ్రిడ్ విత్తనాలు ప్రత్యేక ఎరువులు, పురుగుమందులు కావాలి. ఇది రైతులను విదేశీ ఇన్‌పుట్స్‌పై ఆధారపడేలా చేస్తుంది. దీర్ఘకాలంలో ఖర్చులు పెరిగి, "విత్తనం-ఎరువు-పురుగుమందు" చక్రం ఏర్పడుతుంది. బహుళజాతి కంపెనీలకు లాభం, రైతులకు ఆర్థిక బరువు. రుణభారం పెరిగి, రైతు ఆత్మహత్యలు మళ్లీ పెరిగే ప్రమాదం ఉంది.
సాంప్రదాయ వ్యవసాయం, జీవవైవిధ్యం ముప్పున పడతాయి. అమెరికన్ హైబ్రిడ్ విత్తనాల వ్యాప్తి స్థానిక రకాలు, సాంప్రదాయ పద్ధతులకు ముప్పు. స్థానిక విత్తనాల నష్టం దీర్ఘకాలిక ఆహార భద్రత, పర్యావరణ స్థిరత్వానికి గంభీర ముప్పు. భారత వ్యవసాయ వ్యవస్థ స్థానిక విత్తనాలు, సాంప్రదాయ జ్ఞానంపై ఆధారపడి ఉంది. విదేశీ విత్తనాలు మట్టి ఫలవంతత్వాన్ని కోల్పోయేలా చేస్తాయి, నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతుంది.




**అవకాశాలు: ఎగుమతి మార్కెట్ విస్తరణ**
ఒప్పందం అమెరికా మార్కెట్ తెరిచితే, భారత ప్రాంతీయ వస్తువులు (మామిడి, నారింజ), జీవ వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఆహారాలకు కొత్త ఆదాయ మార్గాలు తెరుచుకుంటాయి. రైతులు అంతర్జాతీయ మార్కెట్లో పోటీ పడే అవకాశం. నీటి పారుదల నిర్వహణ, మట్టి ఆరోగ్యం, పోస్ట్-హార్వెస్ట్ నష్టాల తగ్గింపులో సంయుక్త పరిశోధన, సాంకేతిక బదిలీ దీర్ఘకాల ప్రయోజనం. అమెరికన్ డిజిటల్ వ్యవసాయ పద్ధతులు ఉత్పాదకత, సమర్థత పెంచుతాయి. కానీ, ఇవి చిన్న రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలి. భారత్ జీవ వ్యవసాయ ఉత్పత్తులు అమెరికాలో డిమాండ్ పెంచి, రైతు ఆదాయం రెట్టింపు చేయవచ్చు. సాంకేతిక సహకారం ద్వారా క్లైమేట్ చేంజ్‌కు అనుగుణంగా వ్యవసాయం మార్చవచ్చు.

**హైబ్రిడ్ విత్తనాలు: ఆరోగ్య ఆందోళనల సత్యం**
హైబ్రిడ్ విత్తనాలు-క్యాన్సర్ మధ్య సంబంధం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. శాస్త్రీయంగా అర్థం చేసుకోవడం ముఖ్యం. హైబ్రిడ్‌లు సాంప్రదాయ సంకరణ ద్వారా రెండు జన్యురూపాలు కలపడం, సహజ ప్రక్రియను వేగవంతం చేయడం మాత్రమే. జీఎంఓలు ప్రయోగశాలలో జన్యు మార్పు, సహజం కాదు. హైబ్రిడ్‌లు నేరుగా క్యాన్సర్ కలిగించడానికి ఏకాభిప్రాయ శాస్త్రీయ ఆధారాలు లేవు.
ఆందోళన మూలం: పురుగుమందులు. హైబ్రిడ్‌లు నిర్దిష్ట పురుగుమందులకు ప్రతిఘటన కలిగి ఉండటంతో ఎక్కువ మోతాదు ఉపయోగం. అవశేషాలు ఆహారంలోకి ప్రవేశించి దీర్ఘకాలిక సమస్యలు తెస్తాయి. జీఎంఓలు హార్మోన్ అసమతుల్యత, అలర్జీలతో లింక్ అవుతున్నాయి, కానీ చర్చనీయం, నిరూపితం కాలేదు. కొత్త విత్తనాలకు స్వతంత్ర నియంత్రణ సంస్థల ద్వారా కఠిన, పారదర్శక పరీక్షలు అవసరం. రసాయనాల నియంత్రణ, నిర్వహణపై దృష్టి పెట్టాలి. మార్కెట్ అవకాశాలు వేచి ఉండవు, కానీ సురక్షితత్వం ముఖ్యం.

**రక్షణ మార్గాలు: స్వదేశీ బలోపేతం**
భారత్ వాణిజ్య చర్చల్లో వ్యవసాయాన్ని "ఒప్పందం చేయలేని" రంగంగా గుర్తించాలి. ఇతర రంగాల్లాగా వాణిజ్యం చేయకూడదు. డబ్ల్యూటీవోలో భారత్ స్థిరమైన అభిప్రాయానికి అనుగుణంగా ఉండాలి. సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించి, రసాయన ఆధారాన్ని తగ్గించాలి. పర్మాకల్చర్, జైవిక పద్ధతులకు ప్రోత్సాహం. స్థానిక విత్తన బ్యాంకులు, సముదాయ వ్యవస్థలు స్థాపించి సంరక్షణ, ప్రచారం చేయాలి.
"స్థానికంగా తినండి" భావనతో ప్రాంతీయ ఆహార వ్యవస్థలు బలోపేతం. పర్యావరణ, మనుషులు, జీవుల ఆరోగ్యానికి మంచిది. రైతులకు లాభదాయక ధరలు అమలు చేయాలి. పంపిణీ సంస్కరణలు రైతు హక్కులు కాపాడాలి. సమగ్ర ఆరోగ్య బీమా, పింఛను, విపత్తు రాయితీలతో ఆర్థిక ఒత్తిడి నిరోధించాలి.
అమెరికా నుంచి దిగుమతి ఉత్పత్తులకు భారతీయ ఆరోగ్య, పర్యావరణ ప్రభావ పరీక్షలు కఠినంగా, పారదర్శకంగా ఉండాలి. పబ్లిక్ డొమైన్‌లో అందుబాటు. విదేశాంగ, వాణిజ్య విధానాల సమన్వయం అవసరం. వ్యవసాయం సంకుచిత ఫ్రేమ్‌ను దాటి, వ్యూహాత్మక భాగస్వామ్యంలో జరగాలి. ఫార్మా, ఐటీలో ప్రతిఫలం కోసం వ్యవసాయంలో రాయితీలు ఇవ్వకూడదు.
ఎఫ్‌పీఓలు, సహకార సంఘాలు బలోపేతం చేసి రైతుల వాటాదారీ శక్తి పెంచాలి. మార్కెట్ ప్రవేశం, ఎగుమతి సామర్థ్యం అందించాలి. రైతు సంఘాల ఐక్యతతో చర్చల్లో గొంతుక వినిపించాలి.
చివరిగా, ఈ ఒప్పందం సవాలుతో కూడిన అవకాశం. హైబ్రిడ్ ఆరోగ్య ప్రమాదాలు అతిశయోక్తి అయినా, స్వదేశీ రైతుల ఆర్థిక ప్రభావం, విదేశీ ఆధారం ఆందోళనలు చెల్లుబాటు. ప్రభుత్వం రైతు భద్రత, ఆహార సార్వభౌమత్వాన్ని ప్రాధాన్యతగా పెట్టాలి. స్వదేశీ వ్యవసాయ బలోపేతం, శాస్త్రీయ అంచనా, సామాజిక ఆర్థిక భద్రత, ప్రత్యేక ప్రతిపత్తి ద్వారా మాత్రమే సాధ్యం. అప్పుడే ప్రయోజనాలు పొంది, నష్టాలు తగ్గించవచ్చు. భారత వ్యవసాయ భవిష్యత్తు విదేశీ ఇన్‌పుట్స్‌పై కాదు, స్వంత సహజ వనరులు, జీవవైవిధ్యం, రైతు జ్ఞానంపై ఆధారపడి ఉండాలి. రైతు బలమైన భారత్ బలమైన దేశం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.



## అందెల జ్వాల..

అందెశ్రీ..
నియంతృత్వ పాలనపై అందె కట్టి
గర్జించిన గళం మూగబోయిందా..
జయ జయహే తెలంగాణ
జననీ జయ కేతనమంటూ..
తెలంగాణ అస్థిత్వ జయకేతనాన్ని
ఎగురవేసిన ఆత్మగౌరవ పొలికేక
ఇక కనపడదే అని తెలంగాణ
కన్నీటి పర్యంతమై దీనంగా చూస్తుంది%.
%అందెశ్రీ..
అందెల జ్వాల ఆగిపోయిందని..
మాయమైపోతున్నడమ్మా..మనిషన్నవాడనీ
మానవత్వాన్ని.. మనిషి తత్వాన్ని
శాసించిన తెలంగాణ మట్టితనాన్ని
వెదజల్లిన తెలంగాణ చైతన్య దీప్తి
అందెశ్రీ..
నీ బాధ తీరేది కాదనుకొనేమో
ఈ మనసులేని మనుషులని
వదిలి వెళ్లి పోయావా..
మా కోసం తెలంగాణ రాష్ట్ర గీతం జాలువార్చిన
నీ ఆత్మీయ కలం
జన బాహుళ్యాన్ని చైతన్యపర్చి
అనంత లోకాలకు తరలి వెళ్ళిందా%
%అందెశ్రీ..
నీ మరణం.. సాహిత్య లోకానికి
తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటు
తెలంగాణ శ్వాసకు బాధాతప్త తరుణం
తెలుగు భాష తీర్చుకోలేని రుణం
తెలంగాణ జనతకు మీరు సదా స్మరణం

**పాల్వంచ హరికిషన్**
రామన్నపేట

## తెలంగాణ చరిత్రలో అందెశ్రీ పాటలు చిరస్మరణీయం



**బోడుప్పల్, నవంబర్ 16 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 352వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. అదేవిధంగా ప్రజా కవి, వాగ్గేయకారుడు అందెశ్రీ చిత్రపటానికి పుష్పాంజలు ఘటించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ పాల్గొని అందెశ్రీ రచనలను,ఆయన చేసిన సేవలను, తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాటల ప్రాముఖ్యతను స్మరించుకున్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో తెలంగాణ పాటలకు, ఆటలకు ప్రత్యేక స్థానం ఉందని, అందెశ్రీ పాట తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిందని, అతి సాధారణ స్థాయి నుండి ప్రజా కవిత అందెశ్రీ మహోన్నత స్థానాన్ని సంపాదించుకున్నారని, తెలంగాణ చరిత్ర ఉన్నంతవరకు అందెశ్రీ పాట నిలుస్తుందని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య మైసగళ్ళ జానీ కుమార్, వై శ్రీనివాస్, జడ శ్రీనివాస్, యేసు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలో అందరూ కలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యం



**బోడుప్పల్, నవంబర్ 16 (జనంసాక్షి) :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని సౌత్ పంచవటి కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షులుగా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి దుర్గా, సలహాదారులు బండారి మల్లేష్, నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు నటరాజ్, సుబ్బారావు, బాపి రెడ్డి, యాదగిరి గౌడ్, నాగరాజు, రమేష్, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా 2వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్ నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకతీతంగా కాలనీ అభివృద్ధి కోసం అందరిని కలుపుకొని కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ గోవింద్, కాలనీవాసులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీల న్యాయ సాధన దీక్షకు తాండూర్ బీసీ నాయకుల మద్దతు




**తాండూరు, నవంబర్ 16 (జనంసాక్షి) :** బీసీ సమాజానికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో ఆదివారం హైదరాబాద్లో నిర్వహించిన బీసీల న్యాయ సాధన దీక్షలో తాండూర్ నుండి పలువురు బీసీ నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ సుకుర్ మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు ఎన్ని పోరాటాలకైనా, ఎన్ని ఉద్యమాలకైనా తాండూర్ బీసీ సంఘం సిద్ధంగా ఉంటుందన్నారు. తాండూర్ బీసీ సంఘం కన్వీనర్ రాజ్ కుమార్ అధ్యక్షతన బీసీ హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సుకుర్ గ్లోబల్ యువతరం ఫౌండేషన్ అధ్యక్షులు విజయేందర్ తాండూర్ విద్యావేత్త సాంబూరి చంద్రశేఖర్, బీసీ యువ నాయకులు రామ్ రెడ్డి, వినోద్, అఖిల్, ప్రశాంత్, వివేక్, పరమేష్, రాజేందర్, నవాబ్ తదితరులు పాల్గొని బీసీ రిజర్వేషన్ల సాధనకు తమ అంకితభావాన్ని వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- బిజెపి పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం



**తాండూరు, నవంబర్ 16 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం పేర్కొన్నారు.ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్లో భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం మాట్లాడుతూ శనివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు మార్గం వార్డ్ నెంబర్ 7 లో రాయల్ కాంట పక్కన రోడ్డును ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై జెసిబి ని కూడా సీజ్ చేయాలని రోడ్డు ధ్వంసం చేసిన అదేవిధంగా ప్రభుత్వ అధికారులను దూషించడం బూతులు తిట్టడం బెదిరించడం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్ ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కూడా 15 రోజులలో రోడ్డు వేస్తా అనడం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా అని అనకపోవడం సమస్యలకు సమస్యలను పరిష్కరించుకోవడానికి చాలా మార్గాలు ఉంటాయి .ఇదేవిధంగా చేస్తే తాండూర్ పట్టణంలో అంతా కూడా గుంతలతో ట్యాంకులు పగలగొట్టడం అలవాటుగా మారుతుంది. కాబట్టి సమస్యను పరిష్కారం దిశగా తీసుకురావడం కాకుండా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ బిజెపి నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్ పట్టణ ఉపాధ్యక్షుడు అంతారం కిరణ్ కుమార్ పట్టణ ప్రధాన కార్యదర్శి మిట్టి శ్రీనివాస్ ప్రహ్లాద్ జాదవ్ పాల్గొనడం జరిగింది.

# అక్రమ రిజిస్ట్రేషన్లకు కేరాఫ్‌గా మహేశ్వరం తహశీల్దార్ కార్యాలయం...!

- మహేశ్వరం మండలంలో ఖాళీ స్థలం కనిపిస్తే మాయం...?
- రికార్డులను మారుస్తున్న అక్రమార్కులు..!
- అధికారులపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు

**మహేశ్వరం, నవంబర్ 16 (జనం సాక్షి) :** మీ పేరు మీద భూమి ప్లాట్లు ఉంటే మీ స్థిరాస్తుల పత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. లేకపోతే కేటుగాళ్లు రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు.ఒకప్పుడు భూమి ఉంటే ఎవ్వరు ఎత్తుకెళ్తారు అనేది. నేడు ఆ పరిస్థితి లేదు. కబ్జాల్లో భూమి ఉన్న రికార్డులను మార్చేస్తున్నారు. భవిష్యత్ పెట్టుబడి,అవసరాల కోసం ప్రజలు భూములను,ప్లాట్లను కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన భూములను,ప్లాట్లను కాపాడుకోవాల్సిన అవసరం కొనుగోలు చేసిన వ్యక్తుల పైనే ఆధారపడి ఉంటుంది. మహేశ్వరం మండలంలో ఎకరా భూమి ధర 3-5 కోట్లు పలుకుతుంది. అక్రమార్కులు ఎక్కడైనా ఖాళీ స్థలం కనిపిస్తే తప్పుడు పత్రాలను సృష్టించి మాయం చేస్తున్నారు. దీనికి నిదర్శనమే మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 247/5, 247/ఎ3, 247/రూ2 లలో 9.04 ఎకరాల భూమి రామిడి యాదవ లక్ష్మీకాంత్ రెడ్డి పేరు మీద ఉంది.ఇటీవల కాలంలో కందుకూరు మండలం ధన్నారం గ్రామానికి చెందిన చుక్క శ్రీకాంత్ గౌడ్,దేవరకొండకు చెందిన కిషన్ నాయక్, మాడ్గుల మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన పందుల దవలయ్య,ఆమనగల్ కు చెందిన తాడేం మహేష్, ఉర్కొండాకు చెందిన బండి మాధవులు,ఇంజాపూర్ కు చెందిన రాఘవ చారి అనే వ్యక్తులు గ్రూప్ గా ఏర్పడి రామిడి యాదవ లక్ష్మీకాంత్ రెడ్డికి చెందిన భూమి రికార్డులో ఉన్న డిజిటల్ సంతకాని ఆసరాగా చేసుకొని 9.04 ఎకరాల భూమిని కబ్జా చేసే యత్నం చేశారు.కబ్జాకు పాల్పడిన వ్యక్తులను మహేశ్వరం పోలీసులు మూడు రోజుల క్రితం రిమాండ్ కు తరలించారు.తుమ్మలూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 247 భూమి పూర్తి విస్తీర్ణం సుమారు 830- 850 ఎకరాలు ఉంటుంది. అనేక బై నంబర్ల వేసి కబ్జాలకు పాల్పడుతున్నారు.247 సర్వే నంబర్ లో కొంతమందికి రికార్డు ఉండి పొజిషన్ లేని వారున్నారు.పొజిషన్ ఉండి రికార్డు లేని వారు ఉన్నారు. 247 సర్వే నంబర్లో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు.ఆ వెంచర్లకు ఎల్పీ నంబర్ కూడా రాలేదు.క్రయ విక్రయాలు జరుపుతున్నారు. 247 సర్వే నంబర్ లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని గ్రామస్థులు గుసగుసలాడుతున్నారు. తుమ్మలూరు గ్రామంలోని శివనాగ వెంచర్లో ప్లాట్లను ఫోర్జరీ చేసి క్రయవిక్రయాలు జరుపుతున్నారు.

### అక్రమాలకు కేరాఫ్‌గా తహశీల్దార్ కార్యాలయం...?

మహేశ్వరం తహశీల్దార్ కార్యాలయం అక్రమ రిజిస్ట్రేషన్లకు కేరాఫ్‌గా మారింది. సామాన్య ప్రజలు ఆదాయ,కుల ధృవీకరణ పత్రం,బర్త్ సర్టిఫికేట్,ఇతరత్ర పనుల మీద తహశీల్దార్ కార్యాలయానికి వస్తే తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు అన్ని పత్రాలను తీసుకొని రావాలంటున్నారు.అన్ని పత్రాలు తెచ్చిన తర్వాత అధికారులు మేము వేరే పనిలో బిజీగా ఉన్నామన్ని తర్వాత చేస్తామన్ని సామాన్య ప్రజలను నెలల తరబడి తిప్పుతున్నారు.అదే రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, రాజకీయ నాయకుల పనులను క్షణాలల్లో చేస్తారాని పలువురు ఆరోపిస్తున్నారు.అధికారులు అక్రమార్కులను ఎటువంటి పత్రాలను కూడా అడుగరంటున్నారు. మహేశ్వరం



మండలంలోని మహేశ్వరం, తుమ్మలూరు, మొహబ్బత్ నగర్, సిరిగిరిపురం, మంఖాల్, మన్సాన్ పల్లి, కొంగరకుర్ద్, నాగారం, మాణిక్యమ్మగూడ, అమీర్ పేట్, కోళ్ల పడకల్, పెండ్యాల, కల్వకోల్ గ్రామాలల్లో అసైన్డ్ భూములు, సీలింగ్ భూములను, వక్ఫ్ భూములను, చెరువులను, కుంటలను, వాగులను అక్రమార్కులు కబ్జాలు చేస్తున్నారు. రెవిన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు.

### అధికారులపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు

మహేశ్వరం, కందుకూరు మండలాలోని తహశీల్దార్ కార్యాలయాలల్లో పనిచేసే సిబ్బందిపై అధికార,ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఒత్తిళ్ల అధికారులపై పెరిగాయాన్ని పలువురు పేర్కొంటున్నారు.రాజకీయ నాయకులు ఒత్తిళ్లుకు ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాజకీయ నాయకుల పేరు చెప్పుకొని ప్రభుత్వ కార్యాలయాలల్లో పైరవీలు చేస్తున్నారాన్ని సోషల్ మీడియాలో ఇటీవల చక్కర్లు కొట్టాయి.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు పోరాటం ఆగదు



**శామీర్‌పేట్, నవంబర్ 16 (జనం సాక్షి) :** బిసిల ఐక్యతతోనే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిసి అయిన నవీన్ యాదవ్ విజయం సాధించాడని రాష్ట్ర బిసి కార్మిక సంఘం అధ్యక్షులు డాక్టర్ రమేష్ గౌడ్ అన్నారు.ఆదివారం రోజు బీసీ రిజర్వేషన్ల కోసం రన్ ఫర్ సోషల్ జస్టిస్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బషీర్ బాగ్ చౌరస్తా నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు బిసి సంఘాల నాయకుల ర్యాలీ కొన సాగింది.బీసీలు అందరూ అనుకుంటేనే జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యేగా గెలిచిన నవీన్ యాదవ్ బీసీలు అందరు కలిసి ఈ విజయనందించారన్నారు. రాజ కీయాలు కచ్చితంగా ఏ బీసీ నాయకులు నిలబడ్డ బీసీల మద్దతు ఇలానే ఉంటదని,బీసీలు అందరూ ఏకమైతే రాష్ట్ర మొత్తం జూబ్లీహిల్స్ రిజల్ట్ వస్తాయని వారు గర్వంగా చెప్పారు. ఇప్పటికైనా పార్లమెంటు బిల్లు పెట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వచ్చేలాగా ఎంపీలందరూ కృషి చేస్తే అన్ని పార్టీలు కూడా మద్దతిస్తారు కాబట్టి ఈ పార్లమెంటులో బిల్లు పెట్టే విధంగా ఎంపీలు పోరాటం చేయ్యాలన్నారు . బీహార్ ఎలక్షన్లో బీసీలు ఐక్యంగా పోరాడి బిజెపికి విజయం ఇచ్చారు. బిజెపి ఎంపీలు కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో బిల్లు వచ్చే విధంగా పోరాటం చేయ్యాలని కోరారు. జే ఏ సి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ జేఏసీ చైర్మన్, ఎక్స్ మినిస్టర్ శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు కాంగ్రెస్ ఎంపీ హనుమంత రావు,విక్రమ్ గౌడ్ కలకచర్ల శ్రీనివాస్ అన్ని కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ పోరాటం బిసి 42 శాతం రిజర్వేషన్ వచ్చే వరకు జరుగుతునే ఉంటుందని పేర్కొన్నారు.

## 150 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం

**టేకులపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి) :** ఇల్లందు ఏరియాలోని టేకులపల్లి హైటెక్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 150 కిలోవాట్ల రూఫ్‌టాప్ ఆన్‌గ్రిడ్ సోలార్ ప్రాజెక్ట్‌ను ఆదివారం సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం నాయక్ ప్రారంభించారు.అనంతరం చెర్మన్,డైరెక్టర్ పి.పి.కె. వెంకటేశ్వర్లు,డైరెక్టర (ఓ. పి) యల్. వి. సూర్యనారాయణ, సోలార్ ప్లాంట్ నిర్మాణం, పనితీరు, ఉత్పత్తి సామర్థ్యం వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఇంజనీరింగ్ అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు.ఇల్లందు ఏరియా జి.యం.వి.కృష్ణయ్యని సోలార్ ప్రాజెక్ట్‌కు సంబం ధించిన సాంకేతిక అంశాలు,శక్తి



ఆదా సామర్థ్యం, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో జి.యం. ఫైనాన్స్ సుబ్బారావు, ఎస్ఓటూ జి. యం. డి రామస్వామి, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, కె. ఓ. సి. పి. ఓ. గోవిందా రావు, డి.జి.యం (పర్సనల్) అజ్మీర తుకారాం, డి.జి.యం (సివిల్) రవికుమార్,డి. జి. యం. ఐఇడి ప్రభాకర్, డి.జి.యం (వర్క్ షాప్) నాగరాజు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

- సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్




**మిర్యాలగూడ, నవంబర్ 16 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మిర్యాలగూడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దేందుకు ప్రతి కార్మికుడు బాధ్యతగా పనిచేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ కోరారు.శనివారం మిర్యాలగూడలో పట్టణ పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ డ్రైవ్ లో సబ్ కలెక్టర్ కార్మికుడి యూనిఫామ్ ధరించి కార్మికులతో కలిసి ఆయన పారిశుధ్య పనుల ను చేపట్టారు.ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడమున్సిపాలిటీ పరిధిలోగల డ్రైనేజీల పూడికలను తీయించడంతోపాటు పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు సూచించారు. పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటిలోని చెత్తను మున్సిపాలిటీ వారికి అందించి, పరిసరాల పరిశుభ్రత పై మన భాగస్వామ్యాన్ని అందించాలని కోరారు. మున్సిపాలిటీలో పనిచేసే ప్రతి కార్మికుడునిబద్ధతతో పనిచేయాలని అందుకు అధికారులు సైతం కార్మికులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి విధుల పట్ల గౌరవాన్ని కలిగించాలని కోరారు.పారిశుధ్య కార్మికులు చేస్తున్న పనులతోనే తామందరం ఆరోగ్యంగాఉంటున్నామని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలనిఅధికారులకు సూచించారు. స్వచ్ఛ మిర్యాలగూడ కోసం ప్రతినెల రెండు శనివారంలు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టి పారిశుధ్యం పనులు చేపట్టి పట్టణాన్ని శోభాయ మానంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ,అధికారులు శ్వేత తదితరులు ఉన్నారు.

## పేదవారి సొంతింటి కల నెలవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**శామీర్‌పేట్, నవంబర్ 16 (జనం సాక్షి) :** కేశవరం గ్రామంలో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నర్సింహులు యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాల గృహ కలను నిజం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తోంది. ఈ పథకం లక్షలాది కుటుంబాలకు ఆశ, ఆత్మ విశ్వాసం, భద్రత ఇచ్చిందని,ఇక ముందు కూడా మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ కృషితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చెపడతామని అన్నారు. లబ్ధిదారురాలు చెన్నూరి లింగమ్మ మాట్లాడుతూ.. మాది నిరుపేద కుటుంబం మాకు గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు వస్తుందని 10 సంవత్సరాలు ఎదురుచూసాము, కానీ మా స్వంత ఇంటి కల నెరవేరలేదు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావడం ద్వారా మేము 5 లక్షల రూపాయల ఆర్థిక సాయంతో సొంత ఇల్లు కట్టుకోగలిగాము దానికి సహకారం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మేడ్చల్ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ కి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్ కి కృతజ్ఞతలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ మెంబర్లు రామ స్వామి, మల్లేష్ యాదవ్, మహమ్మద్ యూసుఫ్, స్థానిక నాయకులు మల్లేష్ యాదవ్, ఏలూరి కొమరయ్య, బిఆర్ఎస్ నాయకుడు చిత్తారీ, శ్రీనివాస్ రెడ్డి, వీరాస్వామి, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ సమస్యలు పరిష్కరించాలి

- విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

**కోదాడ, నవంబర్ 16 (జనం సాక్షి) :** రాష్ట్రంలో విద్యారంగాన్ని పటిష్టం చేయకుండా విద్యార్థుల పట్ల వ్యతిరేకత భావంతో విద్యా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమించాలని తెలంగాణ ఉద్యమ నాయకులు రాయపూడి చిన్ని, టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామ నరసయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో జరిగిన పిడిఎస్ యు కోదాడ డివిజన్ 23వ మహాసభ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. పిడిఎస్ యు మహాసభకు ముందుగా బిగిపిడికిలి జెండాను జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి ఎగరవేసి మహాసభలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మహాసభ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాయపూడి చిన్ని, రామ నర్సయ్య లు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాల అవలంబిస్తూ




ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జార్జిరెడ్డి, జంపాల, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్ లాంటి ఎందరో అమరవీరులు అందించిన స్ఫూర్తితో గత 50 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తున్న విద్యార్థి సంఘం పిడిఎస్యు అని కొనియాడారు. రాష్ట్రంలో విద్యారంగం పట్ల నిర్లక్ష్య భావంతో పరిపాలన కొనసాగిస్తూ, ఈ ప్రభుత్వం అలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చేముందు విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రధాన పాత్ర పోషిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల గురించి పట్టించుకునే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యా కాషాయకరణ పెంచి పోషిస్తూ విద్యార్థుల మెదళ్లను మతోన్మాదం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తుందని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ మహాసభలో పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, ఉపాధ్యక్షులు భరత్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి పులి రాఖీ, ఉమేష్, సాయి, గణేష్, విష్ణు, వీరబాబు, సిద్ధార్థ, సాయి చరణ్, శ్రీమంత్, మణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభం మీడియా

- మీడియా బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- జడ్చర్ల జర్నలిస్టుల సంక్షేమం కోసం సహాయ సహకారాలు అందిస్తా..
- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, నవంబర్ 16 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రాధాన్యత గల వ్యవస్థ మీడియా రంగమని, ప్రజాస్వామ్య సౌదానికి మూల స్థంభం మీడియా అని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. ఆదివారం జడ్చర్ల లయన్స్ క్లబ్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఘనంగా ప్రారంభించి, జర్నలిజం రంగానికి సంబంధించిన పలు అంశాలపై సూచనలు చేశారు. ముందుగా జాతీయ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకొని జర్నలిస్టులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల జర్నలిస్టుల సంక్షేమం కోసం పూర్తిగా సహయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత ముఖ్యమని, సమాజ అభివృద్ధికి మీడియా కృషి చేయాలని, మీడియా రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని నిజనిజాలు ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు అపారమైన సేవలు అందిస్తున్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. జడ్చర్లలో ప్రెస్ క్లబ్ ఏర్పడటం పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా రంగ సమస్యల పరిష్కారానికి భరోసా లభించిందని, జర్నలిస్టులు కలిసి పనిచేసేందుకు ఇది ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం అన్ని విధాలుగా సహకారం అందిస్తానని, ముందుగా స్థలం ఖరారు చేసుకోవాలని సూచించారు. స్థలం ఖరారు అయితే భవన నిర్మాణం ప్రారంభించు కుందామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో నిర్మించే ప్రెస్ క్లబ్ భవనం అందరికి అనుకూలంగా ఉండేలా చేద్దామన్నారు. అంతకుముందు జడ్చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి. కృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం అండగా ఉంటానని ప్రకటించినట్టుగానే ఒక జర్నలిస్టు కంటి శస్త్రచికిత్సకోసం కోసం రూ.1 లక్ష ఇచ్చినందుకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ లో జర్నలిస్టులందరికీ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, ఉపాధ్యక్షులు శేఖర్, సహాయ కార్యదర్శి మల్లేష్, సభ్యులు టి. శ్రీనివాస్, సంతోషీ కిరణ్మయి, జనంసాక్షి రిపోర్టర్ గోనెల నరేందర్, పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, వార్డు కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, ఉమాదేవి, రమేష్, నాయకులు నిత్యానందం, బుక్క వెంకటేశం, అల్వాల్ రెడ్డి పాల్గొన్నారు. ప్రెస్ క్లబ్ కార్యాలయ ప్రారంభం, జాతీయ పత్రికాస్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి, మాజి ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ లు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యాలయం పూజలో కౌన్సిలర్లు లత, జ్యోతి, చైతన్య, నాయకులు ప్రణీల్ చందర్, కోడ్గల్ యాదయ్య, ఎంఈఓ మంజులా దేవి, డా. పెరుమాళ్ల శ్రీనివాస్ రెడ్డి, కాల్వ రాంరెడ్డి, నడిమింటి శ్రీనివాసులు, ఎంచి బాలకృష్ణ లతోపాటు పలు సంఘాల నాయకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యం..



**మానవపాడు, నవంబర్ 16 (జనం సాక్షి) :** రోజు రోజుకి జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మహేష్ నాయుడు అన్నారు.అలంపూర్ మండల పరిధిలోని లింగనవాయి గ్రామం నుండి ఇమాంపురం వరకు ఉన్న బీటీ రోడ్డు కు ఇరువైపులా ముళ్ళ కంపలను ఆదివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో జెసిబి ద్వారా ముళ్ళ పొదలను తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ నాయుడు మాట్లాడుతూ.. రోడ్డుకిరువైపులా ముళ్ళపొదలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు, గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులే కాక, రోజు రోజు కు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యమని, ఇప్పుడున్న ప్రస్తుత పరిస్థితుల్లో మానవతా దృక్పథంతో పనిచేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. గ్రామీణ అభివృద్ధికై పాటుపడుతున్న మహేష్ నాయుడుకు గ్రామీణ ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మల్లికార్జున, చైతన్య యాదవ్, ఎల్ఐసి మద్దిలేటి, బాలరాజు, జగన్, మరియు పంచాయతీ సిబ్బంది రఘు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు

**కోహెడ, నవంబర్ 16 (జనం సాక్షి) :** రైతులకు పాస్ బుక్ లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్ కు తరలించినట్లు కోహెడ ఎస్సై పుల్లా అభిలాష్ ఆదివారం తెలిపారు. కోహెడ మండల కేంద్రానికి చెందిన గడ్డం చంద్రమౌళి తండ్రి నర్సయ్య, వయస్సు 73 సం. లు, కులం పద్మశాలి అలాగే రేవోజు కనకయ్య తండ్రి లక్ష్మయ్య, వయస్సు 70 సం.లు , కులం వడ్రంగీ, గ్రామం కోహెడ అనే ఇద్దరు రైతులకు చెందిన భూముల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన పిన్నింటి శ్రీహరి తండ్రి వెంకయ్య, 28 సం లు, కులం ఎస్సీ, గ్రామం దుద్దెడ, అలాగే కొండపాక మండలానికి చెందిన పల్లె యాదగిరి తండ్రి ఎల్లయ్య, వయస్సు 34 సం లు, కులం ఎస్సీ, గ్రామం దుద్దెడ మండలం కొండపాక అను వారిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. ఇలాగే ఎవరైనా చేసినచో వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. చట్టం ముందు ఎంతటి వారైన సమానమేనని ఎస్సై అన్నారు.

# ఉదండాపూర్ భూ నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తా..

- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, నవంబర్ 16 (జనంసాక్షి) :** నియోజకవర్గ అభివృద్ధితో పాటు భూములు కోల్పోయిన ఉదండాపూర్ భూనిర్వాసితులకు న్యాయం చేయడమే తన లక్ష్యమని, త్వరలోనే ఉదండాపూర్ ప్రాజెక్టుకు సంబంధించి క్యాబినెట్ అప్రూవల్ కూడ వచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చర్చిస్తానని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు. జడ్చర్లలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన మొదటి సారి అసెంబ్లీలో ఉదండాపూర్ భూ నిర్వాసితుల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ గురించి ప్రస్తావించడం జరిగిందని, అలాగే 146 కోట్ల రూపాయల ప్యాకేజీ పెట్టాలని ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ నుండి అప్రూవల్ జరిగిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ. 30,000 కోట్లతో నిర్మించాలని కాళేశ్వరం ప్రాజెక్టును మొదలుపెట్టి కమిషన్ల కోసం వ్యయం పెంచడం జరిగిందని, అదే పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించి ఉంటే ప్రాజెక్టు పూర్తి అయ్యేదని అందులో భాగంగా ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టుకు కాంట్రాక్టర్లకు రేట్లు పెంచారే కానీ అందులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు మాత్రం రేట్లు పెంచలేదని, ఉదండాపూర్ ప్రాజెక్టు కంప్లీట్ అయితే 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించవచ్చని అంత త్యాగం చేసిన భూ నిర్వాసితులకు తాను న్యాయం చేస్తానని, ప్యాకేజీని పూర్తిస్థాయిలో కేటాయించేందుకు, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు డిసెంబర్ 9 లోపు క్యాబినెట్ లో అప్రూవల్ చేయించేందుకు సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీల హక్కు చట్టం ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- కల్వకుర్తి బీసీ నాయకులు డిమాండ్




**కల్వకుర్తి, నవంబర్ 16 (జనం సాక్షి) :** చట్ట ప్రకారం బీసీ లకు రిజర్వేషన్లు కల్పించిన తరవాతనే లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలి అని కల్వకుర్తిలో బీసీల న్యాయ దీక్ష చేపట్టారు. బీసీ రిజర్వేషన్ సాధన దీక్ష లో బీసీ నాయకులు మాట్లాడుతూ.. రిజర్వేషన్ అనేది బీసీల హక్కు చట్ట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎలక్షన్‌కు పోవాలి అని అన్నారు. రాష్ట ముఖ్యమంత్రి అల్ పార్టీ నాయకులను ప్రధానమంత్రి వద్దకు తీసుకొని పోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాల ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందని పొలుసటీన్ కాంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్ అన్నారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేయవలిసిన విధంగా అన్ని చేసింది బీజేపీ పార్లమెంట్‌లో మాత్రమే చట్టం చేసి షెడ్యూల్ పెట్టాలి అని అన్నారు.బీసీ జాక్ కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సీఎం కి బీసీ లకు న్యాయం చేసే ఇష్టం లేదు అని ఉంటే మంత్రి పదవులలో మరియు కార్పొరేషన్ పదవుల్లో అదే విధంగా బడ్జెట్ నిధులు కేటాయించి బీసీ లకు న్యాయం చేసేవాడు అని అన్నారు.కార్మిక నాయకుడు మణికంఠ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ కలిపించకపోతే రాష్ట్రం అగ్ని గుండం అవుతుంది అన్నారు. ఈ కార్య క్రమంలో కల్వకుర్తి బీసీ నాయకులు సదానందం, రాజేందర్, కనుగుల జంగయ్య, నాయకులు ఆంజనేయులు, నాయకుడు గడ్డమీది వెంకటయ్య, ఎంఆర్పీఎస్ నాయకుడు వీరస్వామి, విద్యార్థి సంఘం నాయకుడు భాస్కర్ ప్రజాపతి, జాగృతి నాయకుడు దారమోని గణేష్, బీసీ మహా సభ నాయకుడు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌ను సుందర నందనవనంగా తీర్చిదిద్దుతాం

- మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 16 (జనం సాక్షి) :** మెదక్ యువ ఎమ్మెల్యే నాయకత్వంలో మెదక్ అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ స్పష్టం చేశారు. ఆదివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మెదక్ మున్సిపల్ అభివృద్ధి కి రూ 48.70 కోట్లు విడుదలయ్యాయన్నారు. టియుఎఫ్ఐడిసి ద్వారా రూ 34 కోట్లు, యూఐడిఎఫ్ ద్వారా రూ 14.70 కోట్లు వచ్చాయని, వాటి ద్వారా మెదక్ పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల కాలేదన్నారు.పట్టణంలో ని ఆయా కాలనీల్లో ప్రధాన రోడ్లను పూర్తిచేస్తామన్నారు. హైదరాబాద్ లోని కేబుల్ బ్రిడ్జి తరహా లో మెదక్ లో ఉన్న బ్రిడ్జిలను సుందరికరిస్తామన్నారు. డబుల్ బెడ్ రూం కాలనీ, జర్నలిస్టు కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఏడుపాయల, మెదక్ చర్చి అభివృద్ధి కి రూ 70 కోట్లు ఇచ్చామన్నారు. మెడికల్, నర్సింగ్ కాలేజీలను, ఆర్టియే కార్యాలయాలను త్వరలోనే నిర్మిస్తామని తెలిపారు. మెదక్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అహర్నిశలు శ్రమిస్తున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తెచ్చేందుకు ఎమ్మెల్యే రెడీగా ఉన్నారన్నారు. పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి, మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యం గౌడ్, లల్లూ,లక్ష్మీనారాయణ గౌడ్, హమీద్, ప్రవీణ్ గౌడ్, కోర్వి రాములు, హంజాద్ తదితరులు పాల్గొన్నారు.

## దూదేకుల సంఘానికి కమ్యూనిటీ సెంటర్



**ఉప్పల్, నవంబర్ 16 (జనం సాక్షి) :** ఉప్పల్‌లోని దూదేకుల సంఘానికి గొప్ప గౌరవం దక్కింది. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి కృషితో దూదేకుల వారి కోసం ప్రత్యేకంగా కమ్యూనిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయించారు. సుమారు రూ.7 కోట్ల విలువ చేసే 400 గజాల స్థలంలో మరో రూ.కోటిన్నర వ్యయంతో ఈ భవన నిర్మాణాన్ని చేయించారు. ఉప్పల్ దూదేకుల సంఘం నాయకులకు, వారి కుటుంబాలకు కమ్యూనిటీ సెంటర్‌ను అధికారికంగా అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా ఉప్పల్ దూదేకుల సంఘం నాయకులు, వారి కుటుంబ సభ్యులు పరమేశ్వర్‌రెడ్డిని మరియు ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. కమ్యూనిటీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి:పరమేశ్వర్‌రెడ్డి ఎలాంటి సమస్యలున్నా, ఏదైనా అభివృద్ధి, సంక్షేమానికి సంబంధిత అంశాలున్నా నా దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారం, స్థానిక కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి కృషితోనే కమ్యూనిటీ సెంటర్ అందుబాటులోకి వచ్చిందన్నారు. మీ అందరి కోసం నేను, కార్పొరేటర్ అన్ని వేళలా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు నాగుర్ బాషా, అల్లా భాషా, నడిపి మౌలానా,పీరంబి, చిన్న మస్తాన్, ఖాజా మౌలానా, సిద్ధయ్య, సిద్ధమ్మ, బక్క పీరయ్య, ఉసేన్, చిన్న మౌలానా, కెఎన్ పీరయ్య, మబ్బు, రహమతుల్లా,ఎండి హుస్సేన్,ఖాజా భాషా, పకీరయ్య, బాల పీరమ్మ, నవీసాహెబ్, రసూల్, నడిపి పేరయ్య, సీను, ఏసి సీను, అదంబి, మౌళ్లబి, ఎండి రఫిక్, భాషా, దస్తగిరి, ఎన్ భాషా, కాసిం కొత్తపల్లి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి రామకృష్ణ,ఆకారపు అరుణ్ ఈగ ఆంజనేయులు,సల్లా ప్రభాకర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి కులస్తులను పట్టించుకోని ప్రభుత్వాలు

- పద్మశాలి కులస్తులను రాజకీయ పార్టీలు గుర్తించాలి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్



**సంగారెడ్డి, నవంబర్ 16 (జనం సాక్షి) :** పద్మశాలి కులస్తులను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదెల్లి రవీందర్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపాలిటీలోని బీరంగూడ పద్మశాలి భవన్‌లో కార్తీకవన భోజనాలు కార్యక్రమం మండల అధ్యక్షులు యాదగిరి, పట్టణ అధ్యక్షులు దుర్గయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన అదెల్లి రవీందర్ మాట్లాడుతూ... పద్మశాలీలను ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. పద్మశాలీలకు అన్ని రాజకీయ పార్టీలు రాజకీయపరంగా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పద్మశాలి కులస్తులు రాజకీయంగా ఎదగడానికి కలిసికట్టుగా ముందుకెళ్లాలని సూచించారు. మాజీ ఎంపీ టైగర్ నరేంద్ర మరణం తర్వాత రాజకీయాల్లో పద్మశాలి కులస్తులను ప్రాధాన్యత తగ్గించారాని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలి కుల బంధువులు ఒక్కటై రాజ్యాధికారం సాధించుకుంటే తప్ప గుర్తింపు రాదని పద్మశాలి కులస్తులు రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలనీ తెలిపారు. మండల అధ్యక్షులు యాగగిరి మాట్లాడుతూ... భవన నిర్మాణం మరియు పద్మశాలి సమాజం అభివృద్ధి కోసం పద్మశాలి సంఘము పనిచేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పద్మశాలి మరియు పట్టణ పద్మశాలి సంఘము నాయకులు మండల అధ్యక్షులు యాదగిరి, చెన్న మోహన్, పట్టణ అధ్యక్షులు దుర్గయ్య, మహందర్, లింగయ్య, ఎల్లప్ప, వేముల మల్లేష్, సురేష్, జనార్దన్, అలె వెంకట్, జోగినాథ్, గంగాధర్, యువజన నాయకులు రాజేష్ ,మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

## భారీ టిప్పర్లతో ముస్త్యాల రోడ్డు ధ్వంసం

- ఇటుక బట్టీల వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి
- ముస్త్యాల గ్రామ ప్రజల డిమాండ్



**చేర్యాల, నవంబర్ 16 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామం నుండి నర్సాయపల్లికి వెళ్లే రోడ్డుకు ఇటుక బట్టీల యజమానులు నడిపిస్తున్న భారీ టిప్పర్ల రాకపోకలతో రోడ్డు ధ్వంసమై గుంతల మయంగా మారిందనిగ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చేర్యాల గ్రామ రెవెన్యూ శివారులో గల భూమిలో రామకృష్ణ అనే ఓ వ్యాపారి ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి ఇతర జిల్లాలకు టిప్పర్ల ద్వారా రవాణా చేస్తూ రోడ్డును పూర్తిగా ధ్వంసం చేస్తున్నారని, అట్టి వ్యక్తిపై చర్యలు తీసుకుని రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాలి

- తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి



**నంగునూరు, నవంబర్ 16 (జనం సాక్షి) :** విద్యారంగ సమస్యలను పరిష్కరించి పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నంగునూరు మండల కార్యవర్గ సమావేశం సిద్దిపేటలోని సరస్వతీ శిశు మందిర్ లో శనివారం రాత్రి జరిగింది. తపస్ నంగునూరు మండల అధ్యక్షుడు పయ్యావుల జైపాల్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీర కాయల తిరుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టు మంజూరు చేసి,పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో ప్రతి తరగతి ఒక ఉపాధ్యాయ పోస్టును కేటాయించడంతో పాటు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు పోస్టులను మంజూరు చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలు(ఉమ్మడి సేవా నిబంధనలు) రూపొందించి పదోన్నతులు కల్పించాలని కోరారు. తద్వారా పర్యవేక్షణాధికారుల పోస్టులను భర్తీ చేసి విద్యారంగాన్ని పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గడీల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వం నాన్చుడు వైఖరి అవలంభిస్తోందని వాపోయారు. తక్షణమే విద్యావ్యవస్థను పటిష్టం చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తపస్ సిద్దిపేట డివిజన్ ఇంఛార్జి అనుముల వీరేశం మాట్లాడుతూ జాతీయ వాద ఉపాధ్యాయ సంఘం అయిన తపస్‌ను ఉపాధ్యాయులందరూ ఆదరించి, తపస్ లో సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తపస్ నంగునూరు మండల అధ్యక్షుడు పయ్యావుల జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులకు ఇవ్వాల్సిన డి.ఎ. ప్రకటించాలని డిమాండ్ చేశారు. తపస్ నంగునూరు మండల ప్రధాన కార్యదర్శి ముండ్రాతి రాములు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. పాఠశాలలకు కనీస మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ సిద్దిపేట జిల్లా నాయకులు కత్తుల రాంరెడ్డి, దుద్దేడ పరశు రాములు, ధీకొండ గోవర్ధన్, సతీశ్, మండల కార్యవర్గ సభ్యులు బొజ్జ చంద్రకాంత్, శ్రీనివాస్ రెడ్డి, పులగూర్ల రాజేశ్వర్ రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా 5025 కేసులు పరిష్కారం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, నవంబర్ 16 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని, వీటి ద్వారా 5025 కేసులు పరిష్కారమయ్యాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో 89 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు -1011, ఈ పెట్టి కేసులు -1281, డ్రంకెన్ అండ్ డ్రైవ్ మరియు, మోటార్ వెహికల్ చట్టం కేసులు-2533, సైబర్ కేసులు - 200 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన 89,43,506 రూపాయలు బాధితులకు అందజేశాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు వెలుబడించిందని తెలిపారు.రాజీ మార్గం రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బంది పోలీస్ కమిషనర్ అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగం సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదు
- జి డబ్ల్యు ఎం సి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి
- టి.ఎస్.జే.యు ఆధ్వర్యంలో ఉచిత వైద్య, నేత్ర పరీక్ష, రక్తదాన శిబిరం ఏర్పాటు



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 16 (జనం సాక్షి) :** సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. ఆదివారం నగరంలోని 22వ డివిజన్ పరిధి వాసవి కాలనీలో గల ఇన్నర్ వీల్ క్లబ్ లో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవాన్ని (నేషనల్ ప్రెస్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య, నేత్ర పరీక్ష మరియు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(టి.ఎస్.జే.యు) వరంగల్ జిల్లా బాధ్యులకు అభినందనలు తెలియజేశారు. అలాగే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా స్వేచ్ఛకు, పరిధికి భంగం కలిగించే చర్యలు ఎవరూ చేపట్టకూడదని అన్నారు. అలాగే సమాజంలో నెలకొన్న సమస్యలను వెలికి తీసి సమాజాభివృద్ధికి ప్రతి జర్నలిస్టు కృషి చేయాలని కోరారు. అనంతరం జర్నలిస్టులందరికీ నేషనల్ ప్రెస్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, మట్వాడ ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు, ఇంతేజార్ గంజ్ ఇన్స్పెక్టర్ షుకూర్, ఏజే మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ రమేశ్, ఏవివి కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కోడిమాల శ్రీనివాసరావు, వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజ్జె గోవర్ధన్, డా.దయాకర్ వైద్య బృందం, ఎంజీఎం బ్లడ్ బ్యాంకు సిబ్బంది, శరత్ ఐ హాస్పిటల్ సిబ్బంది మరియు జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ హేమాచల క్షేత్రంలో భక్తుల రద్దీ

- భక్తులతో రద్దీగా మారిన ఆలయ ప్రాంగణం



**మంగపేట, నవంబర్ 16 (జనంసాక్షి) :** మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల కొండలపై స్వయంభుగా వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి భక్తులు ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో రద్దీగా మారింది. స్వామివారిని దర్శించుకోవడం కొరకు భక్తులు సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ ఇతరత్రా జిల్లాల నుండి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి అనంతరం కొండపై స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని అలాగే స్వామివారి పక్కనే కొలువుదీరిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి మూలవిరాటకు ప్రదానార్చకుడు ముక్కామల రాజశేఖరశర్మ, ఆలయ అర్చకులు పవన్ కుమారాచార్యులు, ఏడునూతన ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ లు తిలా తైలాబిషేకాలు చేసి నూతన పట్టు వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనం గావించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లను ఈవో మహేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సీతారాములు, శేషు, అజయ్, గణేష్, నవీన్, నాగార్జున్, మహేష్, పుల్లయ్య లు పాల్గొన్నారు.



# క్రీడా పాఠశాలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

**హనుమ కొండ ప్రతినిధి నవంబర్ 16 (జనం సాక్షి) :** హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ క్రీడా పాఠశాలను ఆదివారం రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ క్రీడల మత్స్యశాఖ మాత్యులు వాకిటి శ్రీహరి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజ్ , తెలంగాణ రాష్ట్ర క్రీడల ప్రాధికారిక సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ సాయికుమార్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, రాష్ట్ర క్రీడల శాఖ విసి అండ్ ఎం డి సుమబాల, జిల్లా కలెక్టర్ స్నేహ శబరి ష్, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.


# మిని స్టేడియం కోసం కృషి చేస్తా..



**వరంగల్ ఎంజీఎం, నవంబర్ 16(జనంసాక్షి):** ఖిలవరంగల్ వాకింగ్ గ్రౌండ్ లో గ్రౌండ్లో మినీ స్టేడియం కోసం కృషి చేస్తానని, కొత్తవాడ పద్మశాలి చేనేత ఉత్పత్తులను వెంటనే ప్రభుత్వం కొనుటకు చర్యలు తీసుకుంటానని మంత్రి కొండ సురేఖ హామీ ఇచ్చారు. పద్మశాలి కార్తీక వనభోజనాల మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో నగర మేయర్ గుండు సుధారాణి, పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, పట్టణ పద్మశాలి అధ్యక్షులు ఆడెపు రవీందర్, గౌరవ అధ్యక్షులు కుసుమ సతీష్, కార్యదర్శి గోరంటల రాజు, వోడ్నాల నరేందర్, గుండు ప్రభాకర్,గుండు కామేశ్వర్,బాసాని శ్రీనివాస్, ఎలుగం సత్యనారాయణ, గుండు పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# అనుకున్న సమయానికి అన్ని పనులు పూర్తి చేస్తాం

**రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



**ములుగు ప్రతినిధి- తాడ్వాయి, నవంబర్ 16(జనంసాక్షి) :** వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల విషయంలో అనుకున్న సమయంలోనే అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని, భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా అమ్మవార్ల గద్దెల ప్రాంతాన్ని పునరుద్ధరిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక బంధువుగా బాధ్యుడిగా వ్యవహరిస్తూ అమ్మవార్ల జాతరను విజయవంతం చేయడానికి చొరవ చూపుతున్నారని, అమ్మవార్ల కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తంగా తెలియజేసే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవడమే కాకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వారంలో పాటు పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు సలహాలు చేస్తున్నామని, అన్ని అభివృద్ధి కార్యక్రమాలను అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రానున్న మేడారం జాతర సందర్భంగా హన్మకొండ జిల్లా కేంద్రం నుండి తాడ్వాయి మండల కేంద్రం వరకు పలు వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతోపాటు వారికి ఆర్థిక సాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భక్తి, శ్రద్ధ, బాధ్యతతో పనిచేస్తూ ముందుకు సాగుతున్నామని ఎన్ని కోట్ల మంది భక్తులు వచ్చిన ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, ఈ ఓ వీరస్వామి, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్, ఇర్రిగేషన్ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి జిన్నింగ్ మిల్లుల సమస్యలు పరిష్కరించండి

- అన్ని పత్తి జిన్నింగ్ మిల్లులకు అవకాశం కల్పించండి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి డిమాండ్




**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 16 (జనం సాక్షి):** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అన్నదాతల నుండి పత్తి కొనుగోలు చేసుకోవడానికి అన్ని మిల్లులకు అవకాశం ఇవ్వాలని వరంగల్ జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గిర్నిబావి సెంటర్లో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సమావేశానికి అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి వహించినారు. ఈ సమావేశంలో రైతు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల కృష్ణారెడ్డి మాట్లాడుతూ .కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాపాసా కిసాన్ యాప్ వలన వరంగల్ జిల్లాలోని మిల్లులకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సి సి ఐ వారు పత్తి మిల్లులకుపత్తి ముడి సరుకులు ఇచ్చి 500 కేజీ పత్తికి ఒక బెల్కు 1400 రూపాయలు ఇస్తున్నారు రైతులను దిగుమతి ఖర్చు లోడింగ్ కరెంట్ బిల్లు పత్తి జిన్నింగ్ మిల్లులు బరిస్తున్నారు కానీ ప్రతి సంవత్సరం పెరుతున్న చార్జీలకు అనుగుణంగా సిసిఐ వారు ధరలు పెంచడం లేదని ఆయన విమర్శించారు. ప్రతి సంవత్సరం దూది దిగుబడిని బట్టి నెలకోసారి ధరలను నిర్ణయించేవారు . ప్రస్తుతం 15 రోజులకోసారి నిర్ణయిస్తున్నారు. సిసిఐ వారు అన్ని జిన్నింగ్ మిల్లులకు అవకాశం ఇవ్వకుండా కొన్ని మిల్లులకే అవకాశం ఇస్తున్నారు కానీ చాలా మిల్లులు మూతపడుతున్నాయి జన్నింగ్ మిల్లుల కెపాసిటీ బట్టి అన్ని మిల్లులకు సీసీఐవారి అవకాశం కల్పించాలి ఎకరాకు 7 క్వింటాల్ విధానం రద్దు చేయాలి జన్నింగ్ మిల్లులకు 5 6 నెలలే పని ఉంటుంది . జిన్నింగ్ మిల్లులు నష్టం కలగకుండా ప్రస్తుతం సీసీఐ విధానాన్ని సవరించి. పత్తి కొనుగోలు పై ఆంక్షలు ఎత్తివేయాలని రైతులకు జిన్నింగ్ మిల్లులకు ఎలాంటి నష్టం కలగకుండా సమిష్టి చర్చ జరపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను పుచ్చకాయ కృష్ణారెడ్డ డిమాండ్ చేసినారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి మండల కార్యదర్శి అక్క పెల్లి సుధాకర్ మండల కమిటీ సభ్యులు పుచ్చకాయల మహేందర్ రెడ్డి బోల్ల రమేష్ కోడం రమేష్ కొంగర నరసింహ స్వామి కటకం సామమూర్తి పొన్నం రాజు తదితరులు పాల్గొన్నారు

# జూబ్లీహిల్స్ గెలుపుతో కాంగ్రెస్‌లో ఉత్సాహం

- స్థానికంలో కూడా ఇదే సత్తా చాటాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, నవంబర్ 16(జనంసాక్షి) :** ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాదించిందని, అదే ఉత్సాహంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి తో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో నూతన కార్యాలయం ద్వారనే కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల కోసం పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలను అందించడంలో కార్యకర్తలు వివరించాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు తెలియని అనేక మంది ప్రజలను ఈ కార్యాలయానికి రప్పించి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ చైర్పర్సన్ లావుడ్యా మంజుల, మార్కెట్ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, మాజీ సర్పంచులు వీరమనేని యాకాంతరావు, భూమ రంగయ్య, కొంరోజు సోమన్న, జలగం కుమార స్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ దేవస్థానం చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, బిర్రు సోమేశ్వర్, గోనె కార్తిక్, బండిపెల్లి మణెమ్మ, గిలకత్తుల సుధాకర్, పెనగొండ రమేష్, కమ్మగాని నాగయ్య ఉన్నారు. అనం తరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలు హాజరై కుర్చీలను అందచేశారు.

# వందేమాతర గీతం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పని చేయాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 16 (జనం సాక్షి) :** వందేమాతరం గీతం స్ఫూర్తితో దేశంలో ఐక్యత కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు అన్నారు. ఆదివారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద నలువైపులా రహదారుల పొడవునా ప్రజలు నిలబడి వందేమాతరం గీతాలాపన గావించారు. స్వతంత్ర సంగ్రామ ఉద్యమంలో దేశంలో ప్రజలందరినీ ఒక్కతాటిపై తీసుకువచ్చి, బ్రిటిష్ వారీ నుండి స్వాతంత్రాన్ని సాధించడంలో వందేమాతర గీతం ఎంతో దోహదం చేసిందని పేర్కొన్నారు. వందే మాతర గీతం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు శివకుమార్, మండల అధ్యక్షులు పుల్ల అశోక్, బిజెపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసిన బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ రూరల్, నవంబర్ 16 (జనంసాక్షి) :** నిర్మల్ నియోజక వర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరి ని మహారాష్ట్ర లోని నాగ్ పూర్ లో ఆదివారం బీజేఎల్పీ నేత,నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందించారు.మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్,ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ కలిసి కేంద్రమంత్రి గడ్కరి తో బేటి అయ్యారు.నిర్మల్ జిల్లాలో రహదారుల అభివృద్ధి అంశంపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు తెలిపారు.అదేవిధంగా నియోజకవర్గంలో పలు సమస్యలపై సైతం మంత్రి తో చర్చించడం జరిగిందని తెలిపారు.రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు విషయంలో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించడం జరిగిందని మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# అయ్యప్పస్వాములకు నిత్య అన్నదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

- ఎల్లం బావి గ్రామంలో దేవాలయాల నిర్మాణానికి భూమిపూజ
- లక్కారం చెరువులో 90 వేల చేప పిల్లల విడుదల

**చౌటుప్పల్, నవంబర్ 16 (జనం సాక్షి) :** అయ్యప్ప ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. పట్టణం కేంద్రంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మాలధారులకు అన్నం వడ్డించారు. అనంతరం దేవాలయంలో చెవ్వగొని వెంకటేష్ గౌడ్ ల కుమార్తె భవ్య శ్రీ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వారు కూడా మాలధారులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, పబ్బు రాజు గౌడ్, బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, కామిశెట్టి భాస్కర్



స్వామి, ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నరసింహ గౌడ్, మోగుదాల రమేష్ గౌడ్, కంచరకుంట్ల వెంకటరెడ్డి గురుస్వామి, చింతల సాయిలు, అంతటి రాము గౌడ్, వెలగా రాజశేఖర్ రెడ్డి, గుండు మల్లయ్య గౌడ్, తిరుపతి రవీందర్, బాబా షరీఫ్, ఎస్కే జానిబాబు, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుడి వివాహంలో ఎమ్మెల్యే ఆశీర్వాదం

చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం రిక్కల సత్తిరెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగిన నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు వంగూరి శంకర్ వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

### దేవాలయాల నిర్మాణానికి భూమిపూజ

ఎల్లం బావి గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణుల, శ్రీ సరస్వతి దేవి, శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పాల్గొని భూమిపూజ చేశారు. అనంతరం మున్సిపల్ కేంద్రంలోని లక్కారం చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 90 వేల చేప పిల్లలను వదిలారు. మత్స్యకారులు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

## మంత్రి తుమ్మలను కలిసిన షాదీఖానా పాలకవర్గం



**ఖమ్మం, నవంబర్ 16 (జనం సాక్షి) :** ఖమ్మం షాది ఖానా నూతన పాలకవర్గం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షాది ఖానా చైర్మన్ షేక్ ఖదీర్ మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల నూతన పాలకవర్గాన్ని అభినందించారు. అనంతరం చైర్మన్ ఖదీర్ మాట్లాడుతూ షాది ఖానా అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అందుకు కృషి చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ కు కృతజ్ఞతలు తెలిపారు. తుమ్మలను కలిసిన వారిలో షాది ఖానా డైరెక్టర్లు సమద్, జానీ, సాబీర్, జహీర్, పర్వేజ్, ఉమర్ తదితరులు ఉన్నారు.

# పార్టీ పరమైన రిజర్వేషన్లు వద్దు.!

- చట్టపరమైన రిజర్వేషన్లు కావాలి

**దేవరకొండ, నవంబర్ 16 (జనం సాక్షి) :** రాజ్యసభ సభ్యులు ఎంపీ ఆర్. కృష్ణయ్య విద్యా, ఉద్యోగ ,రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలుకై హైదరాబాదులోని ఇందిరపార్కు వద్ద న్యాయ దీక్షకు మద్దతుగా దేవరకొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పట్ల వివక్షత ,అన్యాయాన్ని విడనాడాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని అన్నారు.పార్టీ పరమైన రిజర్వేషన్లు మాకు వద్దు,చట్టపరమైనటువంటి రిజర్వేషన్లు మాత్రమే కావాలని, తమను మోసం చేయొద్దని రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ ద్వారా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాల పార్టీలతో ఒత్తిడి తెచ్చి తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్లో చేర్చి శాశ్వతమైనటువంటి పరిష్కారం చూపాలని కోరారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చోల్లేటి భాస్కరాచారి, పున్నం వెంకటేశ్వర్లు, రెడ్డి కోటేశ్వరరావు, అప్పం వీరయ్య, వరికుప్పల శ్రీను, వెంకటయ్య యాదవ్, లౌడ్య బాషా నాయక్ ,భీమగోని శివగౌడ్, కురుమయ్య ,పున్న భిక్షమయ్య బి. లక్ష్మయ్య,గంజి సత్యయ్య, వనం ముత్యాలు ,పెసర వెంకన్న, మద్దతుగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చందు నాయక్, జనసేన పార్టీ నాయకులు రత్నావత్ సంజీవ్ నాయక్,మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి చంద్రమౌళి గౌడ్ ,శ్రీను పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 16 (జనం సాక్షి) :** పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వం, బాధ్యతా భావం పెంపొందించేందుకు నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులను బోధించారు. ఇందులో భాగంగా కొందరు విద్యార్థులు ముఖ్యమంత్రి, మంత్రులు, వివిధ శాఖాధికారులు గా వ్యవహరించి పాఠశాల పరిపాలనను ప్రతిరూపించే విధంగా బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థులు విధుల పంపకం, నిర్ణయాలు తీసుకోవడం, తరగతుల పర్యవేక్షణ వంటి పనులను నిర్వహించడం కార్యక్రమానికి మరింత ఆకర్షణగా మారింది. ఉపాధ్యాయుల వేషధారణలో పాఠాలు బోధించడం, తరగతి నియమాలు పాటింపజేయడం, పాఠశాల నిర్వహణలో పాల్గొనడం వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆనందం, ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వంగూరి పాండు మాట్లాడుతూ స్వపరిపాలన దినోత్సవం విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవం కలిగించే ప్రత్యేకమైన విద్యా కార్యక్రమమని పేర్కొన్నారు.



డైరెక్టర్ స్వాతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఆత్మవిశ్వాసం, నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి చెందడానికి ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. ప్రిన్సిపల్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఒక రోజు ఉపాధ్యాయులు, మంత్రులు, అధికారులు గా వ్యవహరించడం ద్వారా విద్యార్థులు వ్యవస్థ ఎలా పనిచేస్తుందో ప్రత్యక్షంగా నేర్చుకుంటారని తెలిపారు. అనంతరం స్వపరిపాలన దినోత్సవంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మునుగోడును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం

**చౌటుప్పల్, నవంబర్ 16 (జనం సాక్షి) :** మునుగోడు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పనిచేస్తున్నారని మునుగోడు స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జి పబ్బు రాజు గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి లు అన్నారు.మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారులు ఆదివారం గృహప్రవేశం చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు, ప్రతి పేదవాడికి,పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ఇస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల విజయస్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం మొత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ పట్టణ అధ్యక్షులు సుర్వి



నర్సింహ గౌడ్, మాజీ వైస్ ఎంపిపి ఉప్పు భద్రయ్య, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, గ్రామశాఖ అధ్యక్షులు చేవెళ్లి శివకృష్ణ , దేవాలయ కమిటీ చైర్మన్ కుర్నాల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లీకుల మయంతో కలుషితమవుతున్న భగీరథ నీరు

- మురికి కూపంలో పైప్ లైన్ వాల్
- నామమాత్రంగా పనులు
- చర్మ వ్యాధులతో ప్రజల ఇక్కట్లు
- తలు విస్మరించిన భగీరథ అధికారులు
- ఎవరిది నిర్లక్ష్యం అధికారులదా ? సిబ్బందిదా..? కాంట్రాక్టర్లదా ..?

**పెనుబల్లి, నవంబర్ 16 (జనం సాక్షి) :** మిషన్ భగీరద పైప్ లైన్ ల లీకులవల్ల భగీరథ నీళ్లు కలుషితమవుతున్నాయి, మురికి కూపంలో వాల్స్ ఏర్పాటు చేయడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు,ఈ సమస్యపై ఎప్పటి కప్పుడు గ్రామస్తులు ఏకరవు పెట్టినా సంబంధిత అధికారులు కనీసం తిరిగి చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ పైప్ లైన్ లీకై నీళ్లువృధా గా పోతున్నాయి,మండల కేంద్రమైన పెనుబల్లి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పైప్ లైన్ మెయిన్ వాలు డ్రైనేజి మురుగునీటిలో ఏర్పాటు



చేశారు,సెప్టెంబరు నెలలో " జనం సాక్షి " పత్రికలో "భగీరథ నీళ్లు మురుగుపాలు" అనే టైటిల్ తో ప్రచురితమైన కథనానికి స్పందించిన భగీరథ అధికారులు నామమాత్రంగా పనులు చేశారు,కనీసం వాలులో ఉన్న కుళ్లిపోయిన చెత్తను, మురుగు నీటిని కూడా తీసి శుభ్రం చేయలేదు.మళ్లీ అదే వాలు చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయి వాల్లో నాచు, కుళ్లిపోయిన చెత్త, వాటర్ బాటిళ్లు,మురుగునీరు పేరుకు పోయాయి. ఈ నీళ్లను గ్రామస్తులు త్రాగునీరుగా వాడకుండా స్నానాలకి,ఇంట్లో వాడటానికి, పశువులకు వాడుతున్నారు, నీటితో స్నానం చేయటం వలన గ్రామాలలో కొంతమందికి చర్మ వ్యాధులు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు, గ్రామ పంచాయతీలో భగీరథ పైపుల లీకుల వివరాలు సిబ్బంది ద్వారా సేకరించి లీకులను నివారించాలని, భగీరథ నీళ్ల వృధా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## ఉత్తమ సేవలను అందించి ఆదరణ పొందాలి

- యూ షైన్ బ్యూటీ అండ్ సెలబ్రేషన్స్ ప్రారంభం

**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 16 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని డీ మార్ట్ సమీపంలోని రాజారాం కాలేజీ వద్ద సోనగంటి ఉషారాణి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూ షైన్ బ్యూటీ అండ్ సెలబ్రేషన్స్ను శిపా బ్యూటీ పార్లర్ కాజల్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యువత అందం, అలంకరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వారి అభిరుచికి తగ్గట్టుగా సేవలు అందించి ఆదరణ పొందాలని అన్నారు. అనంతరం యూ షైన్ బ్యూటీ అండ్ సెలబ్రేషన్స్ నిర్వాహకురాలు సోనగంటి ఉషారాణి మాట్లాడుతూ తమ బ్యూటీ పార్లర్ నందు యువత, మహిళల అభిరుచికి తగినట్టుగా మారుతున్న ట్రెండ్,ఫ్యాషన్ కు అనుగుణంగా అన్ని రకాల బ్యూటీ సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.పార్టీలకు, శుభకార్యాలకు ప్రత్యేక సేవలు అందిస్తామన్నారు. తాము అందించే మేకప్, మెహంది,థ్రెడింగ్, ఫేషియల్, హెయిర్ కట్, వాక్సింగ్, పెడిక్యూర్, మ్యానిక్యూర్, హెయిర్ అండ్ ఫేస్ స్పా వంటి బ్యూటీ సేవలను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత మహిళలు వినియోగించుకొని




తమను ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సోమలక్ష్మీ, నాగమణి, మధుర, షమీన్, లత, స్రవంతి, రేణుక, అంజలీ, మౌనిక, శ్రీవాణి, మాధురి, శ్రీనివాసచారి,సోమయ్య చారి,సత్యనారాయణ చారి, ఉపేందర్, నర్సయ్య, సైదాచారి, మధు,రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక వనభోజనాలు ఒక గొప్ప సంస్కృతి

**శేరిలింగంపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి) :** కార్తీక మాసంలో నిర్వహించే వనభోజనాలకు ఎంతో చరిత్ర ఉందని, ఇది ఒక గొప్ప సంస్కృతిగా ల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అభివర్ణించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ మియాపూర్ డివిజన్ పరిధి మయూరి నగర్ కాలనీలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీకమాస వనభోజన కార్యక్రమానికి మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ కార్తీక మాసం అంటేనే హిందువులకు ఎంతో పవిత్రమైన మాసమని, సాక్షాత్తు భగవంతుడే మానవరూపం దాల్చి భూమిపై నడయాడే మాసమని ఆయన వివరించారు. ఇలాంటి ఎంతో మహత్తరమైన కార్తీక మాసంలో ఇరుగుపొరుగువారు, ఆయా కులాల వారీగా ఒకచోటకు చేరి కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించుకుని అందరూ కలిసి బంతి భోజనం నిర్వహించడం గొప్ప అనుభూతిని ఇస్తుందన్నారు. యాంత్రిక జీవితానికి అలవాటు పడిన సగటు మనిషి సాటి మనిషితో కలిసి మనసు విప్పి మాట్లాడుకునే సందర్భాలే కరువైన నేటి రోజుల్లో కార్తీకమాసం వన భోజనాల పుణ్యమా అని ఏడాదికి ఒక్కసారైనా ఇలా కలిసి మెలసి కష్టసుఖాలు పాలుపంచుకొని కలిసి భోజనం చేసి హాయిగా గడిపే అద్భుత క్షణాలను



వర్ణించలేనివని అరికెపూడి పునరుద్ఘాటించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ముదావహమని, ఆర్యవైశ్య సమాజం మరింత పురోభివృద్ధిని సాధించి సమాజ ఎదుగుదలకు సహకారం అందించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కులమతాలకతీతంగా మనుషులంతా కలిసిపోయి సమసమాజ స్థాపనకై నడుం బిగించాల్సిన ఆవశ్యకత ఉందని అరికపూడి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు, మహిళలు, ఇతరులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై రగడ

- ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితిపై మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఫైర్

**గుర్రంపోడ్, నవంబర్ 16 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, నోముల భగత్ ఆదివారం రోజున ఉదయం 8 గంటల 30 నిమిషాలకు గుర్రంపోడు మండలంలోని జూనూతుల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కంచర్ల ఇంద్రా రెడ్డి ని, మండల కేంద్రానికి చెందిన సయ్యద్ బాబాను పరామర్శించారు. అనంతరం ప్రెస్ క్లబ్లో ఆదివారం రోజున ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, స్థానిక కాంగ్రెస్ నాయకులపై, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.తాను ఆదివారం గుర్రంపోడు మండలంలోని ఆములూరు గ్రామంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జి పనులను పర్యటించి ప్రారంభిస్తానని ముందుగానే పార్టీ శ్రేణులకు, ప్రజలకు తెలియజేశానని నోముల భగత్ తెలిపారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం అర్ధరాత్రికి అర్ధరాత్రి హడావుడిగా బ్రిడ్జిపై అరకొరగా మట్టి పోసి పనులు ప్రారంభమైనట్లు డ్రామా ఆడారని ఆరోపించారు.మేం ప్రారంభిద్దామనుకున్న పనులను రాత్రికే మీరు మట్టి పోయాల్సిన అవసరం ఏముంది? మీరు నిజంగానే పనులు చేయాలనుకుంటే, మండలంలో ఇంకా చాలా పెండింగ్లో ఉన్న పనులు ఉన్నాయి, వాటిని పూర్తి చేయండి," అని భగత్ సవాలు విసిరారు. కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన, గుర్రంపోడు మండల కాంగ్రెస్ నాయకులు సిగ్గు పడాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని విమర్శించారు. నియోజకవర్గంలోని కమల నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో ఇటీవల జరిగిన సంచలన ఘటనపై కూడా నోముల భగత్ స్పందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 17 మంది చిన్నారులకు ఇంజెక్షన్ వికటించి తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని ప్రస్తావించారు. "హాస్పిటల్లో చిన్న పిల్లల పరిస్థితి చూస్తే చాలా బాధేస్తోంది. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే




(జైవీర్ రెడ్డి) నిద్రపోతున్నారా?" అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఆసుపత్రిలో మందులు, కనీస వైద్య సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన ప్రభుత్వ వైద్య వ్యవస్థ పనితీరుకు నిదర్శనమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు,సర్పంచులు,మండల సీనియర్ నాయకులు,వివిధ హోదాలో ఉన్న మాజీ ప్రజాప్రతినిధులు,ఉద్యమకారులు, అన్ని గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు,కార్యకర్తలు,తదితరులు, పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబం మంచి సోదరున్ని కోల్పోయింది

- జిల్లా ఎస్పీ కె.నరసింహా

**కోదాడ టౌన్, నవంబర్ 16 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ శీలం కమలాకర్ మృత దేహానికి ఆదివారం ప్రభుత్వ ఆస్పటల్ నందు పూలమాల వేసి నివాళి ఘటించారు జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ కమలాకర్ మృతి చెందడం చాలా బాధాకరం,ఈ సంఘటన చాలా దురదృష్టకరం, కమలాకర్ మంచి సర్వీస్ రికార్డు కలిగిన వ్యక్తి, ఒక మంచి పోలీస్ కోల్పోయాం అని ఎస్పీ నరసింహ ఆవేద వ్యక్తం చేశారు. కమలాకర్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కమలాకర్ ఆశయాలు,ఆలోచనలు ముందుకు తీసుకెళతాము అన్నారు.పోలీసు సిబ్బంది అనుక్షణం ప్రజల రక్షణలో, సమాజ రక్షణలో ప్రాణాలు పణంగా పెట్టీ నిరంతరం పని చేస్తున్నారు.విధుల నిర్వహణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఎస్పి వెంట డి.ఎస్.పి ప్రసన్న కుమార్,నాగేశ్వరరావు,సీఐ వెంకటయ్య,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్ ఉన్నారు.






# మూడేళ్ల పాత ఫోన్.. ఐ20 కారులోనే ప్రయాణం!

## తెలివైన పెట్టుబడి దారు తేజస్వి ప్రకాష్..



**న్యూఢిల్లీ**నటిగా మాత్రమే చాలామందికి తెలిసిన తేజస్వి ప్రకాష్.. ఒక తెలివైన పెట్టుబడిదారు అని బహుశా కొంతమందికి మాత్రమే తెలుసు. ఈమె వద్ద ఆడి కారు ఉన్నప్పటికీ.. ఐ20 కారునే ఎక్కువగా ఉపయోగిస్తున్నట్లు.. ఇటీవల ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. బిగ్‌బాస్ 15 విజేత అయిన తేజస్వి ప్రకాష్ నికర విలువ రూ. 25 కోట్లు అని 2024లో పింక్ విల్లా ప్రచురించిన నివేదిక ద్వారా వెల్లడించింది. ఈమెకు భారతదేశంలోనే కాకుండా దుబాయ్‌లో కూడా కోట్ల విలువైన ఆస్తులను ఉన్నట్లు సమాచారం. అయితే ఈమె ఎప్పుడూ ఐ20 కారును ఎక్కువగా ఉపయోగిస్తున్నట్లు, దానికి కారణం కూడా చెప్పింది."నాకు నా ఆడి కారు ఇష్టం, కానీ నేను తరచుగా నా ఐ20లో ప్రయాణిస్తాను. ఎందుకంటే అది చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. ఆడి కారు పార్క్ చేయడానికి స్థలం అవసరం, కానీ ఐ20 విషయంలో అలా కాదు" అని తేజస్వి ప్రకాష్ పేర్కొన్నారు. అంతే కాకుండా ఆడి కారును ఉపయోగించేటప్పుడు ఏదైనా గీతలు పడితే.. దానికోసం డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. కాబట్టి నేను ఐ20ని తీసుకెళ్లడానికి ఇష్టపడతానని ఆమె వెల్లడించారు.తేజస్వి ప్రకాష్.. ఏప్రిల్ 2022లో ఆడి క్యూ7 కారును కొనుగోలు చేశారు. దీని ధర రూ. 90 లక్షల నుంచి రూ. 1 కోటి మధ్య ఉంది. అంతే కాకుండా తాను మూడేళ్లకు ముందు లాంచ్ అయిన ఐఫోన్ వారుందుతున్నట్లు చెప్పింది. ప్రతి సంవత్సరం కొత్త ఫోన్ కొనాలనే ఆలోచన నాకు లేదని స్పష్టం చేసింది.తేజస్వి ప్రకాశ్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉంది. అంతే కాకుండా జుహులో సామ్స్ సలోన్ అనే సెలూన్ ఉంది. ఎప్పుడూ డబ్బు సంపాదించే ఆస్తులలో పెట్టుబడి పెట్టాలని ఆమె చెబుతారు. "నేను ఒక ఆస్తిలో పెట్టుబడి పెడితే, ఇంట్లో కూర్చొని దాని నుంచి సంపాదించవచ్చని నాకు తెలుసు. నేను ప్రస్తుతానికి ఆస్తిని ఉపయోగించకపోవచ్చు, కానీ అది నాకు ఆదాయాన్ని సంపాదించిపెడుతుందని అన్నారు. కాలక్రమేణా విలువ తగ్గుతున్న హై హీల్స్, బ్యాగులపై విచ్చలవిడిగా ఖర్చు చేయకుండా, జాగ్రత్తగా డబ్బును పొదుపు చేయండి ఆమె యువతకు సలహా ఇచ్చింది.

# మళ్లీ పసిడి పరుగు మొదలు

## ఒక్క వారంలో బంగారం ఎందుకింత పెరిగింది?



**ముంబై:**బంగారం ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటేలా పెరిగిపోతున్నాయి. దేశంలో పుత్తడి ధరల పెరుగుదల పసిడిప్రియులను కలవరపెడుతోంది. గడిచిన వారం రోజుల్లో బంగారం ధరలు ఎంత మేర పెరిగాయి..అందుకు కారణాలేంటి.. అన్న విషయాలను ఈ కథనంలో తెలుసుకుందాం..దేశంలో బంగారం ధరలు గడిచిన వారం రోజుల్లో భారీగా ఎగిశాయి. 24 క్యారెట్ల బంగారం తులం (10 గ్రాములు) ప్రస్తుత ధర (నవంబర్ 16) రూ.1,25,080. ఇది వారం రోజుల క్రితం అంటే నవంబర్ 9న రూ.1,22,020. అంటే వారం రోజుల్లో రూ.3060 పెరిగిందన్న మాట.ఇక 22 క్యారెట్ల పసిడి విషయానికి వస్తే.. ప్రస్తుతం (నవంబర్ 16) దీని తులం ధర రూ.1,14,650లుగా ఉంది. ఇది నవంబర్ 9న రూ.1,11,850లుగా ఉండేది. ఒక్క వారంలోనే 10 గ్రాములకు రూ.2800 ఎగిసింది.ఒక్క వారంలోనే బంగారం ధరలు ఇంతలా పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి.ఇటీవల బడ్జెట్‌లో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ తగ్గించే అవకాశాలు పెరిగాయి. వడ్డీలు తగ్గితే, బంగారం మరింత ఆకర్షణీయంగా మారుతుంది.ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, రాజకీయ ఉద్రిక్తతలు బంగారానికి సురక్షిత ఆస్తిగా విలువను కల్పిస్తున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు పసిడి కొనుగోళ్లకు మక్కువ చూపుతున్నారు.కొన్ని దేశాల కేంద్ర బ్యాంకులు తమ బంగారం నిల్వలను పెంచుకుంటున్నాయి. ఇది స్థిరమైన, దీర్ఘకాల డిమాండ్‌ను పెంచుతుంది. బంగారానికి సంబంధించిన ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు ఎక్కువవుతున్నాయి. సంస్థాగత పెట్టుబడిదారులు బంగారంపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు.యూఎస్ డాలర్ బలం తగ్గడం కూడా బంగారం ధరలకు ఆజ్యం పోస్తోంది. బంగారం విలువ సాధారణంగా డాలర్లలో లెక్కిస్తారు. డాలర్ బలహీనంగా ఉంటే, ఇతర దేశాల పెట్టుబడిదారులు బంగారాన్ని తక్కువ ఖర్చుతో కొనగలరు.

# నాడు కట్టుబట్టలతో ప్రయాణం నేడు దుబాయ్‌లో వేలమందికి ఉద్యోగం



**అబుదాబి:**సాధించాలనే తపన, కష్టపడే మనస్తత్వం ఉంటే ఎవరైనా సక్సెస్ అవ్వొచ్చు. దీనికి నిదర్శనమే 'కున్హ మొహమ్మద్'. కేరళ నుంచి కేవలం కట్టుకున్న బట్టలతో దుబాయ్ చేరిన ఈయన, సొంతంగా కంపెనీ స్థాపించి వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. నేడు ఎందోమందికి ఆదర్శంగా నిలిచారు. ఈయన గురించి, ఈయన సాధించిన సక్సెస్ గురించి ఇక్కడ వివరంగా తెలుసుకుందాం. కేరళకు చెందిన కున్హ మొహమ్మద్ 22 సంవత్సరాల వయసులో.. ఉన్న ఊరును వదిలి, కట్టుబట్టలతో దుబాయ్ వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఖ్వాజా మొయిదీన్ అనే చెక్క పడవపై సముద్రంలో.. కొంతమందితో కలిసి 40 రోజులు ప్రయాణం చేసి, ఒమన్‌లోని దిబ్బా అల్ బయా సమీపానికి చేరుకున్నారు. తన ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు చూశారు. అయితే దేవుడిపై భారం వేసి ప్రయాణం కొనసాగించారు.దిబ్బా అల్ బయా నుంచి ఒమన్ సరిహద్దుకు చేరుకోవడానికి తోటి ప్రయాణికులతో కలిసి గంటల తరబడి నడిచారు. ఆ తరువాత పుచ్చకాయలను తీసుకెళ్తున్న ట్రక్కులో ప్రయాణం చేసి షార్జాకు చేరుకున్నారు. కున్హ మొహమ్మద్ అక్కడే ఒక ఫ్లంబర్ దగ్గర అసిస్టెంట్‌గా చేరారు. అయితే అతని చేతులు చెమటలు పట్టడం వల్ల.. పనిముట్లను పట్టుకోలేకపోయారు. దీంతో కున్హ ఆ పనిచేయలేకపోయారు. అయితే అప్పటికే అక్కడ 20 రోజులు పనిచేయడం వల్ల 100 రియాల్ పొందారు. ఇదే అతని మొదటి జీతం.ఆ తరువాత కున్హ మొహమ్మద్.. ఆఫులకు పాలు పితకడం, పాత్రలు శుభ్రం చేయడం, చేపల బుట్టలు తయారు చేయడం వంటి ఇతర ఉద్యోగాలను ప్రయత్నించారు. ఒకసారి.. తాను పాత్రలు శుభ్రం చేస్తున్నప్పుడు, యజమాని కారు మురికిగా ఉండటం చూసి దానిని కడిగి, పాలిష్ చేసి, లోపల బుఖూర్ (ధూపం) వేసాను. నేను చేసిన పనికి యజమాని నా జీతం 100 ఖతార్ దుబాయ్ రియాల్స్ పెంచారు.కున్హ మొహమ్మద్ స్నేహితుడు ఒకరు.. అప్పటి యుఎఇ నగరమైన రస్ అల్-ఖైమా పాలకుడు షేక్ సఖ్ర్ బిన్ మొహమ్మద్ అల్ ఖాసిమికి పరిచయం చేసాడు. ఇదే అతని జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ తరువాత అతను షేక్ ఇంట్లో డ్రైవర్ అయ్యారు, అక్కడే అతను నాలుగు సంవత్సరాలు పనిచేశారు. యజమాని అతన్ని గౌరవంగా చూసుకున్నారు. యజమాని నుంచే.. నమ్మకం బాధ్యత విలువను మొహమ్మద్ నేర్చుకున్నారు. అదే ఆ తరువాత వ్యాపారం చేయడానికి మార్గమైంది.1972లో కున్హ మొహమ్మద్ జలీల్ ట్రేడర్స్ కంపెనీ ప్రారంభించారు. తరువాత దానికి జలీల్ హోల్డింగ్స్ అని పేరు మార్చారు. ఈ కంపెనీ అభివృద్ధికి షేక్ సఖ్ర్ బిన్ మొహమ్మద్ అల్ ఖాసిమి ఎంతో సహకరించారని ఆయన పేర్కొన్నారు. ఒక సాధారణ ఆహార పదార్థాల వ్యాపార సంస్థగా మొదలైన కంపెనీ.. ఆ తరువాత తాజా ఉత్పత్తులు %6 ఫ్రీజీ+% పంపిణీని నిర్వహించే కంపెనీగా అవతరించింది. ప్రస్తుతం కున్హ మొహమ్మద్ సారథ్యంలోని కంపెనీలో సుమారు 1,700 మంది పనిచేస్తున్నట్లు సమాచారం. దీన్నిబట్టి చూస్తే ఈయన ఎంత ఎదిగిపోయారు అర్థం చేసుకోవచ్చు.

# విస్తరణ దిశగా అల్ట్రావయొలెట్

**బెంగళూరు:**బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ అల్ట్రా వయొలెట్ తమ కొత్త యూవీ స్పేస్ స్టేషన్‌ను విజయవాడలో ప్రారంభించింది. ఇందులో ఎక్స్-47, ఎఫ్77 మాక్ 2, ఎఫ్77 సూపర్‌స్ట్రీట్ తదితర వాహనాలు అందుబాటులో ఉంటాయి.చూడటానికి స్టైలిష్ డిజైన్ కలిగిన అల్ట్రా వయొలెట్ ఎలక్ట్రిక్ బైకులు.. ఎందుకుని వేరియంట్‌ను బట్టి 2.8 సెకన్లలో గంటకు 60 కి.మీ. వేగాన్ని అందుకోగలవు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 323 కి.మీ.వరకు రేంజ్ ఉంటుంది. ఈ బైకులు ప్రస్తుతం దేశీయ విపణిలో మాత్రమే కాకుండా.. గ్లోబల్ మార్కెట్లో కూడా అమ్మకానికి ఉన్నాయి. ఇవి అత్యుత్తమ పనితీరును అందించడం వల్ల ఎక్కువమంది.. ఈ బైకులను ఇష్టపడి కొనుగోలు చేస్తుంటారు.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.10 | ₹ 6.12 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,14,650 (22 క్యారెట్లు) | ₹ 1,25,080 (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,75,000

# జియో కొత్త రీచార్జ్..

- 200 రోజుల చౌక ప్లాన్

టెలికాం రంగంలో అతిపెద్ద యూజర్ బేస్, రీఛార్జ్ ప్లాన్ల విస్తృత పోర్ట్‌ఫోలియోను కలిగి ఉన్న రిలయన్స్ జియో.. తన కస్టమర్ల కోసం తక్కువ-ధర, హై-ఎండ్ విభాగాలలో విస్తృత శ్రేణి ప్లాన్‌లను అందిస్తోంది.తక్కువ ఖర్చుతో ఎక్కువ రోజులు సిమ్ కార్డు యాక్టివ్‌గా ఉంచుకోవాలనుకునే కస్టమర్ల కోసం దీర్ఘకాల వ్యాలిడిటీతో చౌక రీఛార్జ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టింది.మిలియన్ల మంది మొబైల్ వినియోగదారుల అవసరాలను గుర్తించి, జియో ఇప్పుడు దీర్ఘకాలిక వ్యాలిడిటీ రీఛార్జ్ ప్లాన్ల జాబితాలో చేర్చిన ప్లాన్ ధర రూ.2025. ఖరీదైన 365 రోజుల రీఛార్జ్ ప్లాన్ కొనడానికి ఇష్టపడని కస్టమర్లకు ఈ ప్లాన్ ఉత్తమ ఎంపిక. జియో ఈ ప్లాన్‌ను ఉత్తమ 5జీ ప్లాన్లలో ఒకటిగా లిస్ట్ చేసింది.జియో తన రూ.2025 ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ తో వినియోగదారులకు 200 రోజుల సుదీర్ఘ వాలిడిటీని అందిస్తుంది. అన్ని మొబైల్ నెట్ వర్క్ లకు 200 రోజుల పాటు అపరిమిత కాలింగ్ ను ఆనందించవచ్చు. ఇక డేటా ప్రయోజనాల విషయానికి వస్తే.. 200 రోజుల పాటు మొత్తం 500 జీబి డేటాను అందిస్తుంది. రోజుకు 2.5 జీబీ వరకు హై స్పీడ్ డేటాను వినియోగించుకోవచ్చు. ఇంకా ఈ ప్లాన్ లో రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు ఉన్నాయి. ఈ ప్లాన్ తో అపరిమిత 5జీ డేటాను ఆనందించవచ్చు.జియో యూజర్లు ఈ ప్లాన్ తో కొన్ని అదనపు ప్రయోజనాలను కూడా పొందుతారు. ఈ ప్లాన్ లో మూడు నెలల పాటు జియో హాట్ స్టార్ కు ఉచిత సబ్‌స్క్రిప్షన్ కూడా ఉంది.

# ఆసియా పసిఫిక్‌లో కీలకంగా భారత్



- విమానయాన వృద్ధిలో చైనాది కూడా ప్రధాన పాత్ర
- తొలి 9 నెలల్లో ప్రాంతీయంగా 10% పెరిగిన ఎయిర్ ట్రాఫిక్.. ఏపీఏపీ వెల్లడి

**బ్యాంకాక్:**ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో విమానయాన రంగ వృద్ధికి భారత్, చైనా కీలకంగా నిలుస్తున్నాయని అసోసియేషన్ ఆఫ్ ఆసియా పసిఫిక్ ఎయిర్‌లైన్స్ (ఏపీఏపీ) వెల్లడించింది.ప్యాసింజర్, కార్గోలకు డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో 2026లో కూడా పరిశ్రమ వృద్ధి సానుకూలంగా ఉంటుందని అభిప్రాయపడ్డ ఏపీఏపీ డైరెక్టర్ జనరల్ సుభాస్ మీనన్ తెలిపారు. ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల్లో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఎయిర్ ట్రాఫిక్ 10 శాతం పెరిగిందని వివరించారు.2025 తొలి ఆరు నెలల్లో భారత్ నుంచి విదేశాలకు వెళ్లే, వచ్చే ప్రయాణికుల సంఖ్య 16 శాతం వృద్ధి చెందిందని 69వ అసెంబ్లీ ఆఫ్ ప్రెసిడెంట్స్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దేశీ మార్కెట్ విస్తరించేందుకు భారీగా అవకాశాలు ఉన్నాయని చెప్పారు.చారిత్రకంగా చూస్తే భారతీయ విమానయాన దిగ్గజం ఎయిరిండియా చాలా కీలకమైనదని, అది నిలదొక్కుకునేందుకు కాస్త సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని మీనన్ చెప్పారు. సరఫరా వ్యవస్థపరంగా అంతరాయాలు ఎదుర్కొంటున్నప్పటికీ ఆసియా పసిఫిక్ ఎయిర్‌లైన్స్ డిమాండ్‌కి తగ్గ స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏపీఏపీలో ఎయిరిండియా సహా 18 విమానయాన సంస్థలకు సభ్యత్వం ఉంది.సదస్సు సందర్భంగా ఏపీఏపీ నాలుగు తీర్మానాలను ఆమోదించింది. సరఫరా వ్యవస్థపరమైన సవాళ్లను అధిగమించడం, విమానాల్లో లిథియం బ్యాటరీలను తీసుకెళ్లడం, పన్నులు..చార్జీలు, పర్యావరణహితమైన విధంగా ఏవియేషన్ కార్యకలాపాలు సాగించడంలాంటి అంశాలు వీటిలో ఉన్నాయి. ప్రాంతీయంగా ఎంఆర్‌ఓ (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్) కార్యకలాపాలు పెరిగేలా నియంత్రణ సంస్థల చర్యలు తీసుకోవడం, తయారీ సామర్థ్యాలు పెంచుకునేందుకు ఊతమివ్వడం, నిర్దిష్ట పెట్టుబడులకు ప్రోత్సాహకాలివ్వడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని ఏపీఏపీ కోరింది. అలాగే పునర్వినియోగానికి పనికొచ్చే ఎయిర్‌క్రాఫ్ట్ మెటీరియల్స్‌ను రీసైకిల్ చేసేలా సర్క్యులర్ ఎకానమీ విధానాలను అమల్లోకి తేవాల్సిన పేర్కొంది.సరఫరా వ్యవస్థపరమైన సవాళ్లతో విమానాల డెలివరీలకు అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఎయిర్‌లైన్స్‌కి విమానయాన పరిశ్రమలోని వివిధ విభాగాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ తెలిపారు. టారిఫ్‌లు, ఇతరత్రా అంశాల కారణంగా విమానాల తయారీ సంస్థలు (ఓఈఎం) ధరలు పెంచే యోచనలో ఉన్నట్లు వస్తున్న వార్తలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిర్‌లైన్స్ మార్జిన్లు చాలా తక్కువగా ఉంటాయని, మరోవైపు ఓఈఎంల మార్జిన్లు అధిక స్థాయిలో ఉంటాయని వాల్ష్ తెలిపారు. మిగతా వర్గాల లాభాలార్జించడంపై తమకే అభ్యంతరం లేదు కానీ పరిశ్రమలో సమతౌల్యత అవసరమని ఆయన పేర్కొన్నారు.మరోవైపు, ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సరఫరా వ్యవస్థపై టారిఫ్‌లు ప్రతికూల ప్రభావం చూపుతాయని సుభాష్ మీనన్ చెప్పారు. వీటి వల్ల విమానయాన సంస్థల ఇంధనేతర వ్యయాలు కూడా పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. టారిఫ్‌ల వల్ల ఇటు సరఫరా, అటు డిమాండ్ మీద ప్రభావం పడుతుందన్నారు. కన్సల్టింగ్ సంస్థ ఆలివర్ వైమాన్‌తో కలిసి ఐఏటీఏ నిర్వహించిన అధ్యయనం ప్రకారం సరఫరా వ్యవస్థ సవాళ్ల కారణంగా 2025లో అంతర్జాతీయంగా ఎయిర్‌లైన్స్ పరిశ్రమపై 11 బిలియన్ డాలర్ల మేర ప్రతికూల ప్రభావం పడనుంది. అక్టోబర్‌లో విడుదల చేసిన నివేదిక ప్రకారం ఇంధనం అధికంగా వాడాల్సి రావడం, అదనపు మెయింటెనెన్స్, మరింత ఎక్కువగా ఇంజిన్లను లీజుకు తీసుకోవడంలాంటి అంశాలపై విమానయాన సంస్థలు గణనీయంగా వెచ్చించాల్సి రానుంది.వచ్చే 20 ఏళ్లలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో 19,560 చిన్న, పెద్ద విమానాలు అవసరమవుతాయని అంచనా వేస్తున్నట్లు విమానాల తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ వెల్లడించింది. అంతర్జాతీయంగా 20 ఏళ్లలో 42,520 విమానాలు అవసరం కానుండగా, ఇది అందులో దాదాపు సగమని వివరించింది. భారత్, చైనాలో విమానయానానికి డిమాండ్ పెరుగుతుండటం ఇందుకు ప్రధాన కారణమని ఎయిర్‌బస్ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీ చెప్పారు. ప్రాంతీయంగా ప్యాసింజర్ సంఖ్య ఏటా 4.4 శాతం వృద్ధి చెందుతుందని, ఇది అంతర్జాతీయ సగటు 3.6 శాతం కన్నా అధికమని వివరించారు. ఆసియా-పసిఫిక్‌లో సరికొత్త వృద్ధి దశలోకి ప్రవేశిస్తోందని స్టాన్లీ పేర్కొన్నారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుదల, నెట్‌వర్క్ విస్తరణ, చౌక విమానయాన సంస్థల రాక, మౌలిక సదుపాయాలు మెరుగుపడటం మొదలైనవి విమానయాన వృద్ధికి దోహదపడే అంశాలని చెప్పారు.తమ కొత్త తరం వైడ్-బాడీ విమానాలు 25 శాతం మేర ఇంధనాన్ని ఆదా చేస్తాయని, కర్బన ఉద్గారాలను కూడా ఆ మేరకు తగ్గిస్తాయని ఎయిర్‌బస్ తెలిపింది. ఏపీఏపీ సదస్సు సందర్భంగా ఎయిర్‌బస్ వెల్లడించిన అంచనాల ప్రకారం ఆసియా పసిఫిక్‌లో వచ్చే రెండు దశాబ్దాల్లో 3,500 పెద్ద విమానాలు అవసరం కానున్నాయి. ఇది అంతర్జాతీయంగా పెద్ద విమానాలకున్న డిమాండ్‌లో సుమారు 43 శాతం. మరోవైపు, ప్రాంతీయంగా 16,100 చిన్న విమానాలు కావాల్సి ఉంటుంది. గ్లోబల్ డిమాండ్‌లో దాదాపు 47 శాతం. దాదాపు 32 శాతం విమానాలు పాత మోడల్స్ స్థానాన్ని భర్తీ చేయనుండగా, మిగతావి ఫ్లీట్ విస్తరణకు ఉపయోగపడనున్నాయి.

# భారత మహిళ నిర్వాకం.. పర్యాటకురాలిగా పాక్‌కు వెళ్లి..

**లాహోర్/చండీగఢ్:** పాకిస్తాన్‌లో గురునానక్ జయంతి వేడుకల్లో పాల్గొనే వంకతో వాఘా సరిహద్దు గుండా దాయాది దేశంలో అడుగుపెట్టిన 48 ఏళ్ల భారతీయురాలు మరుసటి రోజే కనిపించకుండాపోయారు.ఈ క్రమంలో పాకిస్తానీ పోలీసుల దర్యాప్తులో ఆమె స్థానిక పాకిస్తానీయుడిని పెళ్లిచేసుకున్నట్లు వెల్లడైంది.సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన పాక్ జాతీయుడిని పెళ్లి, మతం మార్చుకుని వివాహం చేసుకుని అతడితో కలిసి ఎటో వెళ్లిపోయినట్లు లాహోర్‌లోని పాక్ పోలీసులు శనివారం తెలిపారు. ఆమె జాడ కోసం తాము కూడా వెతుకుతున్నామని చెప్పారు. పంజాబ్‌లోని కపుర్తలా జిల్లా అమానీపూర్ గ్రామానికి చెందిన సరబ్‌జీత్ కౌర్ నవంబర్ మూడో తేదీన 2,000 మంది సిక్కు యాత్రికులతో కలిసి పాకిస్తాన్‌లోని వంజాబ్ ప్రావిన్స్‌కు వెళ్లారు.తర్వాతి రోజే ఫరూఖాబాద్ పరిధిలోని షేఖుపురాకు చెందిన నసీర్ హుస్సేన్‌ను ఆమె పెళ్లాడారు. కౌర్ పేరును నూర్‌గా మార్చుకున్నారు. కౌర్‌కు ఇప్పటికే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త కొన్నేళ్లుగా విదేశాల్లో ఉంటున్నారు. మరోవైపు, ఆమె పాకిస్తాన్ వ్యక్తిని పెళ్లి చేసుకున్న వీడియో బయటకు వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# పాక్‌లో 2.5 కోట్ల బాలలు బడిబయటే..




**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ వ్యాప్తంగా కనీసం 2.5 కోట్ల మంది బాలలు బడిబయటే ఉన్నారు. వీరిలో కనీసం 2 కోట్ల మంది బడి ముఖమే ఎరుగరు. ఏ విద్య సంస్థలోనూ పేరు నమోదు చేయించుకోని 1,084 మంది ట్రాన్స్ జెండర్ బాలలు సైతం వీరిలో ఉన్నారు.ఈ మేరకు ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(పీఐఈ) విడుదల చేసిన నివేదిక మీడియాలో ప్రసారమవుతోంది. అందరికీ విద్య అందుబాటులో లేదనే విషయం ఈ నివేదికతో స్పష్టమవుతోందని సామాజికవేత్తలు అంటున్నారు. స్కూలుకు వెళ్లని బాలలు అత్యధికంగా 96 లక్షల మంది పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్నారు. ఆ తర్వాత సింధ్‌లో 78 లక్షలు, ఖైబర్ ప్రావిన్స్‌లో 49 లక్షలు, బలూచిస్తాన్‌లో 29 లక్షలమంది బాలలు అక్షరజ్ఞానానికి నోచుకోవడం లేదని నివేదిక తెలిపింది. సొంతానికి దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో 6-16 ఏళ్ల మధ్యనున్న కనీసం 89 వేల మంది బాలలు బడి బయటే గడుపుతున్నట్లు పీఐఈ తెలిపింది. దేశంలో ఇలాంటి వారి సంఖ్య ఏడాదికి 20లేల దొప్పున పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసింది.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్..

అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఉదయం నుంచి ఇరువైపుల నుంచి కాల్పులు కొనసాగుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ముగ్గురు మావోయిస్టులు మిలిషియా కమాండర్, ఏరియా కమిటీ సభ్యులైన మద్వి దేవా, సీఎన్ఎం కమాండర్ పోడి యం గంగి, కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు పోడి గంగిగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో అమాయక ప్రజలపై జరిగిన అనేక దాడులలో వీరి హస్తం ఉందన్నారు. వారి వద్ద ఉన్న 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సుక్మాలో జరుగుతున్న ఎన్‌కౌంటర్‌ను ఎస్పీ కిరణ్ చవాన్ పర్యవేక్షిస్తున్నారు.



# ఒక పరీక్ష.. 13 గంటలు



**సియోల్:**ప్రతి నవంబర్‌లో.. దక్షిణ కొరియా నేలంతా ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంటుంది. ఆ రోజు దేశం ఊపిరి బిగబట్టి నిల్చుంటుంది. కారణం.. ఆ రోజు పిల్లల భవితవ్యాన్ని నిర్ణయించే అత్యంత ప్రతిష్ఠాత్మక కాలేజ్ ప్రవేశ పరీక్ష 'సునుంగ్' జరుగుతుంది.ఆ రోజు ఆకాశంలో విమానాలు ఆలస్యమవుతాయి, వీధుల్లో వాహనాల శబ్దం తగ్గుతుంది. దుకాణాలు సైతం మూతపడతాయి. లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్ణయించే ఆ మహాపరీక్ష కోసం సిద్ధమవుతారు. ఈ పరీక్షలో విజయం యూనివర్సిటీ ప్రవేశాన్ని మాత్రమే కాదు.. విద్యార్థుల ఉద్యోగం, ఆదాయం, నివాసం, చివరికి వివాహ బంధాన్ని సైతం ప్రభావితం చేస్తుంది.సాధారణంగా విద్యార్థులందరికీ ఇది ఉదయం 8.40 గంటలకు మొదలై సాయంత్రం 5.40 గంటలకు ముగిసే 8 గంటల మోరా మారథాన్. పరీక్ష ముగిశాక విద్యార్థులంతా అలసటతో స్కూలు గేటు దాటి బయటికి వస్తారు. అక్కడ తమ కోసం నిరీక్షిస్తున్న తల్లిదండ్రుల ఆనందభాష్పాల ఆలింగనంతో కష్టాన్ని మరిచిపోతారు. కానీ కొందరు విద్యార్థులకు కన్నీరు కార్చేందుకు కూడా సమయం దొరకదు. చీకట్లో ఆశల వెలుగును వెతుక్కుంటారు. పరీక్ష కేంద్రం గదిలోనే మిగిలిపోతారు. రాత్రి 10 గంటల వరకు కూడా వారి పోరాటం కొనసాగుతుంది. వారంతా తీవ్ర దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులు. ఆ క్షణమే వారి అసలు కన్నీటి కథకు అంకురార్పణ!సాధారణ విద్యార్థులకంటే 1.7 రెట్లు ఎక్కువ సమయం.. వారికి కేటాయించినా, ఈ సునుంగ్ పరీక్ష దాదాపు 13 గంటల సుదీర్ఘ పోరాటమే. అదనపు విదేశీ భాషా విభాగాన్ని తీసుకుంటే.. ఈ పరీక్ష రాత్రి 9.48 గంటల వరకు సాగుతుంది. వారికి మధ్యాహ్న భోజన విరామం మాత్రమే ఉంటుంది. రాత్రి భోజనానికి విరామం లేదు. పరీక్ష నిరాటంకంగా కొనసాగుతుంది. 13 గంటలు.. అంటే ఒక రోజులో దాదాపు సగం సమయం కేవలం పరీక్ష కోసం కేటాయించాలి.దీనికి కారణం బ్రెయిలీ పరీక్ష పత్రాల బరువు. ప్రతి ఒక్క వాక్యం, చిహ్నం, పటం బ్రెయిలీలోకి మారినప్పుడు, ఒక్కొక్క ప్రశ్నపత్రం సాధారణ ప్రశ్నపత్రం కంటే 6 నుంచి 9 రెట్లు మందంగా మారుతుంది. సియోల్ హన్‌బిట్ స్కూల్ ఫర్ ది బ్లైండ్ విద్యార్థి అయిన 18 ఏళ్ల హాన్ డోంగ్హ్యున్ ఈ ఏడాది సుదీర్ఘ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులలో ఒకడు. పుట్టుకతోనే పూర్తిగా అంధుడైన డోంగ్హ్యున్ కాంతిని కూడా గుర్తించలేడు. 'సుదీర్ఘ పరీ క్ష కాబట్టి నిజంగా అలసిపోతాను. తప్పించుకుని ప్రత్యేక చిట్కాలేవీ నాకు తెలియవు. నా స్టడీ షెడ్యూల్‌ను అనుసరిస్తాను. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాను. అదే ఏకైక మార్గం'.. అన్నాడు డోంగ్హ్యున్.

సుమారు 16 పేజీలుండే కొరియన్ భాషా విభాగానికి సంబంధించిన బ్రెయిలీ పుస్తకం దాదాపు 100 పేజీలు ఉంటుంది. డోంగ్హ్యున్ తన వేళ్లతో బ్రెయిలీని చదువుతున్నంత వేగంగానే, జ్ఞాపకశక్తితో వివరాలను నిక్షిప్తం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'మధ్యాహ్నం భోజనం వరకు సర్దుబాటు చేసుకోవచ్చు. కానీ సాయంత్రం 4 లేదా 5 గంటల సమయంలో, ఆఖరి పరీక్షా తర్వాత.. అప్పుడు నిజంగా వాలా కష్టంగా ఉంటుంది. మాకు రాత్రి భోజన విరామం లేదు. భోజనం చేయాల్సిన సమయంలో పరీక్షతో కుస్తీ పట్టడం మరింత అలసటను కలిగిస్తుంది'.. అన్నాడు 18 ఏళ్ల జియాంగ్-వోన్. అయినా, 'చివరికి ఒక గొప్ప విజయం ఉంటుంది అనే భావనే నన్ను ముందుకు నడిపిస్తుంది'.. అని గొప్ప ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశాడు.అంధ విద్యార్థులకు పరీక్ష వ్యవధి, సుదీర్ఘ అధ్యయన గంటలు కష్టం అనిపించదు. వారిముందున్న అతిపెద్ద సవాలు ఏమిటంటే.. అధ్యయన సామగ్రిని పొందడం! సాధారణ విద్యార్థులు ఆధారపడే ప్రముఖ పాఠ్యపుస్తకాలు, ఆన్‌లైన్ ఉపన్యాసాలు వీరికి అందుబాటులో ఉండవు. బ్రెయిలీ వెర్షన్లు చాలా తక్కువ. జాతీయ పరీక్షకు సంబంధించిన ఈబీఎస్ (ఎడ్యుకేషనల్ బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్) బ్రెయిలీ పుస్తకాలు వీరికి అత్యంత అవసరం. 'సాధారణ విద్యార్థులు తమ ఈబీఎస్ పుస్తకాలను జనవరి-మార్చి మధ్య తీసుకుని ఏడాది పొడవునా చదువుకుంటారు.

## కాంగ్రెస్..బీజేపీలకు చిత్తశుద్ధి ఉంటే

# బీసీ రిజర్వేషన్ అమలు చేయాలె!

- న్యాయబద్ధమైన రిజర్వేషన్లు అమలుచేయాలన్నదే బీసీల ఆకాంక్ష
- మానిఫెస్టోతో అన్ని వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలకు పోతే బీసీ సమాజం ఊరుకోదు
- రన్ ఫర్ జస్టిస్తో బీజేపీ..కాంగ్రెస్ ప్రభుత్వాలు కళ్లు తెరువాలె
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**రామగిరి, నవంబర్ 16 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో ఉన్న బీజేపీలకు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ బీసీ జేఏసీ పిలుపు మేరకు నల్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో రామగిరి రాణిరుద్రమదేవి స్టేడియం నుంచి పన్నూర్ సెంటర్ వరకు చేపట్టిన రన్ ఫర్ జస్టిస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లను బీసీ సమాజం కోరుకుంటుందని, న్యాయబద్ధమైన రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలన్నదే బీసీల ఆకాంక్షఅని ఆయన అన్నారు. దేశంలో రాష్ట్రంలో సింహభాగం పాలించిన పాలకులు బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అర్థం చేసుకుని పాలించలేదన్నారు. ఇప్పటికి రిజర్వేషన్లు అడుగుతున్నారంటే పాలకులు అవమానపరచాలని ఆయన అన్నారు. కులవృత్తులను ఆధారంగా చేసుకుని పనిచేసే రజకులకు ధోబిఘాట్లు కట్టించి టాక్సీలతో ప్రభుత్వాలను నడిపిస్తున్న పాలకులను అవమానపరిచారని, కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పాలకులు కళ్లు తెరవాలని ఆయన అన్నారు. రాజ్యాంగం రాసిన అంబేద్కర్ గురించి చెప్పే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు, రాజ్యాంగం చేతిలో పట్టుకుని తిరిగే నాయకులకు రాజ్యాంగం అర్థం అయితే వెంటనే రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన హితవు పలికారు. అంటరానితనం, వివక్ష, ఆకలితో ఈ సమాజం ఉండకుండా పైకి తీసుకెళ్లే బాధ్యతను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో అనేక అంశాలను పెట్టిందని, బీసీలకు ఉద్యోగ, రాజకీయ, విద్యా పరంగా రిజర్వేషన్లతో పాటు వృత్తి పరంగా రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఆ అంశాలను విస్మరించిందన్నారు. ఆనాడు కాకా కలేల్కర్ కమీషన్ను తుంగలో తొక్కినట్లు ఈనాడు తన మానిఫెస్టోను అమలుపర్చుకుంటుందని ఎద్దేవా చేశారు. చట్టపరంగా ఏ విధంగా రిజర్వేషన్లను తీసుకోవాలో ఆలోచించకుండా ఈ సమాజంలో అరచేతిలో ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని తెలిసినా భయం లేకుండాపోయిందన్నారు. రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలకు వెళ్తే బీసీ సమాజంఅగ్నిగుండంలో వేస్తుందనే విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు. ఆనాడు మానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఆనాడు రాజకీయ రిజర్వేషన్లే కాకుండా విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, కార్పోరేషన్లలో ఎంబీసీ కమిషన్ వేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటి వరకు చిత్తశుద్ధితో పనిచేయలేదని విమర్శించారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ఫర్ జస్టిస్ కాంగ్రెస్ బీజేపీ ప్రభుత్వాలకు కళ్లు తెరిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ హక్కుల కోసం కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, బీజేపీ, కాంగ్రెస్లో ఉన్న బీసీలు సైతం ఈ కార్యక్రమానికి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సంఘం, ఏ పార్టీలో ఉన్నా బీసీ జేఏసీతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.



## అక్రమంగా మానేరు వాగు నుండి

# ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**వీణవంక నవంబర్ 16 (జనం సాక్షి) :** వీణవంక మండలంలోని కొండపాక, పోతిరెడ్డిపల్లి,మానేరు వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 7 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.వీణవంక మండలంలోని కొండపాక, పోతిరెడ్డిపల్లి,మానేరు వాగు నుండి ఆదివారం అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా అట్టి ట్రాక్టర్లను ఆపి ఇసుక తరలింపునకు ప్రభుత్వ అనుమతి పత్రాలు అడిగారు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా 7 ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో ఇట్టి ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీస్స్టేషన్కు తరలించినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను,ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ వీణవంక మండలంలోఅక్రమంగా ఇసుక రవాణా చేసినట్లయితే అట్టి ట్రాక్టర్ యజమానులపై చట్టరీత్యా చర్య తీసుకుంటామని హెచ్చరించారు.ఎవరైనా ఎంతటి వారైనా అక్రమంగా ఇసుక తరలిస్తే అట్టి ట్రాక్టర్ల సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతానని వారు తెలిపారు.వారి వెంట పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అశోక్,కానిస్టేబుల్స్ వినీత్,దినేష్,తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని బాలిక మృతి

**సుల్తానాబాద్, నవంబర్ 16 (జనంసాక్షి) :** సెలవు రోజు కావడంతో తమ్ముడిని కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుందామని వచ్చిన చిన్నారికి కారు రూపంలో మృత్యువు ఎదురై అనంత లోకాలకు చేరుకుంది. తమ్ముడిని కలిసి న ఆనందం కాసేపైన లేకుండానే మృతి చెందడంతో తమ్ముడితో పాటు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం జగిత్యాల జిల్లా, బీర్పూర్ మండలం, తుంగూర్ గ్రామానికి చెందిన శివ హాసిని (8) తన తమ్ముడు మొట శ్రవణ్, సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శాస్త్రి నగర్ గురుకుల పాఠశాలలో విద్యనభ్య సిస్తుండ గా ఆదివారం సెలవు రోజు కావడంతో నానమ్మ లక్ష్మి పెద్దమ్మ లతో కలిసి తమ్ముడి వద్దకు వచ్చి తన తమ్ముడి తో సరదాగా గడుపుదామని హాస్టల్ నుండి నలుగురు బయటికి వచ్చి రోడ్డు దాటుతుండగా, కారు రూపంలో వచ్చిన మృత్యు శివ హాసిని ని ఢీకొనడంతో తీవ్ర గాయాలు కాగా హుటా హుటిన, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందిందని తెలిపారు. మృతురాలికి తల్లి తండ్రి కిషోర్ లావణ్యకు సమాచారం అందించి నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు, దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

# అధికారుల సంఘం చేసిన ఆరోపణలు సహేతుకం కాదు

- అధికారుల నిర్లక్ష్యంతోనే కార్మికులు ప్రమాదానికి గురవుతున్నారు
- హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్



**గోదావరిఖని, నవంబర్ 16 (జనం సాక్షి) :** అధికారుల సంఘం హెచ్ఎంఎస్పై చేసిన ఆరోపణలు సహేతుకంగా లేవని.. అధికారుల నిర్లక్ష్యంతోనే కార్మికులు ప్రమాదానికి గురవుతున్నారని హెచ్ఎంఎస్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ అన్నారు.స్థానిక తిలక్నగర్ హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రియాజ్అహ్మద్ మాట్లాడుతూ అధికారుల సంఘం హెచ్ఎంఎస్పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.వెంటనే వెన్నక్కి తీసుకోవాలని రియాజ్ డిమాండ్ చేశారు.అధికారుల నిర్లక్ష్యంతోనే అండర్గ్రౌండ్లో పనిచేస్తున్న యువ కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని, దీనికి అధికారుల సంఘం సమాధానం చెప్పాలన్నారు. తేదీ.27.07. 2024లో జీడీకే-2వ గనిలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు తీవ్రగాయాలపాలయ్యారన్నారు. అందులో ఇద్దరు కార్మికులు తూడి సంపత్, నోయల్రాజ్ పరిస్థితి ఇప్పటి విషమంగానే ఉందన్నారు.అయిన వారిని అండర్ గ్రౌండ్ పిట్ ఎలా ఇస్తారని రియాజ్ ప్రశ్నించారు.వారికి జరిగిన అన్యాయం కార్మికుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.ప్రమాదాలకు కారణమైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రియాజ్ మండిపడ్డారు. కార్మికుల సేఫ్టీ గురించి మాట్లాడితే వారికి మాత్రం సస్పెన్షన్లు..ఛార్జ్షీట్లు ఇది ఎక్కడి న్యాయమన్నారు.ఆర్జీ-1 జనరల్ మేనేజర్ అధికారులకే జీఎం కాదని, కార్మికులకు కూడా జీఎం అన్నారు.ఒత్తిడి తీసుకొస్తే జేబీసీసీఐ మీద స్టేట్మెంట్ ఇవ్వడం సరికాదని రియాజ్ సూచించారు.అక్కడ జరిగిన విషయాన్ని పరిశీలించాలన్నారు.మీరు ఇచ్చిన స్టేట్మెంట్ను వెంటనే వెన్నకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆర్జీ-1లో అధికారుల నిర్లక్ష్యంతో జరిగిన ప్రమాదాలు చాలా ఉన్నాయన్నారు.వాటి మీద ఇప్పడివరకు తీసుకున్న చర్యలు ఎక్కడ అని నిలదీశారు.ఇలా చెప్పుకుంట వెళ్తే చాలా ఉన్నాయని రియాజ్ పేర్కొన్నారు.కార్మికుల సమస్యల గురించి మాట్లాడే హక్కు జేబీసీసీఐ సంఘానికి ఉందన్నారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీ,జేబీసీసీఐ సభ్యులు రియాజ్అహ్మద్, డిప్యూటి జనరల్ సెక్రటరీ వెంకట్, వైస్ ప్రెసిడెంట్ గాలి కిరణ్కుమార్, బ్రాంచ్ కార్యదర్శి పల్లె క్రాంతికుమార్, జాయింట్ సెక్రటరీ దబ్బెట సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్,ఆర్జీ-2 పిట్ కార్యదర్శి రామచందర్, ఆర్జీ-1 పిట్ కార్యదర్శి చందర్రావు, ఆర్జీ-2 పిట్ కార్యదర్శి సంపత్, కుమారస్వామి, మల్లేశ్, నజీర్, రఫీ, శ్రీకాంత్, గోపాల్, రామస్వామి, రాయనర్సు, సంతోష్, జి.స్వామి, జి.శ్రీనివాస్, బక్కయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 374 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



**గోదావరిఖని, జనంసాక్షి :** కొత్తగూడెంలో సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాలో సింగరేణి సంస్థలో అన్ని ఏరియాలకు సంబంధించి 374 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు కూడా అందించారు.ముందుగా సింగరేణిలో ప్రతి ఏరియాకు ఒక్కరు చొప్పున ముఖ్యఅతిథి,స్థానిక శాసనసభ్యులు,కూనంనేని సాంబశివరావు, సింగరేణి సీఎండి ఎన్.బలరాం చేతులమీదుగా అందించారు.తర్వాత మిగతా డిపెండెంట్లంద రికీ జీఎం పర్సనల్ అండ్ సిఎస్ఆర్ జివి కిరణ్ కుమార్, జిఎం పర్సనల్ ఈఈ అండ్ ఆర్సి ఏ.మురళీధర్ అందించారు.ఈ సందర్భంగా రామగుండం-1 ఏరియాకు సంబంధించిన వివిధ గనులు డిపార్ట్మెంట్ల సంబంధిత మాజీ ఉద్యోగుల పిల్లలకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు 26 మందికి ఇచ్చారు.(పదిమంది మహిళా అభ్యర్థులు, 16 మంది పురుషులు)కు అందించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, సింగరేణి డైరెక్టర్లు, కొత్త గూడెం కలెక్టర్, కొత్తగూడెం ఎస్పీ, ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య, ఐఎన్టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్, కొత్త గూడెం జనరల్ మేనేజర్ శాలెం రాజు, కార్పొ రేట్ పర్సనల్ డిపార్ట్మెంట్ జనరల్ మేనేజర్స్, డిప్యూటీ జనరల్ మేనేజర్స్, డిప్యూటీ పర్సన్ మేనేజర్స్, ఏరియా నుంచి ఒక పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారి హాజరయ్యారు.

## హఫీజ్పేట్లో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని హఫీజ్ పేట్లో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికంగా ఉన్న రుమాన్ హోటల్లో అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించినట్లు మాదాపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది పేర్కొన్నారు. వంట గదిలో నూనె ఉండడం కారణంగా మంటలు త్వరగా వ్యాపించాయన్నారు. మంటలను అదుపు చేసేందుకు రెండు గంటలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కిచెన్లో ఉన్న పదార్థాలన్నీ పూర్తిగా కాలిపోయాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు యజమాని పేర్కొన్నాడు.

# సొంతింటి కల నెరవేరిన వేళ

### ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మేడిపల్లి సత్యం



**బోయిన్పల్లి నవంబర్ 16 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ఐల శివరామ్ కు మొదటి విడతలో కేటాయించిన ఇందిరమ్మ ఇల్లును పూర్తి చేసి నేడు గృహ ప్రవేశం చేస్తున్న శుభ సమయాన ముఖ్య అతిథిగా హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలియజేసిన చొప్పదండి శాసనసభ్యులు డ మేడిపల్లి సత్యం. ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మల్లాపూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా కాపు 26వ కార్తీక వనభోజోత్సవం

### ముఖ్య అతిథులుగా బొండాడ రాఘవేంద్రరావు, రచకొండ అదనపు డీసీపీ వెంకటరమణ



**కాప్రా, నవంబర్ 16 (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం కీసరలో కాపు సమాజం ఆధ్వర్యంలో 26వ కార్తీక వనభోజోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. (కాపు, మున్నూరు కాపు, తెలగా, బలిజ, ఒంటరి, తూర్పు కాపు) సమాజాలకు చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వ్యాపారవేత్త బొండాడ రాఘవేంద్రరావు, రాచకొండ అదనపు డీసీపీ వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండాడ రాఘవేంద్రరావు మాట్లాడుతూ చిరు వ్యాపారంతో మొదలుకొని నేను ఎదిగినట్లే ప్రతి యువకుడు కష్టపడి పనిచేస్తే ఏ లక్ష్యమైనా సాధించవచ్చు. పని చేసే స్థాయి నుంచి పని చేయించే స్థాయికి ఎదగాలి. నైతికత, సాహ సం, అవకాశాలను సరిగ్గా వినియోగించుకునే ధైర్యం యువతలో ఉండాలి అని పిలుపునిచ్చారు. సమాజ ఏకతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతిభను సమాజాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. అదనపు డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ సమాజాల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమైనవి. పిల్లలను విదేశాలకు పంపాలనే ఆలోచనలో కాకుండా, దేశంలోనే ఉన్నత చదువులు చదివించి దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా చూడాలి. యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావాలి అని అన్నారు. అంతకుముందు కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా సన్మానించారు. ఆపై భోజన ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరి ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సమాజ ఐక్యతకు తోడ్పడే కార్యక్రమాలతో ముందుకు వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శంకర్ బాబు, దేవరకొండ శ్రీనివాసరావు, డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు, కొత్తపల్లి రాంబాబు, అధ్యక్షులు జీవీఎం రావు, ప్రధాన కార్యదర్శి వి.ఎన్.బి. సత్యనారాయణ, కోశాధికారి ఉంగరాల నాయుడు, వైస్ ప్రెసిడెంట్లు దాసరి ప్రసాద్, నానాజీ, బాలకృష్ణ, ఫుల్ సత్యనారాయణ, కె.వి. బాబు, ఏ.వి. బాబు, కె.వి.బి. రామ్మోహన్ రావు, అమరేందర్ రావు, బండి సాయికుమార్ కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణ కాలనీలో

# విస్తృతంగా పర్యటించిన రజిత పరమేశ్వర్ రెడ్డి

### అభివృద్ధి పనులతో కాలనీలలో సమస్యల పరిష్కారం



**ఉప్పల్ నవంబర్ 16 ( జనం సాక్షి ):** అభివృద్ధి పనులతో ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలలో సమస్యలను పరిష్కరిస్తున్నట్టుగా ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాలనీలలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా చెప్పారు. అదివారం ఉప్పల్ డివిజన్లోని రామంతాపూర్ లక్ష్మీనారాయణ కాలనీలో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్న రజిత పరమేశ్వర్ రెడ్డి ,పరమేశ్వర్ రెడ్డి, లక్ష్మీనారాయణ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి దృష్టికి కాలనీలో ఎదుర్కొంటున్నా ప్రధాన సమస్యలు తీసుకువచ్చారు.కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని రజిత పరమేశ్వర్ రెడ్డి ని కోరారు. దీంతోపాటు డ్రైనేజీ సమస్య కూడా తీవ్రంగా ఉందనే విషయాన్ని రజిత పరమేశ్వర్ రెడ్డి దృష్టికి వివరించారు.లక్ష్మీనారాయణ కాలనీ లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి అతిత్వరలో పనులు ప్రారంభమవుతాయని రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.కాలనీలో సిసి రోడ్డు తోపాటు, డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలను చేపట్టనున్నట్టుగా ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి లక్ష్మీనారాయణ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో లక్ష్మీనారాయణ కాలనీ అధ్యక్షులు లూకాస్, వెంకట్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మధుబాబు ,సుధాకర్ మురళి రెడ్డి దుర్గ మదర్ వల్లి బెస్త రవి బిక్షపతి చారి, అశోక్ గౌడ్, నిరంజన్ హరి పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతపై..

# నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్మన్కు ఫిర్యాదు



**గోదావరిఖని, నవంబర్ 16 (జనం సాక్షి) :** పట్టణంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం కూల్చివేత, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించేందుకు కుల వివక్షతతో పాలకులు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేస్తున్న చర్యలపై ఆదివారం ఎన్టిపిసికి వచ్చిన కిషోర్ మక్వనకు ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్, లవకుశకుమార్కు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది.రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం లోని పలు ప్రాంతాల్లో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతకు అధికారులు పాలకులు కుట్రపూరితంగా కుల వివక్షతతో వ్యవహరిస్తున్నారని, ప్రధానంగా గోదావరిఖని పట్టణంలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందు గల విగ్రహాన్ని కూల్చివేసేందుకు, ప్రయత్నిస్తున్నారని నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్మన్కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారుఅంతేకాకుండా నేషనల్ ఎస్సీ కమిషన్ ద్వారా సింగరేణి యాజమాన్యానికి తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ చేసిన విజ్ఞప్తి మేరకు అధికారికంగా అలాట్మెంట్ చేసిన అంబేద్కర్ భవన స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కమిషన్ చైర్మన్కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు దళితులకు దేవుడు బాబాసాహెబ్ అంబేద్కర్ పేరిట ఉన్న అంబేద్కర్ విగ్రహాలను కూల్చివేయడం అంబేద్కర్ భవన స్థలాన్ని కబ్జా చేయాలని చూడడం పాలకులు అధికారులు కుల వివక్షతతో వ్యవహరిస్తున్నారని వీరుపై తగు చర్యలు తీసుకొని, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను తొలగించకుండా కాపాడవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది. కొంతమంది రాజకీయ నాయకులు పాలకులు, మున్సిపల్ అధికారులు కబ్జా చేసేందుకు వివక్షతతో, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకొని అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించకుండా కాపాడవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది, నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్మన్ ను కలిసిన వారిలో రిటైర్డ్, ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ బూడిద రాజయ్య, ఆల్ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, అంతర్గామ మండల అధ్యక్షులు ఇండిపెల్లి రవీంద్ర కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జనగామ శంకర్ తదితరులున్నారు.

# మావోయిస్టులు..వామపక్ష పార్టీలు ఏకం కావాలి

- ప్రజాస్వామ్య బద్ధంగా హక్కుల సాధనకు పోరాడుదాం
- త్యాగాలు కమ్యూనిస్టులవి భోగాలు మతోన్మాదులవి
- సీపీఐ వందేళ్ల ముగింపు సభను విజయవంతం చేయాలి
- సీపీఐ నేతలు చాడా వెంకట్రెడ్డి, తక్కళ్ళపెల్లి శ్రీనివాసరావు



**గోదావరిఖని, నవంబర్ 16 (జనంసాక్షి) :** దేశంలో ప్రజా కార్మికుల హక్కుల సాధన కోసం మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య బద్దంగా పోరాటాలు నిర్వహించేందుకు మావోయిస్టులు, వామపక్ష పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్ రెడ్డి,సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపెల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 22 వరకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లోని జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకు జరిగే బస్ జాతా ఆదివారం గోదావరిఖని కి చేరుకున్న సందర్భంగా ముందుగా సిపిఐ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు బస్ జాతా కు గంగానగర్ వద్ద స్వాగతం పలుకుతూ అక్కడ నుంచి గోదావరిఖని మెయిన్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీగా వచ్చి బస్ జాతాలో ఉన్న నాయకులకు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో పూలదండలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం చాడా వెంకట్రెడ్డి, తక్కళ్ళపెల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశంలో ఎర్ర జెండా నీడన పని చేస్తున్న మావోయిస్టులు, వామపక్ష పార్టీలు ఐక్యంగా లేక విడిగా ఉండి ఉద్యమాలు చేయడం వల్ల మతోన్మాద పార్టీ లు భోగాలు అనుభవిస్తూ ప్రజలను, కార్మికుల ను అనేక విధాలుగా నష్టం చేస్తున్నాయని, త్యాగాలు కమ్యూనిస్టులవి భోగాలు మతోన్మాదులవి అని వారు పేర్కొన్నారు. అందుకే ప్రజా,కార్మికుల హక్కుల సాధన కోసం మావోయిస్టులు, వామపక్ష పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందని సిపిఐ వంద సంవత్సరాల సందర్భంగా పిలుపు నిస్తుందని వారు పేర్కొన్నారు. దేశంలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిపిఐ పార్టీ ఇప్పటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజల ఆదరణ పొందిందని సిపిఐ త్యాగం వెలకట్టలేనిదని నిజాం పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐ పార్టీ కి ఉందని వారు పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమం,సాయుధ పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి దక్కిందని వారు తెలిపారు.అదేవిధంగా కోల్ బెల్ట్ ప్రాంతంలో ఉన్న సింగరేణి కార్మికులకు చెందిన అనేక సమస్యలపై నిరంతరం పోరాటం నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉన్నదని వారు అన్నారు.2025 డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే వంద సంవత్సరాల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ లకు తాకట్టు పెడుతుందని అదేవిధంగా నిత్యావసర ధరలు అనేక ప్రజా సమస్యలు పట్టించుకోకుండా హిందుత్వం ఏజెండగా పనిచేస్తుందని అలాగే ప్రజల కోసం పనిచేస్తున్న నక్సలైట్ పార్టీ నాయకులను పట్టుకొని చంపుతున్నారని అడివిలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పి కనీసం ఉద్యోగాలు లేక నిరుద్యోగు లు , యువకులు ప్రజలు పట్టణాల్లో కూలీలుగా మారారని వారు అన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరిస్తూ ప్రశ్నించే గొంతులను అర్బన్ నక్సలైట్ పేరుతో అరెస్టు చేయడం ఎన్కౌంటర్లు చేయడం జరుగుతుందని వారు అన్నారు. అదేవిధంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు.సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు కన్నం లక్ష్మి నారాయణ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు,మహిళా సమాఖ్య నాయకురాలు మడికొండ ఓదెమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపూరి సూర్య, నాయకులు ఎల్ ప్రకాష్, కందుకూరి రాజారత్నం, తాళ్ళపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, ఆసాల రమ,తొడుపునూరి రమేశ్ కుమార్, వై.లెనిన్, ఎం.ఎ.గౌస్, ఆర్ లక్ష్మణ్, పడాల కనకరాజు, శేఖర్, కరీం, తిరుమల, ఏ.వి.ఎస్ ప్రకాశ్ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేతగా గర్వించిన భారత్‌కు ఈడెన్ గార్డెన్స్ మైదానం మరోమారు మర్మహీన ఓటమి రాగాని చరిత్రను రచించింది. దక్షిణాఫ్రికా జట్టు మూడో రోజేనే మ్యాచ్‌ను ముగించి, ఇన్నింగ్స్ 30 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని సాధించింది. స్పిన్ ట్రాక్‌గా మారిన ఈడెన్ వాటాయిల్లో టీమిండియా రెండు ఇన్నింగ్స్‌లలోనూ చిరునవ్వులు మాత్రమే చూపింది. కెప్టెన్ తెంబా బవుమా అర్ధశతకంతో బ్యాటింగ్‌ను నడిపించగా, ఆఫ్‌స్పిన్నర్ సైమన్ హార్మర్ (4/30, 4/21) సూపర్ స్పెల్‌తో భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టేసి, 15 ఏళ్లలో మొదటిసారి భారత పర్యటనలో విజయాన్ని సాధించడంతో సఫారీలు మురిసిపోయాయి.



# ఈడెన్‌లో భారత్‌కు షాక్

## ఇన్నింగ్స్ 30 పరుగులతో సఫారీల చారిత్రక విజయం!

- భారత గడ్డపై ఆరో విజయం, మూడో ఇన్నింగ్స్ ట్రయంఫ్
- హార్మర్ మ్యాజిక్ స్పిన్ ట్రాప్‌లో చిక్కుకున్న టీమిండియా
- డబ్ల్యూటీసీలో దక్షిణాఫ్రికా రెండో స్థానానికి ఎదిగింది
- గువాహటిలో 22న తదుపరి యుద్ధం

**ఈడెన్ గార్డెన్స్‌లో టీమిండియాదే గెలుపు అనుకున్న ప్రతిఒక్కరూ కంగుతిన్నారు. స్వల్ప ఛేదనలో తడబడిన భారత ఆటగాళ్లు సమిష్టి వైఫల్యంతో జట్టును ముంచారు. స్పిన్ ట్రాక్‌ను కోరిమరి తయారు చేయించుకున్నప్పటికీ అదే పిచ్ మీద మనోళ్లు చేతులెత్తేశారు. 124 పరుగుల ఛేదనలో అక్షర్ పటేల్(26) మినహా ఏ ఒక్కరూ కూడా క్రీజులో నిలబడకపోవడంతో ఆలౌటై ఘోర పరాభవం చవిచూసింది.**



కోల్‌కతా: మ్యాచ్ మొదలైన మొదటి రోజు నుంచే దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌లో ధైర్యంగా ఆడి, మొదటి ఇన్నింగ్స్‌లో 408/8 డిక్లేర్ చేసుకుంది. ఓపెనర్లైన టానీ డి జర్సీ (82) మరియు డీన్ ఎల్గర్ (65) మొదటి వికెట్‌కు 142 పరుగులు జోడించి భారత బౌలర్లను కష్టపడేసారు. తర్వాత కెప్టెన్ బవుమా (78) మరియు డేవిడ్ బిర్న్ (52)ల మధ్య నాల్గవ వికెట్‌కు 110 పరుగుల పార్టనర్‌షిప్‌తో స్కోర్‌ను 350లకు ఎగురవేశారు. భారత స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్ (3/98) మరియు రవీంద్ర జడేజా (2/112) కొన్ని వికెట్లు తీశారు కానీ, గ్రీన్ పై గ్రీన్ ట్రాక్‌పై దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఆకట్టుకుంది. మ్యాచ్ మొదటి రోజు చివరిలో భారత్ మొదటి ఇన్నింగ్స్‌కు బ్యాటింగ్ చేస్తూ 3/47 వద్ద ఉంది.

రెండో రోజు ఉదయం నుంచే భారత్‌కు వర్షాలు కురిపించాయి. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (12) మరియు రోహిత్ శర్మ (8) తక్కువ స్కోర్‌పై ఔట్ అవుతూ జట్టును కష్టపడేసారు. మధ్యలో శుభ్మన్ గిల్ (45) మరియు విరాట్ కోహ్లీ (32) కొంచెం పోరాడారు కానీ, హార్మర్ మరియు కేషవ్ మహారాజ్ (3/45)ల స్పిన్ దాడితో భారత్ మొదటి ఇన్నింగ్స్‌ను 189 పరుగులకు ముగించింది. హార్మర్ తన మొదటి ఇన్నింగ్స్‌లో 4/30తో రాణించాడు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ విజయం దాటడానికి భారత్‌కు 219 పరుగులు కావాల్సి వచ్చాయి. మరోవైపు, రెండో రోజు చివరిలో దక్షిణాఫ్రికా బౌలర్లు మళ్లీ ఆక్రమణాత్మకంగా ఆడారు.

మూడో రోజు ఉదయం భారత్ రెండో ఇన్నింగ్స్‌కు బ్యాటింగ్ చేస్తూ మొదటి రోజు ఓపెనర్లైన రోహిత్ (5) మరియు శ్రేయస్ అయ్యర్ (11)ను త్వరగా ఔట్ చేసి ఒత్తిడి పెంచారు. స్పిన్ ట్రాక్ మరింత తీవ్రమైంది. హార్మర్ మళ్లీ మ్యాజిక్ చేశాడు – 4/21తో జడేజా (9), అశ్విన్ (0), ఇశాంత్ శర్మ (4)లను తీసి భారత్‌ను 93 పరుగులకే ఆలౌట్ చేశాడు. బ్యాటింగ్‌లో కేఎల్ రాహుల్ (28) మాత్రమే కొంచెం పోరాడాడు కానీ, మిగిలినవారు స్పిన్‌కు బాహుమతి ఇచ్చారు. దక్షిణాఫ్రికా మొత్తం 219 పరుగుల లక్ష్యాన్ని రక్షించుకుని, ఇన్నింగ్స్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో సఫారీలు సిరీస్‌లో 1–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాయి.

ఈ విజయం దక్షిణాఫ్రికాకు చరిత్రాత్మకమైనది. భారత గడ్డపై ఇప్పటివరకు వారికి ఆరు టెస్టు విజయాలు మాత్రమే ఉన్నాయి. వీటిలో మూడు ఇన్నింగ్స్ తేడాతో వచ్చాయి. 1996లో ఈడెన్‌లోనే 329 పరుగుల తేడాతో మొదటి ఇన్నింగ్స్ విజయం సాధించారు. 2000లో ముంబై వాంఖేడేలో 4 వికెట్లతో, అదే ఏడాది బెంగళూరు చిన్నస్వామిలో 71 పరుగులతో గెలిచారు. 2008లో అహ్మదాబాద్‌లో 90 పరుగులతో, 2010లో నాగ్‌పూర్‌లో 6 పరుగులతో చివరి ఇన్నింగ్స్ విజయం వచ్చింది. ఆ తర్వాత 15 ఏళ్లు భారత పర్యటనల్లో సిరీస్‌లు గెలవలేక పోయారు. ఈసారి డబ్ల్యూటీసీ (2025–27) సైకిల్‌లో ఈ విజయం భారత్‌ను నాలుగో స్థానానికి నెట్టేసి, దక్షిణాఫ్రికాను రెండో స్థానానికి ఎదగలేసింది. కెప్టెన్ బవుమా మ్యాచ్ తర్వాత మాట్లాడుతూ, "ఈ ట్రాక్ మాకు అనుకూలంగా ఉంది. హార్మర్ స్పిన్ మ్యాజిక్ మా విజయానికి కీలకం. భారత్‌పై ఇలాంటి విజయం మా జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది" అని అన్నాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం, "స్పిన్‌కు మా బ్యాటింగ్ బలహీనంగా ఉంది. తదుపరి టెస్టులో మార్పు తీసుకురావాలి" అంటూ నిరాశను వ్యక్తం చేశాడు. ఈ సిరీస్‌లో రెండో టెస్టు నవంబర్ 22న గువాహటి సరస్వతీ స్టేడియంలో జరగనుంది. భారత్ తిరిగి బౌన్స్ బ్యాక్ చేసుకునే పోరాటంలో ఉంటుందా? సఫారీలు ఈ ఫారమ్‌ను కొనసాగిస్తాయా? క్రికెట్ భాముకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



### 124 ఛేదన లక్ష్యమే..

#### పిచ్‌కు తప్పేమీ లేదు: గంభీర్

ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాకు ఇన్నింగ్స్ 30 పరుగులతో ఓడిపోయిన భారత్‌కు మరో షాక్.. కోచ్ గౌతం గంభీర్ మాటలు. "124 పరుగుల లక్ష్యం ఏ పిచ్ మీదైనా ఛేదించదగ్గదే. ఈడెన్ ఆడలేని ట్రాక్ కాదు. ఆరంభంలోనే వికెట్లు పడటంతో ఒత్తిడికి లోనయ్యాం" అని గంభీర్ స్పష్టం చేశాడు. పిచ్‌పై విమర్శలు రావడంపై.. "క్యురేటర్ సుజన్ ముఖర్జీ మేము అడిగినట్టే స్పిన్ ట్రాక్ సిద్ధం చేశారు. క్రీజులో ఓపికగా నిలబడి రాహుల్, అక్షర్ పటేల్, సుందర్, బవుమాలు పరుగులు చేశారు కాబట్టి పూర్తి స్పిన్ ట్రాక్ అనడానికి లేదు. బలమైన డిఫెన్స్ ఉంటే పరుగులు చేయడం కష్టమేమీ కాదు" అని వివరించాడు.

తొలి రెండు రోజులు ఆధిపత్యం చెలాయించిన భారత్ మూడో రోజు హార్మర్ (4-21) స్పిన్ ధాటికి 93కే ఆలౌట్ అయింది. మూడో స్థానంలో సాయి సుదర్శన్ బదులు వాషింగ్టన్ సుందర్‌ను ఆడించినందుకు గంభీర్‌పై అభిమానులు మండిపడుతున్నారు. 15 ఏళ్లలో భారత గడ్డపై సఫారీలకు తొలి టెస్టు విజయం సాధ్యమైంది. సిరీస్‌లో 0-1తో వెనుకబడిన టీమిండియా గువాహటి టెస్టు (న.22)లో బౌన్స్ బ్యాక్ చేయాల్సి ఉంది.

ఈడెన్ గార్డెన్స్ వేదికగా శుక్రవారం టెస్ట్ మొదలైంది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌట్ అయ్యింది. టీమిండియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రోటీస్ జట్టును కట్టడి చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల పడగొట్టి దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. సిరాజ్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్ల పడగొట్టగా.. అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కింది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు 189 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దక్షిణాఫ్రికా బౌలర్లు హార్మర్ (వికెట్లు), మార్కో జాన్సన్ (3వికెట్లు) రాణించడంతో టీమిండియా తక్కువ స్కోర్‌కే పరిమితమైంది. దక్షిణాఫ్రికాపై భారత్‌కు 30 పరుగుల లీడ్ లభించింది. ఆ తర్వాత రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 153 పరుగులకు మాత్రమే చేసింది. భారత జట్టుకు 124 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు 93 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు జైస్వాల్ డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు.

## టోక్యో డెఫ్లింపిక్స్‌లో ధనుష్‌కు గోల్డ్

- 252.2 పాయింట్లతో వరల్డ్ రికార్డ్ బద్దలు కొట్టిన ధనుష్
- భారత 1-2 ఫినిష్: ముర్తాజా వెండి, మహిత్-కోమల్‌లకు వెండి-బ్రాంజ్
- రూ.1.20 కోట్లతో ప్రభుత్వ నజరానా
- మిక్స్‌డ్ టీమ్‌లో మహిత్‌తో ధనుష్ పోరాటం



హైదరాబాద్ : తెలంగాణ పారా షూటర్ ధనుష్ శ్రీకాంత్ టోక్యో 25వ డెఫ్లింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో 252.2 పాయింట్లతో వరల్డ్ రికార్డ్ బద్దలు కొట్టి గోల్డ్ సాధించాడు. క్వాలిఫికేషన్‌లో 630.6తో డెఫ్ రికార్డ్ సొంతం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన ముర్తాజా వనియా (250.1) వెండి గెలిచి 1-2 ఫినిష్ అందించాడు. మహిళల్లో మహిత్ సంధు వెండి, కోమల్ బ్రాంజ్ సాధించారు. ఈ విజయానికి తెలంగాణ ప్రభుత్వం రూ.1.20 కోట్ల నగదు ప్రకటించింది. క్రీడా మంత్రి వాకటి శ్రీహరి ఇచ్చిన ఈ నజరానా ధనుష్‌ను ప్రోత్సాహిస్తుంది. 23 ఏళ్ల ధనుష్ 2022 డెఫ్లింపిక్స్‌లో రెండు గోల్డ్‌లు గెలిచిన వారు. రేపు మిక్స్‌డ్ ఈవెంట్‌లో మహిత్‌తో జతకట్టి మరో గోల్డ్ కోసం పోరాడనున్నాడు. భారత్ షూటింగ్‌లో నాలుగు మెడల్స్‌తో బలమైన ఆరంభం చేసింది.

## రాష్ట్రపతి అవార్డు గ్రహీతను అభినందించిన ప్రభుత్వ విప్

**వేములవాడ, నవంబర్ 16 (జనంసాక్షి):** వేములవాడ రూరల్ మండలం నమిలిగుండు పల్లి గ్రామానికి చెందిన యువకుడు మని సాయి వర్మను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ వీప్ ఆది శ్రీనివాస్ ఆదివారం అభినందించారు. నమిలిగుండు పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంగపల్లి మల్లేశం–భాగ్య దంపతుల కుమారుడైన మని సాయి వర్మ ప్రస్తుతం సీఎమ్ఆర్ కాలేజీలో బీటెక్ చదువుతున్నారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ ఎస్.ఎస్ స్వచ్ఛంద సంస్థలో చేరి, సమాజ సేవలో చేసిన అద్భుత కృషికి గుర్తింపుగా.. గత కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు.?ఈ సందర్భంగా, అవార్డు గ్రహీత మని సాయి వర్మ ఆదివారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ వర్మను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. యువత మని సాయి వర్మను స్ఫూర్తిగా తీసుకొని, రాష్ట్రానికి మరెన్నో అవార్డులు తేవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ?అంతేకాక, రాష్ట్రపతి అవార్డు అందుకున్న మని సాయి వర్మకు మరింత ప్రోత్సాహం అందించేందుకు, మరికొద్ది రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసే విధంగా ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



### వేములవాడలో రాజన్న ఐస్ క్రీమ్ పార్లర్ ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ(జనంసాక్షి):వేములవాడ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉండడంతో పాటుగా ఐస్ క్రీమ్ ప్రియులకు రుచి, నాణ్యతతో కూడిన ఐస్ క్రీమ్ లను అందించాలనే సంకల్పంతో పట్టణంలోని శ్రీ బద్ధి పోచమ్మ వీధిలోని పాత కూరగాయల మార్కెట్ కు వెళ్ళే దారిలో శ్రీ రాజన్న ఐస్ క్రీమ్ పార్లర్‌లి ను నెలకొల్పారు. పట్టణానికి చెందిన నాగం మురళి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పార్లర్ ను ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లర్ యజమానాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు

*ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో పాకిస్థాన్ ఏ బౌలర్లను ఉతికేస్తున్న భారత ఏ ఓపెనర్ల జోరుకు బ్రేక్ పడింది. ఆరంభం నుంచి టైమింగ్ కుదరక ఇబ్బంది పడుతున్న ప్రియాన్ష్ ఆర్య(10) ఔటయ్యాడు.*




## సీఎస్కేకు..శాంసన్

### రాజస్థాన్ యజమాని భావోద్వేగం!

జైపూర్ : ఐపీఎల్‌లో అతిపెద్ద ట్రేడ్‌తో సంజూ శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)లో చేరాడు. రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్)కు 14 ఏళ్లు ఆడిన సంజూ, గత సీజన్ ముగిసిన వెంటనే జట్టు మారాలని నిర్ణయించాడు. ఆర్ఆర్ యజమాని మనోజ్ బదలే మాట్లాడుతూ, "సంజూ నిజాయితీపరుడు. ఈ ఏడాది ముందు నుంచే మారాలని చెప్పాడు. మేము షాక్ అయ్యాం. టీమ్ చర్చించాం. అతడు డల్‌గా కనిపించాడు. రాజస్థాన్‌కు ఇష్టం, గౌరవం. 19 సీజన్లలో టైటిల్ లేకపోవడం మార్పు తెచ్చింది. పద్నాలుగేళ్లు సేవలు చేశాడు. కొత్త జర్నీ కోరుకుంటున్నాడు. అభిమానులు అతడి సిక్సర్లు ఎంజాయ్ చేశారు" అని చెప్పాడు. ట్రేడ్‌లో ఆర్ఆర్ జడేజా (రూ.18 కోట్లు), సామ్ కరన్ (రూ.2.4 కోట్లు)ను సీఎస్కే నుంచి తీసుకుంది. సంజూ రూ.14 కోట్లతో చెన్నైలో ఆడనున్నాడు. 2013లో ఆర్ఆర్‌కు చేరిన సంజూ, 2015 తర్వాత ఢిల్లీలో మూడు సీజన్లు ఆడాడు. 2018లో తిరిగి వచ్చి, 2021లో కెప్టెన్‌గా ఫైనల్ చేర్చాడు. గుజరాత్‌కు ఓడిపోయారు. 2025లో గాయాలు, పరాగ్ సారథ్యం, యశస్వీ-వైభవ్ ఓపెనింగ్‌తో ప్రాధాన్యత తగ్గింది. సీజన్ ముగిసిన వెంటనే చెన్నై పోస్టులు పెట్టాడు. న.15న డీల్ ఫైనల్ అయింది. సంజూ 112 మ్యాచ్‌ల్లో 3,045 పరుగులు చేశాడు. చెన్నైలో ధోనీ మార్గదర్శకత్వం కొత్త జీవితం ఇస్తుంది. జడేజా-కరన్‌తో ఆర్ఆర్ బలోపేతం అవుతుంది. 2026 సీజన్ ఉత్తేజకరంగా ఉంటుంది.

# ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసుల?



- అధికారులను ప్రశ్నిస్తే... బాధితుల పక్షాన పోరాడితే కుట్ర కేసులా?
- సామాజిక కార్యకర్తపై పగబట్టిన ఒక పోలీస్ అధికారి?
- ఇది ఎక్కడి రాచరిక వ్యవస్థ... ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న అధికారులు?

ఇది ఎక్కడి రాచరిక వ్యవస్థ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న అధికారులు.ఒక కేసు విషయంలో బాధితుల పక్షాన నిలబడి న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కి వెళ్లి పెట్టిన కేసుపై జరుగుతున్న విచారణ తప్పుగా జరిగిందని బాధితునికి అన్యాయం జరుగుతుందని పోలీస్ అధికారిని ప్రశ్నించినందుకు ఓ సామాజిక కార్యకర్తను పగబట్టి అక్రమ కేసులో ఇరికించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడని మండల వ్యాప్తంగా చర్చ జరుగుతుంది,

**మర్రిగూడ, నవంబర్ 16 (జనం సాక్షి) :**

ఓ మండలంలోని ఒక గ్రామంలో ఒక వ్యక్తి ఇంటిని 15 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి నివాసం ఉంటున్నాడు. ఈ మధ్యకాలంలో సిరాస్తులకు రేట్లు పెరగడంతో గతంలో అమ్మిన ఇల్లు నేను అమ్మలేదని నా ఇల్లులో అక్రమంగా నివాసం ఉంటున్నాడని ఇల్లు అమ్మిన వ్యక్తి కొన్న వారి పైన కేసు పెడతాడు. పోలీస్ అధికారులు దీనిపై సరైన విచారణ చేయకుండానే కొన్న వ్యక్తిపై రెండు కేసులు నమోదు చేసి బైండోవర్ చేయాలని చూశారని ఆ సామాజిక కార్యకర్త దీనిపై న్యాయపోరాటానికి దిగాడని దీని పై జిల్లా పోలీస్ అధికారులు స్పందించి విచారణ చేసి కేసులు తప్పుగా నమోదు చేశారని వ్యక్తిపై పెట్టిన కేసులను తొలగించారని అప్పటినుండి ఆ పోలీస్ అధికారి అతనిపై కక్ష కట్టాడని మండల వసూలు చర్చించుకుంటున్నారు. ఇటీవల ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం కేసులో ఏ1 ను అరెస్టు చేస్తారు. ఆ కేసుకు సంబంధం లేని మరో వ్యక్తి పేరు ఈ దొంగతనం కేసుతో సంబంధం ఉంది అని చెప్పాలని ఇబ్బంది గురి చేసినట్లు ఏ1 సన్నిహితుల వద్ద చెప్పినట్లు సమాచారం.

సమాజంలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకు, అణచివేయడానికి అక్రమ కేసులు బనాయించే ధోరణి పెరుగుతున్నట్లుగా ఇటీవలి కాలంలో వివిధ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినప్పుడు,ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అత్యంత ప్రాథమికమైనది. అయితే, అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తూ తమ అకృత్యాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతం అని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు లోతైన విశ్లేషణ చేసి ఇలాంటి అన్యాయాలు జరగకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు





## సొంతిల్లు ప్రతి ఒక్కరికీ ఓ భరోసా

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, నవంబరు 16 (జనంసాక్షి) :** సొంతిల్లు ప్రతి ఒక్కరికీ ఓ భరోసా అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మండలం లోని తల్లారం గ్రామ వాసి, బొర్ర స్వాతి బంద్యయ్యకి ప్రభుత్వం తరుపున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో వారు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేదవారికి సొంతిల్లు ఓ భరోసా మనకంటూ ఓ గూడు ఉంటే ఆ నీడన కారం, రొట్టె తిన్నా కూడా తృప్తిగా ఉంటుందని.. అసంతృప్తి అనేదే ఉండదని గట్టి నమ్మకం అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
17 నవంబర్ 2025

# అమ్మో కంటైనర్లు!



## హైవేపై కంటైనర్ల జోరు

- రైలు డబ్బాలను తలపిస్తున్న కంటైనర్లు
- గతంలో ఎప్పుడో ఒక్కటి మాత్రమే..
- రోడ్డుపై ఎక్కడ చూసిన కంటైనర్ల వేగమే..
- భయపడుతున్న వాహనదారులు

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : గతంలో ఎప్పుడో ఒకచోట మాత్రమే కనిపించే కంటైనర్లు ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ కనిపించడం. రోడ్డుపైనే నిలిపి ఉంచడం సాధారణంగా మారిపోయింది. దీనిపై జనంసాక్షి దిన పత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం..**

ఇప్పుడు జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే భయం వేస్తోంది. కారణం ఎక్కడి నుంచి ఏ కంటైనర్ వేగంగా దూసుక వస్తుందోనని ఓ భయం చోటు చేసుకుంది. అంతగా రోడ్డుపై కంటైనర్ లు వేగంగా వస్తూ పోతున్నాయి. జాతీయ రహదారిపై ఎక్కువగా లారీలు ఎక్కువగా ప్రయాణం కొనసాగిస్తుంటాయి. అప్పుడప్పుడు ఎక్కడో ఒక చోట ఓ కంటైనర్ కనిపిస్తూ ఉండేది. దాన్ని జనాలు అబ్బో ఎంత పెద్ద లారి అనుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఇప్పుడు వాటి స్థానంలో కంటైనర్లు ప్రయాణం కొనసాగిస్తున్నాయి. ఒక్కో కంటైనర్ పది నుంచి పదిహేను ఫీట్ల ఎత్తులో ఉండి సుమారు ఇరవై అడుగుల పొడవు కలిగి రోడ్డుపై రైలు ఇంజను డబ్బాను తలపిస్తూ అతివేగంతో దూసుక పోతున్నాయి. హైవే రోడ్డుపై ఎక్కడ చూసినా ఇవే ఎక్కువగా కనిపిస్తుండటంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహన దారులు ఎక్కడి నుంచి ఏ కంటైనర్ వచ్చి ఢీ కొడుతుందోనని తీవ్ర భయాందోళనలకు గురి అవుతున్నారు. గత రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న తలమడుగు మండలం దేగామా గ్రామానికి చెందిన ఆత్రం రాంజీ అనే వ్యక్తిని వెనుక నుంచి ఓ పెద్ద కంటైనర్ వచ్చి ఢీ కొట్టడంతో ఆ వ్యక్తి తీవ్ర గాయాల పాలు అయి రిమ్స్ లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. రోజు రోజుకు హైవే రోడ్డుపై కంటైనర్ల సంఖ్య పెరుగుతూ పోతుండటంతో వీటి కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన దారులు భయపడి పోతున్నారు. అదే విధంగా హైవేపై కొంత మంది కంటైనర్ల డ్రైవర్లు వాటిని గంటల పాటు రోడ్డుపై నిలివేసి ఉంచేస్తున్నారు. అలా నిలిపి ఉంచడం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై ఎవరూ పట్టించు కోవడంలేదు. దారి పొడవునా వాయు వేగంతో రయ్ రయ్ మంటూ దూసుక పోతున్న వీటిని చూసి హైవే పై ప్రయాణించే వారు అమ్మో కంటైనర్ అని బయపడుతున్నారు. హైవేపై ప్రయాణం చేయాలంటేనే అమ్మో కంటైనర్లు అని భయం వ్యక్తం చేస్తున్నారు.




# జర్నలిస్ట్ మునీర్ స్మారక కరాటే పోటీలు

- హాజరైన ప్రొఫెసర్ కోదండరాం



**నస్పూర్ (జనంసాక్షి) :** సిసిసి నస్పూర్ సింగరేణి మనోరంజన్ భవన్లో జర్నలిస్టు మునీర్ స్మారక రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు టీజేఎస్ అధినేత,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ కార్మికుల పక్షాన గళాన్ని కలాన్ని మానవత్వాన్ని పంచిన మంచిమనిషి జర్నలిస్టు మునీర్ అని పేర్కొన్నారు.సింగరేణి ప్రాంతంలో సబ్బండ వర్గాలను కలుపుకుని మునీర్ ఉద్యమించిన తీరు ప్రతీ ఒక్కరినీ కదిలించిందన్నారు.అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ మునీర్ నేటి తరానికి ఆదర్శ ప్రాయుడని,ప్రతీ విషయం లో సమాజ హితంగా కార్యక్రమాలు చేసేవారన్నారు.టోర్నమెంట్లో 13జిల్లాల నుంచి 1087 మంది కరాటే క్రీడాకారులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ అశోక్,సీఐ నరేశ్,సీనియర్ అడ్వకేట్ సంధాని,మయూర్,కమలాకర్ రావు, అబ్బాస్, ఉపేందర్,కరాటే మాస్టర్ లు వెంకటేష్, రాజేష్, కరాటే అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జనార్ధన్,తిరుపతి,బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలకంటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్లు పూర్తి చేయండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని వరంగల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఉప్పల్ ఫ్లైఓవర్, నిజామాబాద్ హైవేలో నిర్మిస్తున్న కొంపల్లి ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీని ఎంపీ ఈటెల రాజేందర్ కోరారు. ఆదివారం బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి నాగపూర్‌లో ఆయన నివాసంలో కలిసి సమస్యలు వివరించారు. స్థానిక అధికారులపై ఎంత ఒత్తిడి తీసుకుని వచ్చినా పనులు వేగంగా జరగడం లేదని, ఇప్పటికే వారు ఇచ్చిన గడువులు అన్నీ పూర్తి అయినట్లు చెప్పారు. బాలానగర్ , నరసాపూర్ జాతీయ రహదారిలో ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో ఆ రూట్ లో కూడా ఒక ఫ్లైఓవర్ , నాగార్జునసాగర్ క్రాస్ రోడ్డునుండి అమరావతి వరకు కొత్త హైవే నిర్మాణం జరగుతుందని, ఆ రూట్ కూడా ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉందని సాగర్ ఎక్స్ రోడ్ వైపు కూడా ఫ్లైఓవర్ నిర్మాణానికి మంజూరు చేయాలని మంత్రిని కోరగా త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయాలి

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రనాయక్



**మరిపెడ, నవంబర్ 16(జనం సాక్షి):** డోర్నకల్ నియోజకవర్గంలో మొదటి దశలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇండ్ల బిల్లులుసకాలంలో అందజేయాలని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్ అన్నారు.ఆదివారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో హౌసింగ్ డిపార్ట్మెంట్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డీఈఈ, నియోజకవర్గ మండలాల హౌసింగ్ ఏఈల దగ్గరనుంచిఇందిరమ్మ ఇండ్ల పురోగతి గురించి వివరాలు తెలుసుకొని వారికి తగు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగావారుమాట్లాడుతూ!ఇంది రమ్మ ఇల్లు త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇల్లు వచ్చి ఇంకాపనులుమొదలెట్టని వారిని తొందరగా మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎటువంటి అవకతవకలు లేకుండా పారిదర్శకంగా నిర్వహించాలనీ, అధికారులను ఆదేశించారు. మండలాల ఏఈలు లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి సమస్యలున్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలనీ తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇల్లు మొదలవకముందే మొదటి విడత ఇండ్లన్నీ పూర్తయ్యేలా చూసే బాధ్యత హౌసింగ్ అధికారుల దేనన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ ఆరు మండలాల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ప్రయోజనకరంగా కవిత వ్యాఖ్యలు

- కాంగ్రెస్ ట్రాప్‌లో పడిన జాగృతి అధినేత
- బీఆర్ఎస్ నాయకులపై కవిత వ్యాఖ్యలను ఖండించిన విప్ వివేకానందగౌడ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్‌కు ప్రయోజనకరంగా కవిత వ్యాఖ్యలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో పదేండ్లు ఎంపీ, ఎంఎల్సీ వంటి పదవులలో ఉన్నప్పుడు లేని సమస్యలు ఇప్పుడెందుకు వస్తున్నాయి ? జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదు అని, తీరా ఆ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత బీఆర్ఎస్ పార్టీపై, మాజీ మంత్రులపై వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం ఏమిటీ?' అని బీఆర్ఎస్ శాసనసభ విప్ కేపీ వివేకానంద గౌడ్ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవితను ఉద్దేశించి సూటిగా ప్రశ్నించారు. అలాంటి వ్యాఖ్యలు చేయడం ఎవరి కోసం ? ఎవరి ప్రయోజనాల కోసం ? అంటూ ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ విషయంతో కవిత ఆత్మవిమర్శ చేసుకోవాలి అని హితవు పలికారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ లక్ష్యంగా చేసుకుని కవిత చేసిన వ్యాఖ్యలు చూస్తే.. కాంగ్రెస్కు ప్రయోజకరంగా ఉన్నట్టుగా అనిపిస్తుంది అని ఆయన అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్?? ఉప ఎన్నికలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన అరాచకాలు, రౌడీయిజం, ఈ ఎన్నికలో గెలిచిన తీరు తెన్నులు కనబడలేదా? అని ప్రశ్నించారు. పార్టీ పెడితే పెట్టుకోండి కానీ, ఈ క్రమంలో నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాలి అని హితవు పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి ప్రయోజన కరంగా ఉండే విధంగా కవిత చేసిన వ్యాఖ్యలను ఖండించినట్టు తాను ప్రకటించారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ పార్టీ ట్రాప్‌లో పడింది అని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ ఆరోపించారు. అందుకే బీఆర్ఎస్ మాజీ మంత్రులను విమర్శిస్తుంది అని విమర్శించారు. కేసీఆర్ కూతురిగా బీఆర్ఎస్ పార్టీలో, నాయకులు కార్యకర్తలలో చాలా గౌరవం ఉందని, పార్టీలో సముచిత స్థానం కల్పించారన్నారు. ఇంటి బిడ్డగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో గౌరవించారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల సభ్యసమాజం ఏమనుకుంటుందో అర్థం చేసుకోవాలి అని అన్నారు. జూబ్లీహిల్స్?? ఎన్నికలో బీఆర్ఎస్ కార్యకర్తలను పోరాటాలు చిన్నగా చేసి మాట్లాడారు అని, మరీ అధికార దుర్వినియోగం చేసి, రౌడీయిజంతో అరాచకాలు చేస్తే, అలాంటివి కనబడలేదా? అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును ఇద్దరని ఉద్దేశించి, కృష్ణార్జునులు అని సంభోధిస్తూ, సెటైర్లు వేయడం ఎంతవరకు మంచిది అంటూ.. ఈ సందర్భంగా ఆయన బాధపడ్డారు. ఈ నేపథ్యంలో కవిత చేసిన వ్యాఖ్యలలో ద్వంద్వ వైఖరి కనిపిస్తుందని ఆయన దుయ్యబట్టారు.

# కారంతో భోజనం... కడుపులో మంట

- ఏకలవ్య పాఠశాలలో నార్త్ ఉపాధ్యాయుల తీరుపై పేరెంట్స్ కమిటీ నిలదీత



**కొత్తగూడ, నవంబర్ 16 (జనంసాక్షి) :** ఏజెన్సీ ప్రాంతంలోని మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని పోగుళ్ళ పల్లి లో ఉన్నటువంటి కేంద్ర ఏకలవ్య పాఠశాలలో కొన్ని రోజులనుండి ఉప్పు కారంతో విద్యార్థుల కు భోజనం కడుపులో మంటతో పిల్లలు అవస్థలు పడుతున్నట్లు తెలుస్తుంది.పూర్తి వివరాల్లోకి వెళ్ళగా కూరగాయల, గుడ్లు పంపిణీ చేసే టెండర్ అయిపోయి 15 రోజులు కావస్తున్న నేటి వరకు కూరగాయలు తెప్పించకుండా అందుబాటులో ఉన్న కారం, పప్పు తో భోజనం పెట్టి చేతులు దులుపుకుంటున్నారు.నిన్న జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీసినప్పటికీ పాఠశాల యాజమాన్యం మౌనంతో ఉండడం చర్చనీయాంశంగా మారింది.చివరికి ఈరోజు తల్లిదండ్రుల కమిటీ సభ్యులు వస్తున్నారని భోజనం పెట్టడంతో ఆ భోజనంలో పురుగులు రావడంతో తల్లిదండ్రులు అట్టి భోజనాన్ని బయటపడేసి ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది ఇలా ఉండగా ఏకలవ్య స్కూలు సెంట్రల్ సిలబస్ ఇంగ్లీష్ మీడియం అయినప్పటికీ ఉత్తర భారతదేశం నుండి వచ్చిన ఉపాధ్యాయులు పూర్తిగా హిందీలోనే బోధిస్తున్నారని, అర్థం కాకపోవడం తో విద్యార్థులు చదువుల లో వెనుకబడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉదయం 8 గంటలకు వచ్చిన ఉపాధ్యాయులు మధ్యాహ్న ఒంటిగంట వరకే ఉండి ప్రభుత్వం కల్పించిన క్వార్టర్స్ లోకి వెళ్లిపోయి మళ్లీ పిల్లల ముఖం చూసిన సందర్భాలు లేవు మరుసటి రోజు 8 గంటలకు మాత్రమే ఉపాధ్యాయు లు ప్రత్యక్షమవుతున్నారని అసలు పాఠశాలలో విద్యార్థులు ఏం చేస్తున్నారని కూడా పట్టించుకోవడం లేదని పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఏకలవ్య స్కూలుకు చైర్మన్గా ఉన్న జిల్లా కలెక్టర్ స్పందించి పాఠశాల యాజమాన్యం పై చర్య లు తీసుకోవాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

# అందెశ్రీ కుటుంబానికి సీఎం సతీమణి పరామర్శ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రగీతం రచయిత అందెశ్రీ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. కాగా నేడు సీఎం రేవంత్ రెడ్డి సతీమణి లాలాపేటలోని అందెశ్రీ ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. గీతా రెడ్డితో పాటు వారి కూతురు, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. తెలంగాణ ప్రభుత్వం అందెశ్రీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉంటే అందెశ్రీకి సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేక అనుబంధం ఉన్న సంగతి తెలిసిందే. గతంలో అందెశ్రీని ఇంటికి ఆహ్వానించి రేవంత్ రెడ్డి దంపతులు సన్మానించారు. అందెశ్రీ చనిపోయిన తరవాత సైతం రేవంత్ రెడ్డి స్వయంగా అంత్యక్రియలకు హాజరయ్యారు. అక్కడితో ఆగకుండా అందెశ్రీ పాడెను మోశారు. ఇక ఇప్పుడు గీతారెడ్డి స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించడం విశేషం.

# ధనుష్ శ్రీకాంత్‌కు కోటీ 20 లక్షల రూపాయల ప్రోత్సాహం

- క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లను పెంచుతాం
- హన్మకొండలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభించిన మంత్రి



**హన్మకొండ (జనంసాక్షి) :** టోక్యో డెఫ్లింపిక్స్ 2025 లో గోల్డ్ మెడల్ సాధించిన ధనుష్ శ్రీకాంత్ కు శుభాకాంక్షలు తెలుపుతూ స్పోర్ట్స్ పాలసీ లో భాగంగా షూటర్ ధనుష్ కు ప్రభుత్వం తరుపున 1కోటి 20 లక్షల రూపాయల ప్రోత్సాహం అందచేస్తామని క్రీడాశాఖ మంత్రి వెల్లడించారు.ఆదివారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం లో తెలంగాణ స్పోర్ట్స్ నూతన స్కూల్ ను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.క్రీడల్లో క్రమశిక్షణ చాలా అవసరమని,ఏకాగ్రత ఉంటేనే క్రీడల్లో రాణించగలమని విద్యార్థులు ఏకాగ్రత పెంచుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ కన్నా చిన్న దేశమైన సౌత్ కొరియా ఒలంపిక్స్ లో 36 స్వర్ణ పథకాలు గెలిచిందని, కానీ మనం ఒలంపిక్స్ లో ఎందుకు పథకాలు గెలవలేక పోతున్నామో విద్యార్థులు ఆలోచించుకోవాలన్నారు.స్పోర్ట్స్ స్కూల్లో జాయిన్ అయినవారు వీడియో గేమ్స్,టీవీలు,మొబైల్స్ లాంటి వ్యాపకాలపై దృష్టి మరల్చకుండా కేవలం క్రీడలపైనే ఆసక్తి కనబరచాలన్నారు.జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లను పెంచే యోచన చేస్తామని తెలిపారు.స్పోర్ట్స్ అథారిటీ లీగ్ తెలంగాణ 2025-26 విద్యా సంవత్సరం కోసం 80 మంది బాల బాలికలతో హన్మకొండ లో స్పోర్ట్స్ స్కూల్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని, దీంతో గ్రామీణ స్థాయి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.చిన్న వయసు నుంచే ప్రతిభావంతులను గుర్తించి వారికి పోషణ,శిక్షణ,శారీరకంగా దృఢంగా ఉండి క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందని మంత్రి తెలియజేశారు.ఈ పాలసీ ద్వారా ప్రతి జిల్లాలో ఆధునిక స్టేడియాలు, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రం స్పోర్ట్స్ హబ్ ఆఫ్ ఇండియాగా ఎదగడమే స్పోర్ట్స్ పాలసీ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపిస్తుందని ఈ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ మేనేజ్మెంట్ వంటి రంగాల్లో విద్యను అందించడం జరుగుతుందని తెలియజేశారు.ఇప్పటికే కోచ్ కోసం గురు వందనం పథకం కింద తెలంగాణ క్రీడా శాఖ కోచ్ల కోసం మొదటిసారిగా సంక్షేమ పథకం ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా కోచ్ లకు 15 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు.రాష్ట్రంలోని అన్ని స్టేడియాల్లో వేసవి శిక్షణ శిబిరాలు, శిక్షణ కార్యక్రమాల కోసం ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొదటిసారిగా షేపింగ్ యంగ్ ఇండియా2025 పేరుతో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించామని తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించడం కోసం సీఎం కప్ 2024 ను నిర్వహించామన్నారు. మొదటిసారిగా పారా గేమ్స్ ను కూడా ఈ టోర్నమెంట్లో చేర్చడం జరిగిందని భవిష్యత్తులో మరింత కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, కిట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,కడియం శ్రీహరి,నాగరాజు, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య,మేయర్ గుండు సుధారాణి,సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370